

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY
22.6.2023
హైదరాబాద్ HYDERABAD
పేజీలు: 16+16/12 Pages: 14+16/12

సంపుటి (Volume): 13 ॥ సంచిక (Issue): 17 ॥
వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

గుండె గుడిలో అఖండ దీపం

అమరులారా వందనం.. మీ త్యాగం వృథా పోలేదు
మీ స్ఫూర్తి సకల జనుల చైతన్య దీప్తిగా మారింది
మీ సర్వోన్నత త్యాగం మా సంకల్పాన్ని జ్వలించింది
మీ ఆశయం ఫలించింది.. అమరులారా వందనం
గాలి మీ గాథల్ని గానం చేసింది
కాలం ద్రవించి కన్నీటి ప్రవాహమైంది
అమరులారా.. మీ ఆత్మార్పణం నాటిన అగ్నిబీజాలు
ఆగ్రహవృక్షాలై ఆకాశం మీదకు ఎగబాకాయి..
మీ ఆర్తి గుండెలను తడిపే ఉప్పెనై ఉవ్వెత్తున ఎగసింది..
అమరులారా ఒక్కసారి ఇటుచూడండి
ఇదిగో మీరు కలలుగన్న తెలంగాణ సాకారమైంది
సమున్నత కీర్తి పతాకమై రెపరెపలాడుతున్నది
దేశానికే దారిదివ్వెగా వెలుగులీనుతున్నది
అమరులారా అందుకోండి.. సహృదయ జోహారులు



భవిష్యత్తు తెలంగాణలో అభివృద్ధి చాలా శీఘ్రంగా జరుగుతుంది. నీళ్లలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయంపాలనలో శాసిస్తాం. ఇతరుల పాలనలో యాచిస్తున్నాం. పెద్ద ప్రాజెక్టుల సంగతి కాసేపు పక్కన పెడితే..నిజాం కాలంనాటికే తెలంగాణ ప్రాంతంలో గొలుసు చెరువులు చాలా ఉండేవి. ఉద్దేశ పూర్వకంగానే వాటిని నాశనం చేశారు. తెలంగాణ వస్తే మొదటగా ఈ చెరువులను పునరుద్ధరించాలి. అన్నీ సాధ్యం కాకపోవచ్చు. అయినా వీటిని బాగు చేస్తే..గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. ఇక నిజాం కాలంలో విద్య, వైద్యం రెండూ ఉచితమే.. అయితే వీటన్నింటిని వారు నాశనం చేశారు. అభివృద్ధి అంటారు కానీ వాళ్లు ఇక్కడ ఒక్క దవాఖానగానీ, కాలేజీనిగానీ కట్టారా? ముఖ్యంగా వనరుల కొరత ఉండదు. ఇప్పుడు వాటిని ఇష్టానుసారంగా, అక్రమంగా తరలించుకుపోతున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మన పైసలు మనం వాడుకుంటాం.

- తెలంగాణ ఏర్పాటుకు ముందు జయశంకర్ సార్

అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి

నేడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అమరజ్యోతి ప్రారంభం

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు నేటితో ముగింపు

తరతరాలకు స్ఫూర్తినిచ్చేలా.. అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకొనేలా హైదరాబాద్ నడిబొడ్డున రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అమరవీరుల స్మారక చిహ్నాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం ప్రారంభించనున్నారు. ఆయన చేతుల మీదుగా 'తెలంగాణ అమరుల స్మారకం-అమర దీపం' కార్యక్రమం జరుగనున్నది. › 2

సాయంత్రం 6:30 గంటలకు సీఎం కేసీఆర్.. ప్రాంగణానికి చేరుకొంటారు. అనంతరం 12 తుపాకులతో అమరవీరులకు గన్ సెల్యూట్ ఉంటుంది. తర్వాత తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసి, అమర జ్యోతిని సీఎం ప్రారంభిస్తారు. అటు 21 రోజులపాటు అంగరంగ వైభవంగా సాగిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి.

ఆసియాలోనే అతిపెద్ద గృహసముదాయం

- 145 ఎకరాల్లో 1489.29 కోట్లతో కేసీఆర్ నగర్
- నేడు కొల్లూరు డిగ్నిటీ హౌసింగ్ కాలనీ ప్రారంభం
- 15,660 ఇండ్ల నిర్మాణ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేయనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ › 2

రాష్ట్రంలో రైల్ కోచ్‌ల తయారీ

- వెయ్యి కోట్లతో మేధా గ్రూప్ ఫ్యాక్టరీ
- నేడు ప్రారంభించనున్న కేసీఆర్ › 8

మీకు నచ్చినట్టు..

ఇల్లు కట్టుకోవచ్చు..

'గృహలక్ష్మి' పథకానికి మార్గదర్శకాలు జారీ

ఈ ఏడాదికి 4,00,000 ఇండ్లు కేటాయింపు


సొంత స్థలం ఉంటే రూ. 3 లక్షలు మంజూరు.. మహిళల పేరుమీదే సాయం

కుటుంబానికి ఆహార భద్రత కార్డు ఉండాలి.. 80% బడుగు బలహీన వర్గాలకే

జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల ప్రక్రియ

రెండు గదులు, టాయిలెట్ తప్పనిసరి.. రూ.12 వేల కోట్లతో పథకం

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): పేదల గృహ నిర్మాణ పథకం 'గృహలక్ష్మి'కి లైన్ క్లియరైంది. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఇక దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నది. సొంత జాగా ఉన్న పేదలకు మూడు దశల్లో రూ.3 లక్షలు (పూర్తి సబ్సిడీ) మంజూరు చేస్తారు. గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించింది. సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికోసం ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3,000 ఇండ్ల చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. మార్గదర్శకాల ప్రకారం.. ఇంటిని లబ్ధిదారు › 6వ పేజీలో



వర్షం వచ్చినట్టు..

రాష్ట్రాన్ని తాకిన నైరుతి

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వానలు

రాష్ట్రమంతా చల్లబడిన వాతావరణం

తొలకరి పలకరించింది.. వానలు మొదలయ్యాయి.. వేయి కండ్లతో ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకతో రాష్ట్రమంతా చల్లబడింది. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో బుధవారం సాయంత్రం నుంచే వాన జోరుగా కురుస్తున్నది. గురువారం నాటికి తెలంగాణను నైరుతి తాకుతుందని వాతావరణ అధికారులు వెల్లడించినా.. బుధవారమే రాష్ట్రంలోకి రుతుపవనాలు వచ్చేశాయి.

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకాయి. బుధవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురిసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. రాగల రెండు, మూడు రోజుల్లో దక్షిణ భారతదేశంలోని మరికొన్ని భాగాలకు నైరుతి విస్తరించే అవకాశాలున్నాయి. దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయవ్య దిశ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వీస్తున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాత్రి 8 గంటల వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో అత్యధికంగా 2.2 సెం.మీ, మాదాపూర్, బీహెచ్ఈఎల్‌లో 1.8, ఖాజాగూడ, హఫీజ్‌పేట, చర్లపల్లిలో 1.7, ఏఎస్‌రావునగర్, జూబ్లీహిల్స్, హైదర్‌నగర్‌లో 1.5, మల్లాపూర్, తిరుమలగిరి, కాప్రాలో 1.2 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

జూలైలో కొత్తగా 300 అమ్మ ఒడి వాహనాలు › 3

34 పరమపద, '204' 108 వాహనాలు కూడా..

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

లక్ష సాయం కోసం 5.28 లక్షల దరఖాస్తులు

అత్యధికంగా రజకుల నుంచి 1.18 లక్షలు

క్షేత్రస్థాయిలో అర్హుల పరిశీలన ప్రారంభం › 3

26 వరకు అర్హుల గుర్తింపు

ప్రతినెలా 15వ తేదీన పథకం గ్రౌండింగ్

హైదరాబాద్‌లో లాయిడ్స్

భారీ పెట్టుబడితో వస్తున్న బ్రిటన్ బ్యాంకింగ్ గ్రూప్



బ్రిటన్ పర్యటనలో భాగంగా లాయిడ్స్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ (ఫైల్ ఫొటో)

తొలుత 600 మందికి ఉద్యోగావకాశాలు

నగరంలోని బ్యాంకింగ్ సర్వీసెస్ బలోపేతానికి ఊతం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు మరో భారీ పెట్టుబడి రానున్నది. బ్రిటన్‌కు చెందిన ఆర్థిక సేవల దిగ్గజం లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్.. హైదరాబాద్‌లో తమ నూతన టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించబోతున్నది. గతనెల బ్రిటన్ పర్యటనలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావుతో సమావేశం జరిగిన నేపథ్యంలో 5 వారాల్లోనే పెట్టుబడి పెట్టేందుకు లాయిడ్స్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. రాబోయే మూడేండ్లకుపైగా కాలంలో › 8వ పేజీలో

కాళేశ్వరం ఎత్తిపోత ప్రారంభం

మిడ్‌మానేరు నుంచి రంగనాయకసాగర్‌కు జలాల తరలింపు

ఒక్కో పంపు ద్వారా 3,400 క్యూసెక్కుల నీరు ఎత్తిపోత

గోదావరి జలాలను చూస్తుంటే ఆనందంగా ఉంది: హరీశ్

కాళేశ్వరం ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. రుతుపవనాలు ఆలస్యం కావటంతో రైతులు వానకాలం పంటల సాగు మొదలు పెట్టేందుకు శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి రంగనాయకసాగర్‌కు నీటి తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. బుధవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం నుంచి రంగనాయకసాగర్‌లోకి నీటిని విడుదల చేశారు. వర్షాలు ఆలస్యం కావటంతో రైతులు వరి నారు వేసుకొనేందుకు వీలుగా నీటిని విడుదల చేశామని ఆయన వెల్లడించారు. › 5





బీఆర్‌ఎస్‌లో చేరిన అనంతరం పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ ఐజీ, విశ్రాంత ఐపీఎస్ విఠల్ జాదవ్ తదితరులు

బీఆర్ఎస్‌లోకి విశ్రాంత ఐపీఎస్

సీఎం కేసీఆర్ సమక్షంలో చేరిన మహారాష్ట్ర మాజీ ఐజీ విఠల్ జాదవ్

ప్రముఖ నృత్యకారిణి సురేఖా పుణెకర్.. సామాజిక కార్యకర్తలతోపాటు పలువురి చేరిక

దేశమంతా రైతు సర్కార్..అందుకే బీఆర్ఎస్: పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, జూన్21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం పలువురు ప్రముఖులు బీఆర్ఎస్‌లో చేరారు. మహారాష్ట్రకు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, మహారాష్ట్ర ఐజీగా పనిచేసిన విఠల్ జాదవ్‌తోపాటు మహారాష్ట్ర సినీ రంగానికి చెందిన ప్రఖ్యాత నృత్యకళాకారిణి సురేఖ పుణెకర్, సామాజిక కార్యకర్త శేఖర్ అంబేకర్, ఉమాకాంత్ మంగ్రూలే, లాతూర్, ఉస్మానాబాద్ జిల్లాల నుంచి ఆమ్‌ఆద్మీపార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, పలువురు రాజకీయ నాయకులు, బీజేపీకి చెందిన ప్రముఖులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రైతు సర్కార్ అధికారంలోకి రావటం వల్లే తొమ్మిదేండ్ల అనతికాలంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా › 6వ పేజీలో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 23.6.2023 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+20/12 Pages: 12+20/12 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 18 ‖ వెల (Price) రూ.6.50 | స్కంధ పంచమి

సూర్యోదయం: 5-43, సూర్యాస్తమయం: 6-53. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: పంచమి రాత్రి 7-54 వరకు. నక్షత్రం: మఖ పూర్తి. వర్జ్యం: సాయంత్రం 5-49 నుంచి రాత్రి 7-37 వరకు. రాహుకాలం: ఉదయం 10-39 నుంచి పగలు 12-18 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-21 నుంచి ఉదయం 9-14 వరకు, పగలు 12-44 నుంచి పగలు 1-37 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 4-36 నుంచి మర్నాడు ఉదయం 6-24 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఆశయం అమరం

తెలంగాణ పునరంకితం

ఉరితాళ్లను.. పూలదండలు చేసుకున్నవారికి
పురుగు మందులను.. పరమాన్నంలా తాగిన వారికి
పెట్రోలుతో.. పుణ్యస్నానాలు ఆచరించిన వారికి
రైలు పట్టాల సాక్షిగా.. అమరత్వపు మెట్లెక్కిన వారికి
మన యోధులకు.. మన తెలంగాణ అమరవీరులకు..

జోహార్లు.. జోహార్లు.. జోహార్లు..

ఆ ఆత్మార్పణ వృథా కాలేదు.
తెలంగాణ బిడ్డల వందేండ్ల నిండు జీవితాలను
త్యాగం చేసిన ఫలమే.. ఈ పదేండ్ల పండుగ.
చీకట్లతో కొట్లాట ఫలితం.. నిరంతర విద్యుత్తు కాంతులు
కన్నీళ్లను దిగమింగిన దాఖలాలు.. కాళేశ్వరం జలాలు
నిరుద్యోగుల ఆక్రందన ప్రభావాలు.. స్థానికులకే ఉద్యోగాలు
పోలీసుల తుపాకులకు ఎదురొడ్డిన గుండెబలం..
దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన సుసంపన్న రాష్ట్రం
మొక్కుబడిగా గుర్తుచేసుకోవడానికి
మరిచిపోయేంత చిన్న త్యాగమా అది?
మూడు నిమిషాల మౌనంతో తీరిపోయే రుణమా అది?
తెలంగాణ కలలను సాకారం చేశారు.

వారి సంకల్పానికి సలాం..

21 రోజులపాటు ఘనంగా జరిగిన తెలంగాణ అవతరణ దశాబ్ది సంబురాలకు ఇది పతాక సన్నివేశం. అట్టహాసంగా నిర్వహించిన వేడుకలకు ఇది భావోద్వేగ ముగింపు.

రాష్ట్రసాధన కోసం అసువులు బాసిన అమరులకు గుండెల్లో గుడి కట్టుకున్నది తెలంగాణ. హైదరాబాద్ నడిబొడ్డున సగర్వంగా అమరజ్యోతిని వెలిగించుకున్నది. 'జై తెలంగాణ' అంటూ పిడికిలెత్తితే రబ్బరు బుల్లెట్లు, బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు విరుచుకుపడిన చోట.. ఇనుపకంచెలను చీల్చుకుని సాగర తీరాన మిలియన్ మార్చ్‌లో ఒక్కగొంతుకై నినదించిన చోట.. అస్తిత్వ పతాకను సమున్నతంగా ఎగురవేసిన అపూర్వ క్షణాలివి. అమరుల యాదిలో ఆర్ద్రనయనాల ఉద్విగ్న క్షణాలివి. నాటి తలపులతో తల్లడిల్లిన చోట.. త్యాగధనుల స్ఫూర్తిని తరతరాలు యాది చేసుకునేలా మహా దీపకళికను వెలిగించుకున్న సందర్భమిది.

ఆనాటి ఉద్యమ నేత.. ఈనాడు ముఖ్యమంత్రి. పదేండ్ల తెలంగాణ ప్రగతి పాదముద్రలు దేశానికి కొత్త బాటను చూపుతున్న తరుణంలో.. గడిచిన క్షణాలను, నడిచివచ్చిన దారిని, ఉద్యమ సహచరులను గుర్తు చేసుకున్నారు కేసీఆర్. ప్రపంచమే అబ్బురపడేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించుకున్న అమరజ్యోతిని గురువారం హుస్సేన్‌సాగర్ తీరాన ఆయన ప్రారంభించారు. తెలంగాణ వీరుల త్యాగాలను, ఉద్యమకాలపు స్మృతులను గుర్తు చేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు.

ప్రగతిశీల పాలన తెలంగాణ బిడ్డల తల నిమురుతున్నప్పుడు..
సంక్షేమ సారథి కడుపులో పెట్టుకొని కాపాడుతున్నప్పుడు...
ఆర్తులను, అసహాయులను గడువ పట్టుకొని ఓదారుస్తున్నప్పుడు
రేపటిని కలగన్న అమరులు దిగంతాల మీదినుంచి దీవిస్తున్నరేమో!



హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం జరిగిన అమరజ్యోతి ప్రారంభ వేదికపై త్యాగధనుల కుటుంబసభ్యులను గౌరవించుకుంటున్న సందర్భంలోనిదీ చిత్రం. భావోద్వేగానికి లోనైన అమరుడు పోలీస్ కిష్టయ్య సతీమణి పద్మావతిని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- పాలకుల్లో స్ఫూర్తి రగిలించేలా ఆకాశమంత దీపకళిక
- యువకిశోరాల బలిదానాలు తీవ్రంగా కలిచివేశాయి
- ఆఫీసు కూలగొట్టిన చోటే.. అమరజ్యోతి నిర్మాణం
- ఇకపై ప్రముఖులు ఎవరొచ్చినా ఇక్కడే తొలివందనం
- నాపై జరిగినంత దాడి ఏ నేత పైనా జరుగలేదు
- అమరజ్యోతి ప్రారంభ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- అమరుల స్థూపం నుంచి అమరుల దీపం దాకా..
- జూన్ 2న గన్‌పార్క్‌లో మొదలైన దశాబ్ది సంబురాలు
- మూడు వారాల వేడుకలు స్మృతిజ్యోతి వద్ద పరిసమాప్తం



హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం అమరజ్యోతి ప్రారంభ కార్యక్రమం సందర్భంగా జరిగిన డ్రోన్‌షోలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ చిత్రం

అమరులను స్మరించుకుంటూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ముగింపు పలకాలని అనుకున్నాం. రాష్ట్ర ఉద్యమ చరిత్ర చాలా పెద్దది. అమరుల త్యాగాలు వెలకట్టలేనివి. తీవ్రంగా కలిచివేసిన బలిదానాలు వారివి. ఈ రోజు రెండు పార్శ్వాలు కలగలిసిన రోజు. సంతోషం ఒక పాలు. విషాదం రెండు పాళ్లుగా ఉన్నాయి.
- సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): 'అమరుల త్యాగాలు నిత్యం మనకు స్ఫురణకు వచ్చేలా, ఎంతమంది త్యాగాలతో ఈ తెలంగాణ రాష్ట్రం వచ్చిందో, మనం ఎంత జాగ్రత్తతో దీనిని ముందుకు తీసుకుపోవాలో సీఎంలు, సీఎస్‌లు, మంత్రులందరికీ తెలియజెప్పేలా అమర జ్యోతికి రూపకల్పన చేశాం' అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. నిర్మాణం ప్రత్యేకంగా ఉండేలా, అమరులకు నిత్యం జ్యోతి పట్టినట్టుగా దీపకళిక నిర్మాణం చేపట్టామని చెప్పారు. సచివాలయం ముందు నిర్మించిన అమరజ్యోతిని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని ఉద్యమం నడిపానని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఉద్యమం ప్రారంభించామని, ఒక్క బలిదానం కూడా జరుగకూడదని అహర్నిశలు › 2వ పేజీలో

సంక్షేమ పథం



కొల్లూరులో డిగ్నిటీ హౌజింగ్ కాలనీని ప్రారంభించిన అనంతరం డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

వచ్చే నెలలో చనకా కొరాటా

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ నదిపై తెలంగాణ, మహారాష్ట్ర అంతరాష్ట్ర ప్రాజెక్టు చనకా కొరాటా (రుద్ర) బరాజ్, ఎత్తిపోతల పథకాన్ని జూలై మొదటివారంలో సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,500 ఎకరాలకు, గ్రావిటీ కెనాల్ ద్వారా 48 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో 80 కిలోమీటర్ల కెనాల్ ఉండగా అందులో 48 కిలోమీటర్ల వద్ద 5 పంపులతో నీటిని ఎత్తిపోయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని తాంసీ, జైనథ్, ఆదిలాబాద్ మండలాల్లోని 14 గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలనేది లక్ష్యం. అలాగే మహారాష్ట్ర యావత్మల్ జిల్లాలోని కేలాపూర్ తహసీల్ పరిధిలో 8 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించనున్నారు. ఈ బరాజ్ మహారాష్ట్ర-తెలంగాణ సంయుక్త ప్రాజెక్టు అయినప్పటికీ పూర్తిస్థాయి నిధులతో దీని నిర్మాణాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టింది.

ప్రగతి రథం



రంగారెడ్డి జిల్లా కొండకల్‌లో మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గురువారం ప్రారంభించిన అనంతరం యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు కేటీఆర్, సబిత, ఎమ్మెల్సీలు పల్లా, పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

బయోమెట్రిక్.. సమయం వృథా

- ఆఖరి నిమిషంలో వచ్చేవారు అవకాశం కోల్పోయే ప్రమాదం
- ప్రీప్రింటెడ్‌తో గందరగోళం
- ఓఎంఆర్ నింపటమే బెటర్
- గ్రూప్-1 మార్పులపై నిపుణులు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో తొలిసారి బయోమెట్రిక్ తీసుకొని, రెండోసారి తీసుకోకపోవటంపై చర్చ నడుస్తున్న నేపథ్యంలో.. అభ్యర్థుల కోణంలో ఆలోచించే టీఎస్‌పీఎస్సీ బయోమెట్రిక్ తీసుకోలేదని విద్యారంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తొలిసారి పరీక్ష నిర్వహించినప్పుడు బయోమెట్రిక్ వల్ల అభ్యర్థులకు ఆలస్యం అవుతున్నట్టు గుర్తించిందని, అందుకే ఈసారి ఆ విధానాన్ని నిలిపివేసిందని విశ్లేషిస్తున్నారు. బయోమెట్రిక్ వల్ల గతంలో అభ్యర్థులు విలువైన సమయాన్ని కోల్పోయారని వెల్లడించారు. అదీకాక.. ప్రీ ప్రింటెడ్ విధానంతో గతంలో తప్పులు జరిగాయని, ఓ అభ్యర్థి గైర్హాజరు వల్ల మిగతా అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు మారిపోయాయని నిపుణులు వివరించారు. ఆ తప్పులను గుర్తించిన టీఎస్‌పీఎస్సీ.. అభ్యర్థే ఓఎంఆర్‌పై వివరాలు నింపే అవకాశం కల్పించిందని తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఖర్చు › 9వ పేజీలో

నైరుతి వచ్చేసింది

- ఖమ్మం జిల్లాను తాకిన రుతుపవనాలు.. పలుచోట్ల వర్షాలు
- రేపో మాపో ఇతర ప్రాంతాలకు..
- మూడ్రోజులు వర్షాలకు అవకాశం
- వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తీవ్రమైన ఎండలు, వడగాలులతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్టు వెల్లడించింది. రెండు, మూడు రోజుల్లో అవి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాయని తెలిపింది. మూడు రోజులు ఉమ్మడి ఖమ్మంతో పాటు ములుగు, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన › 9వ పేజీలో



దశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమైన స్మారక చిహ్నం

అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి

- నేడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అమరుల స్మృతిచిహ్నం ప్రారంభం
- నేటితో దశాబ్ది ఉత్సవాల ముగింపు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాధన ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకొన్న వారి త్యాగాలు నిత్యం ప్రజ్వరిల్లేలా.. తరతరాలకు స్ఫూర్తి రగిలించేలా తెలంగాణ సర్కారు హైదరాబాద్ నడిబొడ్డున అమరవీరుల స్మారక చిహ్నం నిర్మించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ఈ స్మారక చిహ్నన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఆయన చేతుల మీదు గా 'తెలంగాణ అమరుల స్మారకం– అమర దీపం' ప్రజ్వలన కార్యక్రమం జరుగనున్నది. హైదరాబాద్ నడిబొడ్డున యావత్తు తెలంగాణ సమాజం గర్వించే మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానున్నది. త్యాగధనుల ఆశయాలు నిత్యం స్ఫురణకు వచ్చేలా ప్రభుత్వం నిర్మించిన 'అమర దీపం' హుస్సేన్ సాగర్ తీరాన రోజూ దేదీప్యమానమై వెలుగనున్నది. తద్వారా రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వం నిత్యం నివాళి అర్పించనున్నది.

మంత్రి వేముల నేతృత్వంలో ఏర్పాట్లు

అమరుల స్మారకం ప్రారంభ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో జీహెచ్ఎంసీ, పోలీసు తదితర విభాగాల అధికారులు ప్రారంభ ఏర్పాట్లను సమీక్షించారు. సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ విగ్రహం నుంచి 6 వేల మంది కళాకారులతో స్మారక చిహ్నం వరకు ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు సీఎం కేసీఆర్ ప్రాంగణానికి చేరుకొంటారు. అనంతరం 12 తుపాకులతో అమరవీరులకు గన్ సెల్యూట్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసి, అమర జ్యోతిని సీఎం ప్రారంభిస్తారు. ఆ వెంటనే సభావేదికపైకి చేరుకొంటారు. అమరులకు నివాళిగా గేయాలను ఆలపిస్తారు. సభలో 10వేల మంది క్యాండిల్ లైట్స్ ప్రదర్శిస్తూ అమరులకు నివాళులర్పిస్తారు. అనంతరం సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. ఎంపికచేసిన ఆరుగురు అమరుల కుటుంబాలను సన్మానిస్తారు. అలాగే, లేజర్, 800 డ్రోన్లతో షో నిర్వహించనున్నారు.

సీఎం కేసీఆర్ నేటి పర్యటన షెడ్యూల్

హైదరాబాద్, జూన్21 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభిస్తారు. అనంతరం కొండకల్ చేరుకొని మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించి, ఉద్యోగులనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పటాన్‌చెరులో నిర్మించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనులకు శంకుస్థాపన చేసి సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6.15 గంటలకు అమరవీరుల స్మారకం ప్రాంగణానికి చేరుకొంటారు. గన్ సెల్యూట్ అనంతరం అమరుల స్మారక చిహ్నన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొంటారు.

నేడు అమరవీరులకు నివాళి

- ఉదయం 11 గంటలకు మౌనం పాటించాలి: సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ అమరులకు నివాళిగా గురువారం ఉదయం 11 గంటలకు మౌనం పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. అన్ని జిల్లాల్లో అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించాలని, అమరవీరుల స్థూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల్లో ప్రార్థనా సమావేశంలో అమరుల స్మృతిలో 2 నిమిషాలు మౌనం పాటించి, వారి త్యాగాలను ప్రస్తుతించాలని తెలిపారు.

జయశంకర్ కృషి అజరామరం: కేసీఆర్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కృషి అజరామరమైనదని సీఎం కేసీఆర్ కొనియాడారు. ఆచార్య జయశంకర్ వర్ధంతిని సందర్భంగా బుధవారం ఆయన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. రాష్ట్ర సాధనోద్యమంలో భావజాల వ్యాప్తికోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వయం పాలనా స్వాప్నికుడని పేర్కొన్నారు. జయశంకర్ ఆకాంక్షించిన మహోజ్వల తెలంగాణను రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సమాజం ఆవిష్కరించుకుంటున్నదని, ఇది గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఇటువంటి చారిత్రక సందర్భంలో ఆయన ఉండి ఉంటే ఎంతో సంతోషించేవారని, నేడు ఆయన లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ అమరుల స్ఫూర్తితో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రభుత్వం ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నదని సీఎం అన్నారు.

అసెంబ్లీ హాల్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు గుత్తా నివాళి

ప్రొపెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. పంటల దిగుబడిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, నేడు యావత్ దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా ఎదిగిందని, ఏ రంగంలో చూసినా రోల్ మోడల్‌గా మారిందని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలోని బంగారు మైసమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గుత్తా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాసన మండలి విప్‌లు ఎంఎస్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో వీ ప్రకాశ్, ఎం శ్రీనివాస్‌రెడ్డి, బాలసాని తదితరులు

తెలంగాణభవన్‌లో జయశంకర్‌కు నివాళి

తెలంగాణ రాష్ట్ర అవశ్యకతను రాష్ట్రంతో పాటుగా దేశ విదేశాల్లో తెలిసే విధంగా చెప్పిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ దక్కుతుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. జయశంకర్ కలలుకన్న తెలంగాణను సీఎం కేసీఆర్ సాధించారని, తెలంగాణ ట్యాగ్ లైన్ నీళ్లు, నిధులు, నియామకాలు సాకారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్, మాజీ ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో స్ఫూర్తినింపిన గూడ అంజయ్య: కేసీఆర్

తెలంగాణ గోసను తనదైన యాసతో కైగట్టి పాటలల్లిన కవి గూడ అంజయ్య ఉద్యమ సమయంలో ప్రజల్లో స్ఫూర్తిని రగిలించారని సీఎం కేసీఆర్ కొనియాడారు. గూడ అంజయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ అస్తిత్వ ఆకాంక్షలకు గూడ అంజయ్య గేయాలు, సాహిత్యం ప్రతీకలుగా నిలిచాయని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం అనేక పాటల ద్వారా అంజయ్య చేసిన సాంస్కృతిక భావజాలవ్యాప్తి ప్రజలను కార్యరంగంలోకి దూకేలా చేసిందని పేర్కొన్నారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని వైద్య ఆరోగ్యరంగ దుస్థితిని కళ్లారా చూపుతూ అంజయ్య 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పాట రాశారని, ఆ పాటకు నేటి తొమ్మిదేండ్ల ప్రగతి సమాధానంగా నిలిచిందని తెలిపారు. అమరుల ఆకాంక్షలను ప్రతిఫలిస్తూ, అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధిస్తూ, నేడు తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకుపోతామని పేర్కొన్నారు.

అర్వింద్‌కుమార్‌కు సీఎం అభినందన

- గ్రీన్ యాపిల్ అవార్డులను కేసీఆర్‌కు అందించిన హెచ్‌ఎండీఏ కమిషనర్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు ఐదు గ్రీన్ యాపిల్ అవార్డులు రావడంపై ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ అభినందించారు. అర్వింద్ లండన్‌లో అందుకున్న అవార్డులను బుధవారం ప్రగతి భవన్‌లో సీఎంకు అందించి పర్యటన విశేషాలను వివరించారు. తెలంగాణ కట్టడాలకు అంతర్జాతీయ వేదిక మీద అందుకున్న ప్రశంసలు, ప్రత్యేకతలను సీఎంకు తెలిపారు. ఈ సందర్భంగా అర్వింద్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ మరోసారి అభినందించారు.


లండన్‌లో అందుకున్న గ్రీన్ యాపిల్ అవార్డులను సీఎం కేసీఆర్‌కు అందిస్తున్న హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్‌కుమార్

సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పరుగులు

- స్వరాష్ట్రంలో జిల్లాలో అద్భుత ప్రగతి
- విద్య, వైద్య, పారిశ్రామిక పురోగతి
- సంగారెడ్డి పట్టణంలో మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- దేశంలోనే తొలి గిరిజన లా కాలేజీ
- రూ.4,427 కోట్లతో సంగమేశ్వర-బసవేశ్వర ఎత్తిపోతల పనులు
- నేడు జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన



సంగారెడ్డి, జూన్ 21(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. ఉమ్మడి పాలనలో వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ మేరకు జిల్లాకు నిధుల వరద పారుతున్నది. ఫలితంగా అభివృద్ధి పరుగులు పెడుతున్నది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు మారుమూల ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయి. ఇటీవలే జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలకు సీఎం కేసీఆర్ రూ.250 కోట్ల నిధులు విడుదల చేశారు. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ జిల్లాను సస్య శ్యామలం చేయాలన్న తలంపుతో జిల్లాకు గోదావరి జలాలు తీసుకొస్తున్నారు. ఇందు కోసం రూ.4,427 కోట్లతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూసిన మెడికల్ కాలేజీ కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారు. అదనంగా జిల్లాకు నర్సింగ్ కాలేజీని మంజూరు చేశారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో రెట్టింపు సంతోషం

రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు పెద్ద ఎత్తున డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేసింది. దీనిలో భాగంగా కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల టౌన్‌షిప్‌ను గురువారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. 145 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం దీనిని నిర్మించింది. 117 బ్లాక్‌లతో 15,660 డబుల్ బెడ్‌రూం ఇండ్లను, రూ.1,432 కోట్ల వ్యయంతో నిర్మించింది. ఇవే కాకుండా జిల్లాకు రూ.338.11 కోట్లతో 5,920 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.210 కోట్లతో 3,498 ఇండ్లు పూర్తయ్యాయి. రూ.42 కోట్లతో 22 గోదాములు నిర్మించగా, మార్కెట్‌యార్డుల అభివృద్ధికి రూ.25.78 కోట్లు విడుదల చేసింది.

పారిశ్రామిక ప్రగతి


బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంగారెడ్డి జిల్లాలో 2,572 పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. ఇందులో 88 మెగా పరిశ్రమలు రూ.13,305 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. రూ.6,323 కోట్ల పెట్టుబడులతో 157 భారీ పరిశ్రమలు, రూ.3,938 కోట్ల పెట్టుబడులతో 177 మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రూ.4,065 కోట్లతో 1,085 చిన్న పరిశ్రమలు, రూ.548 కోట్ల పెట్టుబడులతో 1,065 చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆయా పరిశ్రమల ద్వారా 1,88,191 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. జహీరాబాద్‌లో నిమ్జ్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి దొరుకుతున్నది.

విద్య, వైద్య రంగానికి పెద్దపీట

సంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య రంగాలకు సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తున్నారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డిలో 150 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. ఇటీవలే మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డిలో రూ.50 కోట్లతో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. సంగారెడ్డిలో 350 పడకల దవాఖాన, మాతాశిశు సంక్షేమ దవాఖాన, టీ–డయాగ్నొస్టిక్ హబ్ అందుబాటులోకి వచ్చాయి. సంగారెడ్డిలో రూ.37 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. సంగారెడ్డి, జహీరాబాద్‌లో టిఫ్ఫా స్కాన్ సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పటాన్‌చెరులో 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణానికి గురువారం సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. సదాశివపేట, జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్‌లో 100 పడకల దవాఖానలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నారాయణఖేడ్, జోగిపేట దవాఖానల్లో డయాలసిస్ సేవలను ప్రారంభించింది. ఇవిగాక 19 బస్తీ దవాఖానలు, 173 పల్లె దవాఖానలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన హరీశ్‌రావు

సంగారెడ్డి, జూన్ 21(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం పరిశీలించి, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొల్లూరులో దక్షిణాసియాలోనే అతిపెద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల టౌన్‌షిప్‌ను ప్రారంభించనున్నారని, పటాన్‌చెరులో 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానకు శంకుస్థాపన చేస్తారని, వెలిమల శివారులో మేధా రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన కోసం పటాన్‌చెరు పట్టణం ముస్తాబైంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రాకకోసం భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పటాన్‌చెరులో కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆసియాలోనే అతిపెద్ద గృహసముదాయం

- నేడు కొల్లూరు డిగ్నిటీ హౌసింగ్ కాలనీ ప్రారంభం
- 145 ఎకరాల్లో 1489.29 కోట్లతో కేసీఆర్ నగర్ నిర్మాణం
- 15,660 ఇండ్ల నిర్మాణ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేయనున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఆరుగురు లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీ


కొల్లూరులో నిర్మితమైన డబుల్ బెడ్ రూం ఇండ్ల భవనాల సముదాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలోని నిరుపేద ప్రజల సొంతింటి కల నెరవేరనున్నది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధి రామచంద్రాపురం మండలం కొల్లూరు గ్రామంలో రెండో దశ కింద చేపట్టిన ఆసియాలోనే అతిపెద్దదైన కేసీఆర్ నగర్ 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీని గురువారం ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆనంతరం ఆరుగురు లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందించనున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వపరంగా లబ్ధిదారులకు ఒక్క నయాపైసా ఖర్చు లేకుండా ఉచితంగా పంపిణీ చేసే అతిపెద్ద హౌసింగ్ ప్రాజెక్టుగా కొల్లూరు నిలువనున్నది. సుమారు 60 వేల మంది ఆవాసం ఉండేలా ఒకేచోట ఏకంగా 15,660 ఇండ్ల నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు చేపట్టింది. నిరుపేదల కోసం సకల సౌకర్యాలతో కొల్లూరులో ఈ ఆదర్శ టౌన్‌షిప్‌ను నిర్మించింది. క్వాలిటీలో కాంప్రమైజ్ కాకుండా కార్పొరేట్ హంగులతో పేదల కోసం కలల సౌధాలను నిర్మించింది. రూ.1,489.29 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టులో కార్పొరేట్ అపార్ట్‌మెంట్లకు తీసిపోకుండా సకల హంగులతో నిర్మాణాలు చేపట్టారు.

ఆసియాలోనే అతిపెద్దది: మంత్రి కేటీఆర్

సంగారెడ్డి జిల్లా కొల్లూరు వద్ద జీహెచ్ఎంసీ నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం ఆసియాలోనే అతిపెద్దదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేయడం గర్వంగా ఉందని గురువారం ఆయన ట్వీట్ చేశారు. 'ధైర్యంగా కల కనండి.. వాటిని సాకారం చేసేందుకు సంసిద్ధులు కండి' అనేదే కేసీఆర్ గారి మంత్ర అని.. ఆ నినాదంతోనే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ సముదాయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించనున్నట్టు తెలిపారు.


యాదగిరిగుట్టలో వేడుకల్లో పాల్గొన్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి


ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వేడుకల్లో ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథ్ తదితరులు

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

- రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో వేడుకలు, ప్రత్యేక పూజలు
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 21(నమస్తే తెలంగాణ): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌భవన్‌లో జరిగిన వేడుకలకు హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దిపేటలోని వెంకటేశ్వరాలయంలో జరిగిన వేడుకల్లో వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూట్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖమ్మంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గుడ్ షెపర్డ్ చర్చితోపాటు ఓ మసీదులో జరిగిన వేడుకల్లో రవాణాశాఖమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్–స్నేహలత దంపతులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా జరిగిన ఆధ్యాత్మిక వేడుకలకు మంత్రి ఎర్రబెల్లి హాజరయ్యారు. ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగం గా తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన చండీయాగంలో ఆలయ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్ రావు, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు పాల్గొనగా, పెద్దపల్లి జిల్లాలోని రాగినేడు నాగలింగేశ్వర ఆలయంలో జరిగిన మండల ఉత్సవంలో పోలీస్ హౌసింగ్ కార్పొరే షన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



త్యాగధనులకు పోలీసుల గన్‌సెల్యూట్ సందర్భంగా వందనం చేస్తున్న సీఎం కేసీఆర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ, శ్రీనివాస్‌గౌడ్, అల్లోల, సత్యవతి, ఎంపీలు కే కేశవరావు, సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా తదితరులు

ఆశయం అమరం

మొదటిపేజీ తరువాయి...

శ్రమించామని తెలిపారు. అయితే తాను నిరాహార దీక్ష చేసిన సమయంలో పరిస్థితి అనుకోని మలుపు తిరిగిందని, తమ చావుతోనైనా కేంద్రం కండ్లు తెరువాలంటూ కొందరు ఆత్మ బలిదానాలు చేయటం తనను ఎంతో కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని శ్లాఘించారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ ఘట్టాలను గుర్తుచేస్తూ సాగిన సీఎం కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఇల్లెందులో ఉద్యమ తొలి పొలికేక

దశాబ్ది ఉత్సవాలు సంతోషంగా నిర్వహిస్తున్నాం. అమరులను స్మరించుకుంటూ ఉత్సవాలకు ముగింపు పలకాలని అనుకున్నాం. రాష్ట్ర ఉద్యమ చరిత్ర చాలా పెద్దది. ఈరోజు రెండు పార్శ్వాలు కలగలిసిన రోజు. సంతోషం ఒక పాలు. విషాదం రెండు పాళ్లుగా ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో ఎన్నోపేర్లు తలుచుకోవాలి. రాష్ట్రాన్ని విలీనం చేయటంలోనే అనేక కుట్ర కోణాలు దాగి ఉన్నాయి. అమాయకులైన ఆనాటి తెలంగాణ రాజకీయ నాయకత్వం, ప్రజలు ఏదో మంచి జరుగుతుందనే నమ్మకంతో అంగీకరించారు. ఫలితంగా తెలంగాణ సమాజం బలైపోయింది. ఆ తర్వాత ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలకే ఇబ్బందులు మొదలయ్యాయి. మొట్టమొదట ఖమ్మం జిల్లా ఇల్లెందులో ఒక ఉద్యమ పొలికేక వచ్చింది. రెండేండ్లలో అది యూనివర్సిటీలకు పాకింది. ఇప్పుడు నా ముందున్న స్వామిగౌడ్ అక్కడే ఉన్నారు. చాలా ధైర్యంగా 58 ఏండ్ల సమైక్య ఉద్యమంలో కూడా తమ అస్తిత్వాన్ని కోల్పోకుండా టీఎన్జీవోలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమంలోకి దిగారు. ఎన్నో కేసులు, వేధింపులు, భయంకరమైన పీడీ యాక్టులు, ఉద్యోగాల బర్తరఫ్‌లు.. ఇలా తెలంగాణ అనుభవించని బాధ లేదు. ఆనాటి టీఎన్జీవో నేత ఆమోస్‌ను మీసా యాక్టు కింద పెట్టి వేధించారు. ఉద్యోగం నుంచి తీసేశారు. ఉద్యోగులకు జీతా లు ఇవ్వకుండా అవస్థలు పెట్టారు. అప్పట్లో బద్రి విశ్వాల్ అనే ఒక వ్యాపార వేత్త బక్కెట్లు పట్టుకుని బేగం బజార్‌లో దకాణాదారుల దగ్గర డబ్బులు అడిగి జీతాలు ఇచ్చి కుటుంబాలను ఆదుకున్నారు.

పిడికెడు మందితో ఉద్యమం ప్రారంభించాం

తెలంగాణ ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించాం. మొదట్లో నా మిత్రుడు వీ ప్రకాశ్, మధుసూదనాచారితో కలిసి కనీసం ఆరు, ఏడు నెలల పాటు మేధోమథనం చేశాం. ఏం చేద్దాం? ఎలా ముందుకెళ్దాం అని ఆలోచించాం. ఏం జరిగినా ఈ సారి తెలంగాణను సాధించి తీరాలని అనేక మంది మేధావులతో చర్చలు జరిపాం. ఒక పకడ్బందీ వ్యూహం రచించుకుని బయలుదేరాం. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఇప్పుడు మన మధ్య లేరు. ఆయన ఆజన్మ తెలంగాణ వాది. అనేకమంది అనేక రూపాల్లో పదవుల కోసమో, డబ్బుల కోసమో, రాజకీయ ఒత్తిళ్లు, పోలీసు వేధింపులు ఇలా.. ఏదోరకంగా రాజీ పడ్డారు. కానీ.. జయశంకర్ సార్ రెండు సిద్ధాంతాలను బలంగా పాటించేవారు. ఒకటి తెలంగాణ సాధన, రెండోది శనివారం పూర్తిస్థాయి ఉపవాసం ఉండేవారు. తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో అసలేం జరిగింది? ఆ తర్వాత మీరేం చేశారని అడిగితే.. ఎవరన్నా ఒకరు కేసీఆర్ లాంటోడు రాకపోతడా.. అని చెప్పి ఆశగా ఎదురు చూసేవాళ్లమని ఆయన చెప్పారు. ఐదారుగురు మీటింగ్ పెట్టినా వెళ్లేవాళ్లం. ఉపన్యాసం ఇచ్చేవాళ్లం. తెలంగాణ ఉద్యమ సోయి బతికి ఉండాలనే ప్రయత్నాలు ముమ్మరంగా చేసేవాళ్లమని జయశంకర్ సార్ చెప్పేవారు. ఆ సందర్భంలో కొన్ని వామపక్ష పార్టీలు కూడా రకరకాల పేర్లతో ఉద్యమానికి జీవం పోసే ప్రయత్నం చేశాయి. వాళ్ల పంథాలో వాళ్లూ తెలంగాణ మహాసభ, తెలంగాణ జనసభ.. ఇలా అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తర్వాత మొదట ఒక నిర్ణయం తీసుకున్నాం. విద్యార్థులు ఎమోషనల్‌గా ఉంటారు.. వాళ్లను ఉద్యమంలోకి రానివ్వొద్దని నిర్ణయించాం. ఉద్యమానికి ఇబ్బందులు వస్తాయని భావించాం. ఉద్యోగులను బలిచేసుకోవద్దని అనుకున్నాం. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్లాం.

> సమైక్యవాదులు, తెలంగాణలోని సమైక్యవాదుల తొత్తులు.. నామీద జరిపినన్ని దాడులు ప్రపంచంలో మరే ఉద్యమ నాయకుడిపై జరిగి ఉండవు. అయినా నేను ఏనాడూ బాధ పడలేదు. నా ప్రజల కోసం నేను పాటు పడుతున్నాను కాబట్టి..ఆ తిట్లే దీవెనలు అనుకొని ముందుకు సాగాను.
>
> - సీఎం కేసీఆర్

అమరుల త్యాగం చిరస్థాయిగా నిలిచేలా

ఇది తెలంగాణ అమరజ్యోతి. ఎల్లకాలం మన గుండెల్లో నిలిచి ఉండేలా నిర్మించుకున్నాం. అందులో సుమారు ఐదారు వందల మంది కూర్చుని సభలు జరుపుకునేలా విశాలమైన హాలు ఉన్నది. సభ ఎక్కడ జరిగింది? అంటే తెలంగాణ అమరజ్యోతిలో అని చెప్పుకొనేలా ఉండాలి. అమరజ్యోతి పేరు ఎప్పటికీ మన నోళ్లలో నానాలనే ఉద్దేశంతో అంతపెద్ద హాల్ నిర్మించాం. 1969 ఉద్యమం నాటి ఫొటోలు సైతం సేకరించాం. త్వరలోనే మిగిలిన అన్నింటినీ సేకరించి మొత్తం అమరవీరుల ఫొటోలను ఒక ప్రత్యేక ప్రదేశంలో అలంకరిస్తాం. తెలంగాణ ఉద్యమ ప్రస్థానం చిరస్థాయిగా నిలిచిపోవాలి. దీనికో ప్రత్యేకత ఉన్నది. 1969లో కొంత హింసాధోరణి ఉన్నది. కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రముఖ తెలంగాణవాది. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన మొట్టమొదటి త్యాగధనుడు. జలదృశ్యం పక్కనే ఆయన ఇల్లు ఉండేది. ఆ రోజు మేము వెళ్లిన వెంటనే తన ఇంట్లోనే ఆశ్రయమిస్తే అక్కడే ఆఫీసు ప్రారంభించాం. స్థానిక సంస్థల్లో వంద మండలాలకు పైచిలుకు విజయం సాధించాం. రెండు జిల్లా పరిషత్‌లు సొంతం చేసుకున్నాం. పోచంపాడులో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశాం. అందరం అక్కడ ఉంటే.. ప్రభుత్వం కర్కశంగా ఆఫీసు అనే కనీస గౌరవం పాటించకుండా సామగ్రిని అంతా రోడ్డుమీద పడేసి ఆ భవనం మొత్తాన్ని ధ్వంసం చేశారు. అదేచోట అమరుల స్థూపం కట్టాలని, అప్పుడే అమరుల ఆత్మ శాంతిస్తుందని నిర్ణయించాం. అదే జలదృశ్యంలో అద్భుతంగా ప్రపంచంలోనే మరెక్కడా లేనంత గొప్పగా అమరజ్యోతిని నిర్మించాం. మహాత్మాగాంధీ స్ఫూర్తితోనే ఆయన పద్ధతిలోనే మనం ముందుకు సాగాం. ఎంతో ఓపికతో దేవుడిచ్చిన శక్తినంతా కూడగట్టుకొని హింస చెలరేగకుండా చూశాం. సమైక్యవాదులు, తెలంగాణలోని సమైక్యవాదుల తొత్తులు.. నామీద జరిపినన్ని దాడులు ప్రపంచంలో మరే ఉద్యమ నాయకుడిపై జరిగి ఉండవు. అయినా నేను ఏనాడూ బాధ పడలేదు. నా ప్రజల కోసం నేను పాటుపడుతున్నాను కాబట్టి..ఆ తిట్లే దీవెనలు అనుకొని ముందుకు సాగాను. జయశంకర్ సార్, స్వామిగౌడ్, దేవీప్రసాద్ అందరం కలిసి సిద్దిపేటలో ఉద్యోగ గర్జన కార్యక్రమం చేశాం. అక్కడి నుంచి ఇల్లెందు వస్తుంటే అప్పటి సీఎం రోశయ్య ఒక జీవో తీసుకొచ్చి హైదరాబాద్‌లో కూడా మనకు ఉద్యోగాలు దొరకని పరిస్థితి సృష్టించారు. దానికి తీవ్రంగా నిరసన తెలియజేశాం. ఉద్యోగ గర్జనలోనే నేను నిరాహార దీక్షకు కూర్చుంటానని ప్రకటించాను. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని చెప్పాను. దీక్షలో కూర్చుంటే నిమ్స్‌లో నన్ను చాలా బెదిరించారు. అసలే సన్నగున్నవ్, నీకు శక్తి లేదు, ఒకసారి కోమాలోకి వెళితే మళ్లీ రివర్స్ రాలేవు అని భయపెట్టారు. అవన్నీ లెక్కచేయలేదు.. వెనకడుగు వేయలేదు. విద్యార్థి, జేఏసీ మిత్రులంతా అద్భుతంగా నిరసనలు తెలియజేస్తుంటే.. నా దీక్షకు ఢిల్లీ సర్కారు దిగొచ్చింది. తెలంగాణ ఇస్తామని ప్రకటన చేసింది. దాని తర్వాత నేను దీక్ష విరమించాను. ఆ తర్వాత కుట్రలు, కుతంత్రాలు.. చివరి నిమిషం దాకా వలస వాదులు, సమైక్య వాదులు చెయ్యని ప్రయత్నం లేదు. చివరికి పార్లమెంట్‌లోనే పెప్పర్ స్ప్రేలు చల్లే స్థాయికి దిగజాడాన్ని దేశమంతా చూసింది. తెలంగాణ రాకుండా అడ్డుకోవాలని అంత దారుణంగా ప్రయత్నించారు. వాటన్నింటినీ అడ్డుకుంటూనే ఉద్యమాన్ని కొనసాగించాం.

రాజీనామాలనూ అస్త్రాలుగా వాడుకున్నాం

> చాలామంది మొదట్లో నాతో విభేదించారు. ఉద్యమం అంటే లొల్లిలొల్లి చేయాలి. బస్సులు తగలపెట్టాలి. బంద్‌లకు పిలుపునివ్వాలనే పద్ధతిలో చెప్పారు. అది సాధ్యమయ్యేది కాదని చెప్పాను. అలా చాలామందిని ఒప్పించి ముందుకు సాగాం. ఒక ప్రణాళికతో, ఓర్పుతో చాకచక్యంగా ముందుకెళ్లడంతో తెలంగాణ కల సాకారమైంది. ఎన్నిసార్లు రాజీనామా చేశామో లెక్కేలేదు. కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే, ఎంపీ.. అన్నీ లెక్కచేయకుండా త్యాగం చేశాం. పదవంటే లెక్కలేదా? అట్ల ఇసిరి పారేసినట్టు రాజీనామాలు చేస్తారేంటి? అని చాలామంది నన్ను అడిగేవాళ్లు. తెలంగాణ ప్రజలంటే మాకంత నమ్మకం.. వాళ్లే మమ్మల్ని కాపాడుకుంటారని చెప్పేవాడిని. రాజీనామాలను కూడా ఒక అస్త్రాలుగా వాడి కొత్త వ్యూహంతో ముందుకెళ్లాం.
>
> - సీఎం కేసీఆర్

అమరులకు నివాళి అర్పించిన తర్వాతే..

> ఇకపై రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ఆచారం పెట్టుకుంటాం. ఇక్కడికి ఇతర రాష్ట్రాలవాళ్లు వచ్చినా, విదేశీ ప్రతినిధులు వచ్చినా ముందుగా అమరుల ఘాట్ (అమర జ్యోతి) దగ్గర నివాళులు అర్పించిన తర్వాతే మిగతా కార్యక్రమాలు జరిగేలా కార్యాచరణ రూపకల్పన చేస్తాం. తెలంగాణ ప్రస్థానంపై డాక్యుమెంటరీని అద్భుతంగా రూపొందించారు. దీంతోపాటు తెలంగాణ చరిత్రను కండ్లకు కట్టినట్టు చూపించేలా, ఉద్యమ ప్రస్థానాన్ని సమగ్రంగా వివరించేలా, గొప్పగా ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నాం. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతిఒక్కరికి నా మనవి. 1969 నాటి ఉద్యమం కావొచ్చు, ఇప్పటిది కావొచ్చు.. మీ ప్రాంతంలో జరిగిన త్యాగాలు గానీ, మంచిగానీ, చెడ్డగానీ, తెలంగాణ ఉద్యమ ఘట్టాలు ఉంటే ప్రభుత్వానికి పంపండి. తప్పకుండా వాటిని ఈ ఫొటో గ్యాలరీలో పొందుపరుస్తాం.

పిల్లల మరణం ఆవేదన కలిగించింది

ఒక్క రక్తం చుక్క కారకుండా, ఎవరికీ నష్టం కలుగకుండా, ఒక్క దెబ్బ తగలకుండా తెలంగాణ సాధించుకోవాలని అనుకున్నాం. అయితే నా నిరాహార దీక్ష సందర్భంగా ఆ ఘట్టం విచిత్రమైన మలుపు తీసుకున్నది. మేం చస్తే అయినా కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరుస్తదేమో, బుద్ధి వస్తదేమో అనే ఉద్దేశంతో అనేక మంది పిల్లలు, ఇతరులు ప్రాణాలను త్యాగం చేశారు. నన్ను వ్యక్తిగతంగా ఎన్ని రకాలుగా, ఎంత హింసించినా, ఏం చేసినా కూడా నేను బాధ పడలేదు. కానీ, ఈ అనూహ్య ఘట్టంలో బలిదానాలు జరగడం నన్ను బాగా కలిచివేసింది. ఆ ప్రాణాలకు మనం వెలకట్టేలేం. తెలంగాణ వచ్చిన తర్వాత దాదాపు ఆరేడువందల మంది అమరుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఉద్యోగాలు ఇచ్చినం. ఇంటికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేసినం. ఇల్లు లేనివాళ్లకు కట్టించినం. ఇలా ఉన్నంతలో సాయం చేసినం. ఇంకా ఎవరైనా ఉంటే ఉదారంగా సాయం చేసుకోవచ్చు. దానికి పెద్ద ఇబ్బంది లేదు.

యూనిక్‌గా ఉండాలనే..

అక్కడక్కడ కొంత మంది మూర్ఖులు ఉంటరు. వాళ్లకు తత్తరపాటు, తొందరపాటు ఎక్కువ. అమరుల స్థూపం ఏమైంది? అని అన్నారు. నేను మలేషియా, చైనా, సింగపూర్ వంటి దేశాలకు పోయినప్పుడు అక్కడ అమరుల స్మారకాలను చూసిన. అదే పద్ధతిలో తెలంగాణ అమరులకు మనం ఇచ్చే నివాళి చాలా యూనిక్‌గా ఉండాలని భావించినం. మిత్రులు రమణారెడ్డిని, ఈఎన్సీ గణపతిరెడ్డిని పిలిచి స్మారకం గురించి చర్చించాం. చాలా యూనిక్‌గా ఉండాలని చెప్పిన. జ్యోతి పట్టినట్టు ఉండాలన్న నా భావనకు తగ్గట్టు డిజైన్ చేస్తామని వారు చెప్పారు. దీపకలికలాగా, ఒక దీపం వెలుగుతున్నట్టుగా బ్రహ్మాండంగా అమరులను ప్రతిక్షణం కండ్లలో చూసుకునే విధంగా డిజైన్ చేసి చూపెట్టారు. అదే రీతిలో అద్భుతమైన అమరజ్యోతికి రూపకల్పన చేశారు. అమరుల త్యాగాలు నిత్యం మనకు స్ఫురణకు వచ్చేలా, అమరుల జ్యోతి రూపంలో మన సొంత బిడ్డలు మన కండ్లలో ప్రకాశిస్తూ ఉండాలి. ఈ సచివాలయంలో పరిపాలన చేసే సీఎంలు, సీఎస్‌లు, మంత్రులు అందరికీ.. ఎంత మంది త్యాగాలతో ఈ తెలంగాణ వచ్చిందో, మనం ఎంత జాగ్రత్తతో దీనిని ముందుకు తీసుకుపోవాలో తెలియజెప్పేలా అమర జ్యోతి ఏర్పాటయ్యింది.

ల్యాండ్ మార్క్‌గా సచివాలయ ప్రాంగణం

ఒకవైపు రాష్ట్ర పరిపాలన గుండెకాయ అయిన సచివాలయం, పక్కనే అమరుల స్మారకం, కులమత వర్గాలను నిర్మూలించాలని వాదించిన అంబేద్కర్ గొప్ప విగ్రహం, మరోవైపు ప్రపంచమంతా శాంతి, కరుణ, ప్రేమతో బతకాలని ప్రవచించిన బుద్ధుని విగ్రహం.. ఇలా హైదరాబాద్‌లో ఈ ప్రాంగణం ఒక ల్యాండ్ మార్క్‌గా తయారైంది. సచివాలయానికి, అమరుల స్మారకానికి మధ్య ఉన్న స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం వస్తుంది. అమరుల స్ఫూర్తి, ఉద్యమ సాధనలో పడ్డ శ్రమ.. దాని కసి తీర్చుకొంటూ ఈ రోజు కులం, మతం, జాతి, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఎవరికి అవసరమో, వారికి సాయం అందిస్తూ ప్రభుత్వం పురోగమిస్తున్నది. కచ్చితంగా నిరంతరం ఇదే స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతుందని, రాష్ట్రాన్ని ఇదేవిధంగా ముందుకు తీసుకుపోతుందని అందరికీ హామీ ఇస్తున్నాను అని సీఎం కేసీఆర్ తెలిపారు.

అంచనాలను తలకిందులు చేశాం

సాధించుకున్న తెంలగాణలో అద్భుతంగా పురోగమిస్తున్నాం. రాష్ట్రం ఇంత తొందరగా ఇంత ప్రగతి సాధిస్తుందని ఎవరూ, ఏనాడూ ఊహించలేదు. తెలంగాణ సాధన కోసం తిరుగుతున్నప్పుడు శ్రీ కృష్ణ కమిటీయో, మరో కమిటీయో, ఢిల్లీలో ఎవడుపడితే వాడు అడిగే లక్షలాది యక్ష ప్రశ్నలకు మేం సమాధానం ఇచ్చినం. 'మీ రాష్ట్రం ఎట్లా బతుకుతది? ఆదాయం ఎట్లా?' అని అడిగేవారు. ఈ రోజు అందరి అంచనాలు తలకిందులు చేస్తూ అనేక రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాం. తలసరి ఆదాయంలో, విద్యుత్తు సరఫరాలో, తలసరి విద్యుత్తు వినియోగంలో, తాగునీటి సరఫరాలో, పంజాబ్‌నే తలదన్నేలా ధాన్యం ఉత్పత్తిలో.. ఇలా అనేక రంగాల్లో ముందుకు పోయినం. మనం కుదుటపడ్డ తర్వాత, ఆర్థిక సౌష్టవం ఏర్పడ్డ తర్వాత.. అణగారిపోయిన దళితజాతికి కచ్చితంగా ఒక మార్గం చూపెట్టాలని నిర్ణయించుకున్నాం. ఈ దేశానికే మనం తొవ్వ చూపియ్యాలె అనే ఉద్దేశంతో బ్రహ్మాండంగా దళిత బంధు కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఆ తర్వాత దేశంలోని చాలా మంది దళిత మేధావులు నన్ను అడిగితే.. 'దేశం మొఖం మీద ఇదొక మచ్చ ఉన్నది. వాళ్లను ఎన్ని దశాబ్దాలు అలాగే ఉంచుతాం. మనకు సిగ్గుండాలి. అమెరికా ప్రజలు నల్లజాతీయులను అవమానించారు. బరాక్ ఒబామాను అమెరికా అధ్యక్షుడిగా చేయడం ద్వారా వాళ్ల పాపాలను కడిగేసుకున్నారు. మనం కూడా రియలైజ్ కావాలి. అటువంటి పరిణతి రావాల్సి ఉన్నది' అని వారికి చెప్పాను. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రవచించిన సమతా సిద్ధాంతాన్ని ప్రపంచానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతో ప్రపంచంలోనే సమున్నతమైన 125 అడుగుల ఎత్తున్న బాబా సాహెబ్ విగ్రహాన్ని ఇటీవలే ఆవిష్కరించాం. దానిని అందరూ ప్రశంసిస్తున్నారు.

లోకం పోకడ



ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిన చోటిది

- అందుకే ఈ స్థానంలో అమరజ్యోతి నిర్మాణానికి సీఎం కేసీఆర్ సంకల్పం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

హైదరాబాద్, జూన్ 22(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిన చోటు ఇదేనని, దానికి గుర్తుగా ఈ స్థానంలోనే అమరజ్యోతిని నిర్మించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ జ్యోతి అమరుల త్యాగాలకు స్ఫూర్తి అని వెల్లడించారు. అమరజ్యోతిని ఆవిష్కరించుకోవటం చారిత్రక ఘట్టం అని అభివర్ణించారు. అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయాలను నిజం చేసేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తున్నదని, సాధించుకున్న స్వరాష్ట్రాన్ని ఈ దేశానికి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. దుబాయి, జర్మనీ, అమెరికా వంటి ప్రపంచ దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని మదించి ఈ స్మారక జ్యోతిని తీర్చిదిద్దినట్టు వివరించారు. ప్రపంచంలోనే విశ్వవిఖ్యాత రాష్ట్రంగా తెలంగాణ పేరొందాలని ఆకాంక్షించారు.

అమరులకు 'కళా'నీరాజనం

- సాగరతీరాన తెలంగాణ సాంస్కృతిక వైభవం
- అంబేద్కర్ విగ్రహం నుంచి అమరజ్యోతి వరకు 6200 మంది కళాకారుల ర్యాలీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): డప్పుల చప్పుళ్లు.. ఢమరుక నాదాలు.. ఒగ్గుడోలు మోతలు.. దండారి ఆటలు.. కొమ్ము నృత్యాలు.. బంజారా రీతులు.. ఇలా తెలంగాణ సమస్త సాంస్కృతిక కళారీతులు అమరులను ఆవాహన చేసుకొన్నాయి. సాగర తీరం యావత్తు తెలంగాణ సాంస్కృతిక వైభవ ప్రతిబింబమై నిలిచింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు అంబరాన్నంటాయి. రాష్ట్రనలుమూలల నుంచి 6,200 మందికిపైగా కళాకారులు తరలివచ్చారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ నేతృత్వంలో పీవీ మార్గ్ వద్ద ఉన్న 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి సచివాలయం ఎదుట నిర్మించిన అమరజ్యోతి వరకూ సంస్మరణ ర్యాలీని నిర్వహించారు. కళాకారుల సంస్మరణ ర్యాలీని, కళా ప్రదర్శనలను వీక్షించేందుకు నగరం నలుమూలల నుంచి ప్రజలు వేలాది సంఖ్యలో తరలివచ్చారు.

అట్టహాసంగా అమరజ్యోతి ఆవిష్కరణ

అమరుల సంస్మరణ ర్యాలీ అనంతరం నిర్వహించిన అమరజ్యోతి ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గురువారం సాయంత్రం 6:15 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. అత్యద్భుతంగా అమరుల స్ఫూర్తి ప్రజ్వలించేలా, త్యాగాల ప్రతిబింబంగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించిన అమరజ్యోతిని సందర్శించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అమరులకు నివాళులర్పించారు. అనంతరం అమరజ్యోతి లోపలి నిర్మాణాలను పరిశీలించారు. ఆడిటోరియంలో అమరవీరుల త్యాగాలు, తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంపై రూపొందించిన డాక్యుమెంటరీని తిలకించారు. అనంతరం అమరజ్యోతిని సీఎం కేసీఆర్ వెలిగించారు. 12 మంది పోలీసులు 12 తుపాకులతో 3 రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి అమరవీరులకు గన్ సెల్యూట్‌ను సమర్పించారు. పోలీసు అధికారులతో కలిసి సీఎం కేసీఆర్ సైతం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఉద్వేగానికి లోనయ్యారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు: మామిడి హరికృష్ణ

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో వేలాది మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించి, అమరవీరులకు నివాళులులర్పించడం చిరస్మరణీయమని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆనందం వ్యక్తంచేశారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంస్మరణ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మంత్రులు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకాశంలో అభివృద్ధి పాలపుంత

- 750 డ్రోన్లతో మైమరిపించిన ప్రదర్శన
- ఆసక్తిగా తిలకించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వినువీధిలో ప్రగతి పాలపుంత దర్శనమిచ్చింది. తెలంగాణ చారిత్రక, వారసత్వ ప్రతీకలను కండ్లకు కట్టింది. గురువారం రాత్రి హుస్సేన్‌సాగర్ పైన నిర్వహించిన డ్రోన్ ప్రదర్శన సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల నాయకత్వంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతికి అద్దంపట్టింది. దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా తెలంగాణ అమరజ్యోతి ప్రారంభం అనంతరం ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తెలంగాణ అమరులకు జోహార్ల అర్పణతో మొదలైన ఈ డ్రోన్ షో 15 నిమిషాలపాటు ఏకబిగిన సాగి ఆహూతులను, వీక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. తెలంగాణ రాజముద్ర (చార్మినార్‌తో కూడిన కాకతీయ విజయతోరణం).. బతుకమ్మ, పాలపిట్ట, పిడికెలెత్తిన తెలంగాణ, కేసీఆర్.. ఆయనను అనుసరించి నినదించే సమూహం, కాళేశ్వరం, టీ-హబ్, పది జిల్లాల నుంచి 33 జిల్లాలుగా అవతరణ, కృష్ణా, గోదావరి ప్రవాహం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం, తెలంగాణ అమరజ్యోతి వంటి 13 చిహ్నాల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ ప్రదర్శన కోసం మొత్తం 750 డ్రోన్లను ఉపయోగించారు. ప్రదర్శన ప్రారంభం నుంచి ముగిసే వరకు కరతాళ ధ్వనులతో హుస్సేన్‌సాగర్ తీరం మార్మోగింది. సీఎం కేసీఆర్ సైతం ఆసాంతం తిలకించి పరవశించిపోయారు.

చరిత్ర ప్రతీకారం తీర్చుకున్నది

- జలదృశ్యాన్ని కూల్చిన చోటే అమరుల స్మారక కేంద్రం
- పది వేల క్యాండిల్ లైట్లతో అమరులకు ఘన నివాళి
- జై తెలంగాణ అని మార్మోగిన హుస్సేన్‌సాగర్ తీరం
- అమరవీరులకు జోహార్ పలికిన తెలంగాణ గుండెలు
- కార్యక్రమం ఆసాంతం ఉద్విగ్నభరిత వాతావరణమే

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): చరిత్ర ప్రతీకారం తీర్చుకున్నది. అవమానించి, వెళ్లగొట్టిన చోటే వెలుగు దివ్వె ప్రకాశించింది. తెలంగాణ అమరవీరులను నిత్యం స్మరించుకొనేలా అమరుల స్మారక కేంద్రం నిత్యకాంతిపుంజమై వెలిసింది. అవును! ఉద్యమ ప్రారంభంలో కేసీఆర్ సహా తెలంగాణవాదులు జలదృశ్యంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంట్లో మొట్టమొదటి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడే చర్చలు సాగించేవారు. అప్పటి ఆంధ్రా సర్కారు అత్యంత కర్కషంగా వ్యవహరిస్తూ, కార్యాలయాన్ని ఖాళీ చేయించి, ఆ భవనాన్ని కూల్చివేసింది. ఇప్పుడు అదే స్థలంలో అమరవీరుల స్మారక కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం నిర్మించటం గమనార్హం. గురువారం అమరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో.. నాటి సంఘటనను



అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ప్రజలు

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ గుర్తు చేశారు. చరిత్ర ప్రతీకారం తీర్చుకోవటం అంటే ఇదే! అని ఆయన వ్యాఖ్యానించారు. ఉద్యమకాలం నాటి వివిధ ఘట్టాలను వివరించిన ఆయన.. తెలంగాణ విజయ గాథ వెంట విషాద గాథ ఉన్నదని అన్నారు. ఎందరో బలిదానాలు చేసుకొన్నారని, వారిని తెలంగాణ సమాజం ఎప్పటికీ స్మరిస్తూనే ఉంటుందని చెప్పారు. బతుకమ్మపై పేర్చిన పూలలో, మత్తడి దునుకుతున్న చెరువు నీటిలో అమరుల త్యాగాలు కనిపిస్తాయని వివరించారు. అమరుల త్యాగాలకు ప్రతీకగా అమరుల స్మారకం కొలువు తీరిందని, వారు జ్యోతి రూపంలో ఎల్లప్పుడు వెలుగుతూనే ఉంటారని తెలిపారు. 1952లో మొదలైన పోరాటం, 1956 ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత పరిణామాలను ప్రస్తావించారు. 1969లో మొదలైన పోరాటంలో ప్రతి జిల్లా బులెట్ గాయాన్ని చవిచూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అణుబాంబు విస్ఫోటనంలా ఉద్యమాన్ని ఎవరు రాజేస్తారని ఎదురుచూస్తున్న క్రమంలో మలిదశ పోరాటం కేసీఆర్ నేతృత్వంలో మొదలైందని, ఆయన ఉపన్యాస గర్జనలో తెలంగాణ సమాజమంతా ఏకమైందని వెల్లడించారు. అక్కడి నుంచి మహోన్నత చరిత్రకు నాంది పలికామని అన్నారు.

పదివేల క్యాండిల్ లైట్లతో అమరులకు నివాళి

సభలో ఆసీనులైన కవులు, కళాకారులు, సామాన్య జనం పదివేల క్యాండిల్ లైట్లతో అమరులకు ఘనంగా నివాళి అర్పించారు. 'జోహారులూ.. జోహారులూ.. అమరులకు జోహార్.. వీరులకు జోహార్' అంటూ దేశపతి గేయాలాపన చేయగా.. సభలో ఉన్నవారంతా నిల్చొని క్యాండిల్ లైట్లను ప్రదర్శించి, అమరులకు ఘన నివాళి అర్పించారు. సభలో లైట్లను ఆపేసి, ఒక్కసారిగా పదివేల క్యాండిల్ లైట్లను వెలిగించటంతో ఆ ప్రాంతమంతా క్యాండిల్ లైట్ల కాంతితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆయన గుండెలో ఎప్పుడూ ఓ కన్నీటి వాన

'సీఎం గారు ఎప్పుడూ తన ముఖంపై విషాద ఛాయలు కనిపించనివ్వరు. గుండె నిబ్బరంతో కనిపిస్తారు. శత్రువుల పట్ల చాలా కఠినంగా మాట్లాడుతారు. అయితే ఎవరికీ తెలియని ఆయనకున్న మరో పార్శ్వం ఆయన గుండెలో ఎప్పుడూ ఓ కన్నీటి వాన కురుస్తూనే ఉంటుంది. అందరికీ గుర్తుండే ఉంటుంది నిరాహార దీక్షను పూర్తి చేస్తూ సార్(కేసీఆర్) ఒక మాట అన్నారు. నా శవయాత్ర జరిగి తెలంగాణ రావాలనుకున్నాను తప్ప బిడ్డలెవరూ మరణించకూడదని అనుకున్నా. ఈ ప్రాణ త్యాగాలను నేను ఊహించలేదు. ఈ ఉద్యమంలో నేను అన్నీ అనుకున్న పద్ధతిలో పోరాట రూపాలను సృష్టించగలిగా. ఇది మాత్రం అనూహ్య పరిణామం. నన్ను జీవితాంతం గుండె కోత పెడుతూనే ఉంటుంది అని సీఎం అన్నారు. అంటే ఆయన గుండెలో ఎప్పుడూ ఓ వాన కురుస్తూనే ఉంటుంది' అని దేశపతి తెలిపారు. దేశపతి ఆలపించిన గేయంతో సభాప్రాంగణం మొత్తం నిశ్శబ్దంగా మారింది. గేయం పూర్తవగానే జై తెలంగాణ.. అమరవీరులకు జోహార్ నినాదాలతో హుస్సేన్‌సాగర్ తీరం మార్మోగింది.

అమరుల కుటుంబాలకు ఆదెరువు

- స్మారక చిహ్నం ప్రారంభోత్సవ వేదికపై ఆరుగురు త్యాగధనుల కుటుంబాలకు గౌరవం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఓ ఉద్విగ్న దృశ్యం ఆవిష్కృతమైంది. మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను ఉద్యమ రథసారథి, ముఖ్యమంత్రి కేసీఆర్ అక్కున చేర్చుకొన్నారు. అమరజ్యోతి ప్రారంభ వేదిక సాక్షిగా వందలాది మంది అమరుల కుటుంబాల నుంచి ప్రతినిధులుగా ఆరుగురి కుటుంబాలను సీఎం కేసీఆర్ గౌరవించారు. ఒక్కో అమరుడి కుటుంబానికి శాలువాలు కప్పుతున్న వేళ.. వారి త్యాగాలను మనసారా స్మరించుకొన్నారు. అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, తమ్ముడు రవీంద్రచారికి సీఎం కేసీఆర్ శాలువా కప్పారు. అమరుడు పోలీసు కిష్టయ్య కుటుంబం నుంచి ఆయన భార్య పద్మావతి, కూతురు ప్రియాంక, కొడుకు రాహుల్‌ను గౌరవించారు. అమరుడు వేణుగోపాల్‌రెడ్డి కుటంబం నుంచి తల్లి లక్ష్మమ్మ, అన్న వెంకట్రామిరెడ్డి, మేనమామ సిద్ధారెడ్డికి, అమరుడు సిరిపురం యాదయ్య కుటుంబం నుంచి ఆయన వదిన లక్ష్మమ్మ, సోదరుడు మహేశ్‌కు, అమరుడు యాదిరెడ్డి కుటుంబం నుంచి తల్లి చంద్రమ్మ, సోదరుడు ఓంరెడ్డికి, కావలి సువర్ణ కుటుంబసభ్యులకు మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సీఎస్ శాంతికుమారితో శాలువాలు కప్పించారు. మొత్తంగా అమరజ్యోతి ప్రారంభ కార్యక్రమానికి అమరవీరుల కుటుంబాల రాకతో దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు పరిపూర్ణమయ్యాయి.

నమస్తే తెలంగాణ

బియ్యంపై మరో కయ్యం

ప్రభుత్వాలు ధాన్య సేకరణ జరపడం వెనుక ఆహారభద్రత అనే పవిత్ర లక్ష్యం ఉంటుంది. సేకరించిన ధాన్యాన్ని గోదాముల్లో నిల్వచేసి ప్రజల అవసరాలకు, మార్కెట్ స్థిరీకరణకు విడుదల చేయడం ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్రాలు సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకొని తిరిగి రాష్ట్రాలకే ఇస్తుంది. ఈ అనుసంధానం మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ సర్కారు ఏర్పడ్డప్పటి నుంచి అదుపు తప్పుతున్నదనేది నిపుణుల మాట. ధాన్యం కొనుగోలు సమయంలో కేంద్రం రకరకాల కిరికిరిలు పెట్టి తెలంగాణను వేధించడం తెలిసిందే. ఇంతే కొంటాం, అంత కొనలేం, బాయిల్డ్ రైస్ అసలే కొనలేం. ఇలా ఇష్టం వచ్చిన కొర్రీలతో కేంద్రం మన రాష్ట్రం ఓపికను పరీక్షిస్తున్నది. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టడం కేంద్రానికి ఒక అలవాటుగా మారింది.

కేంద్ర ఆహార, పౌరసరఫరాల మంత్రి పీయూష్ గోయల్ 'మీ దగ్గర అంత ధాన్యం ఎలా పండింది. ఏదైనా జాదూమంతర్ చేశారా?' అని వెటకారాలు గుర్తొస్తున్నాయి. బాయిల్డ్ రైస్ కొనమంటే ససేమిరా అంటూ.. తెలంగాణ ప్రజలను నూకల బువ్వ తినమన్నారు. ఇలా కొనుగోలు చేసే సమయంలో పరేషాన్ చేసిన కేంద్రం తాజాగా బియ్యం విషయంలో మరో రకం కయ్యం తీస్తున్నది. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీం కింద రాష్ట్రాలకు బియ్యం ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. ఇక్కడ కర్ణాటక గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. మొన్నటి ఎన్నికల్లో 'అన్నభాగ్య' పథకం కింద ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ హామీని ఇప్పుడు కాంగ్రెస్ అమలు చేయాలనుకుంటున్నది. ముందుగా క్వింటాలుకు రూ.3,660 చొప్పున సరఫరా చేసేందుకు ఎఫ్‌సీఐ ఒప్పుకున్నది. ఇంతలో ఏమైందో ఏమో కానీ, ఈ నెల 12న బియ్యం సరఫరా చేయబోమని కర్ణాటక ప్రభుత్వానికి ఎఫ్‌సీఐ లేఖ రాసింది. కేంద్రం ఒక్కసారిగా మాటమార్చడానికి గల కారణాలు ఎవరికి వారే ఊహించుకోవచ్చు. ఇదిలా ఉంటే రాష్ట్రాలు బహిరంగ మార్కెట్లోనే బియ్యం కొనుగోలు చేసుకోవచ్చని గోయల్ మరోసారి ఉచిత సలహా పారేశారు. ఈ నేపథ్యంలో ఇక బియ్యం నిల్వలు దండిగా ఉన్న తెలంగాణపైనే కర్ణాటక ఆశలు పెట్టుకున్నది.

కర్ణాటక ప్రభుత్వం అధిక ధర చెల్లిస్తామన్నప్పటికీ కేంద్రం ససేమిరా అంటున్నది. మరోవైపు ఎఫ్‌సీఐ ద్వారా ఇథనాల్ కంపెనీలకు రూ.2 వేలకు క్వింటాల్ చొప్పున పదిహేను లక్షల టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నది. పేదల ఆకలి తీర్చడానికి వెనుకాడుతున్న కేంద్రం పరిశ్రమలకు మాత్రం తక్కువ ధరకే ఇస్తున్నది. తద్వారా పేదల వైపు కాకుండా పెద్దల వైపే మొగ్గుతానని కేంద్రం మరోసారి చాటుకున్నది. కేంద్రం వద్ద బియ్యానికి కొరత ఉందనీ, కొరత నివారణకు ఎగుమతులపై ఆంక్షలు విధించామనేది గోయల్ వాదన. ఆయన అన్నట్టుగా కొరతే నిజమైతే ఇథనాల్ పరిశ్రమకు మాత్రం ఎలా ఇస్తారనేది ఇక్కడ ప్రధానమైన ప్రశ్న. కొనడంలో కొర్రీలు, అమ్మడంలో అవకతవకల వెనుకా కారణం ఉన్నది. ఉచితాలు, సబ్సిడీలు ఎత్తివేసే ఉద్దేశంతో కేంద్రం క్రమంగా ధాన్యం సేకరణను తగ్గిస్తున్నది. అంతిమంగా ఇది దేశ ప్రజల ఆహార భద్రతకు పెను సవాలుగా మారే ప్రమాదం ఉందని చెప్పక తప్పదు.

అమర జ్యోతికి అభివందనం

ఒక సామూహిక స్వప్నం కోసం నెత్తురు ధారపోసిన నేల ఇది. ఇక్కడ వీచే గాలికి ఎప్పుడూ త్యాగాల పరిమళం అంటుకొని ఉంటుంది. ఇది తెలంగాణం, చరిత్ర పుటలపై ఎగిసిపడిన, ఆరు దశాబ్దాల ఆత్మగౌరవ రణం. తెలంగాణ, ఆంధ్రను కలుపుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాడే తెలంగాణ భవిష్యత్తుకు నిప్పంటుకుంది. ఒప్పందాలు డొల్లమాటలైనయి, రక్షణలు కల్ల రాతలైనయి. నియ్యత్ దప్పి నిధులను తరలించింది సమైక్య సర్కారు. వలస తామర తంపరగా తరలివచ్చి ఉద్యోగాలను కబళించింది. ఆంధ్రోద్యమంలో ఆవహింప జేసుకున్న ఆభిజాత్యం తెలంగాణ వేష భాషలను వెక్కిరించింది.



దేశపతి శ్రీనివాస్
95539 55330



దగా పడ్డ వేదనలోంచి ఊపిరి పోసుకున్నది 'జై తెలంగాణ' నినాదం. 1969 ఉద్యమం తెలంగాణ చరిత్రలో ఒక రక్తసిక్త అధ్యాయం. ఆనాడు తెలంగాణ ఒక ప్రత్యక్ష రణస్థలి. అది ఉమ్మడి భావన ఏ కోశానా లేని ఉన్మత్త సర్కారు. అది భాషను పాచికగా విసిరి నిధులూ, నీళ్లూ నియామకాలను కొల్లగొట్టిన కుహనా సమైక్య సర్కారు. అది నిరాయుధులైన ఉద్యమకారులపై నిప్పుల వర్షం కురిపించిన నిర్దాక్షిణ్య నియంత సర్కారు తలను ఛిద్రం చేస్తూ బుల్లెట్లు దూసుకుపోయినా, గుండెను వ్రయ్యలు చేస్తూ గుండ్లు దిగబడుతున్నా తెలంగాణ బిడ్డలు ఎత్తిన పిడికిలి దించలేదు. ఆగిపోయిన శ్వాసలు అగ్నిబీజాలై నేల గర్భంలో నిక్షిప్తమైనయి, చరిత్ర చెమ్మగిలిన కన్నులతో మరో విస్ఫోటనం కోసం ఎదురుచూసింది.

1996లో దేశంలో చిన్న రాష్ట్రాల భావన చివురించింది. తెలంగాణ మేధావి లోకంలో ఆశ మొగ్గతొడిగింది. గుసగుసలు గుంపులైనయి. పాటలు పల్లవించాయి. ఆచార్య కొత్తపల్లి జయశంకర్, ప్రజాకవి కాళోజీ భావజాల వ్యాప్తికి చుక్కానిగా నిలిచారు. మహాసభలు, జనసభలపై నిర్బంధపు నీలినీడలు విరుచుకుపడ్డాయి. లలిత సుందర తెలంగాణ గీతి ముక్కలు ముక్కలైపోతే మళ్లా నీరవ నిశ్శబ్దంలో నిర్విణ్ణురాలైంది తెలంగాణ. ప్రాణ త్యాగాలతో తొలిదశ ఉద్యమం ముగిసిపోతే, పదవీ త్యాగాలతో మలిదశ ఉద్యమం కట్టలు తెంచుకున్నది. అవిశ్వాస మేఘాలను చెల్లాచెదురు చేస్తూ 2001 ఏప్రిల్ 27న సూర్యుడు జాజ్వల్యమానంగా ఉదయించాడు.

> వివక్షా విద్రోహాల నుంచి విముక్తిని వాగ్దానం చేస్తూ మార్మోగిన కేసీఆర్ ఉపన్యాస గర్జనలలో అమరుల శ్వాసలు అగ్నిపర్వతాలై విస్ఫోటించినయి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమం శ్రావణ మేఘమై ఉరిమింది. కేసీఆర్ ఆగమనంతో సమైక్యవాదం పునాదులు కదిలినయి. కొత్త వెల్లువలో లక్ష్యాన్ని ఛేదించగలమనే విస్పష్ట విశ్వాసంతో విరిసిన గులాబీ వనమైంది తెలంగాణ.

మలిదశ ఉద్యమం అహింసనే ఆయుధంగా ధరించింది. శాంతియుత పంథాలోనే కదం తొక్కింది. కేసీఆర్ రాజనీతిజ్ఞతతో తెలంగాణ రాష్ట్రం జాతీయ ఎజెండాలో భాగమైంది. ప్రధాని నోట పార్లమెంటులో మార్మోగింది. వంచనకు వేయి తలలు అన్నట్టు సమైక్యవాద పార్టీలు వేరువేరైనా అవి పుట్టిన కుదురు ఒక్కటే. అవి చేసిన కుట్రలూ ఒక్కటే.. ఎన్నికలకు ముందు 'జై తెలంగాణ', ఎన్నికలు కాంగనె 'నై తెలంగాణ' అనే కుతంత్రం కొనసాగించినయి సమైక్యవాద పార్టీలు.

కుట్రలను బద్దలు కొట్టేందుకే కేసీఆర్ నిరాహార దీక్షకు పూనిండు. 'గెలిస్తే తెలంగాణ జైత్రయాత్ర, ఓడితే నా అంతిమయాత్ర' అని శపథం చేసిండు. అణచివేతకు దిగిన సమైక్య సర్కారు కేసీఆర్‌ను అరెస్టు చేసింది. తెలంగాణ ఊరూ వాడా ఉడికిపోయింది. రోడ్లు జనసముద్రాలైనయి. యూనివర్సిటీలు యుద్ధ మైదానాలైనయి.

మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి కేసీఆర్ అరెస్టును నిరసిస్తూ తనకు తానుగా అగ్నికి ఆహుతైండు. తెలంగాణ గర్భశోకం మిన్ను ముట్టింది. మా ప్రాణార్పణతోనైనా ఈ పాపకారి సమైక్య పార్టీలకు కనువిప్పు కాకపోతుందా అని ఆశపడ్డారు తెలంగాణ బిడ్డలు. వద్దని వారిస్తున్నా సరే ఒక్కో సందర్భంలో ఒక్కో బిడ్డడు ఒరిగిపోయిండు. కన్నతల్లిదండ్రుల కడుపుకోతతో కన్నీటి సంద్రమైంది తెలంగాణ. కేసీఆర్ దీక్ష ఫలించి డిసెంబర్ 9న రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటన వచ్చింది. కానీ, మాయోపాయాలతో అడ్డుకున్నది నాటి దగాకోరు పాలకవర్గం. ప్రతి తెలంగాణ బిడ్డ పులిబిడ్డై గాండ్రించిండు. రోడ్డు రోకో, రైలు రోకో, మిలియన్ మార్చ్, జాతీయ రహదారుల దిగ్బంధం, వంటావార్పు, సాగరహారం, కవుల కళాకారుల ధూంధాం, సకల జనుల సమ్మె.

మలిదశ ఉద్యమం ఆవిష్కరించిన అపురూప ఘట్టాలెన్నెన్నో.. ధర్మాగ్రహంతో ఉద్యమం పొడుగునా త్యాగ పరిమళాలు వెదజల్లినారు తెలంగాణ అమరులు. ఓ అమరులారా! మీ త్యాగఫలమై 2014 జూన్ 2న ఉజ్వల కాంతులతో ఉదయించింది తెలంగాణ రాష్ట్రం. మీ కన్నుల కాంతులే స్వరాష్ట్ర ప్రగతిలో ప్రతిఫలిస్తున్నాయి. మీ దివ్య తేజస్సే నిరంతర విద్యుత్ ప్రసారమై వెలుగులీనుతున్నది. ఎత్తిపోతలతో ఎగిసివస్తున్న గోదారమ్మ హోరులో, కృష్ణమ్మ జోరులో మీ చిరునవ్వుల సవ్వడే వినిపిస్తున్నది. మీ కలలే చెరువుల అలలై మత్తడి దుంకుతున్నయి. పచ్చని పంటచేలలో మీరు పసిపాపలై ఊయలలూగుతున్నారు.

వలస మాని వాపసొచ్చిన పాలమూరు బిడ్డల తలెలలో మీరు పాలబువ్వలై నవ్వుతున్నారు. సింగిడి రంగుల బతుకమ్మకు మీరు శిఖరమై పరిమళిస్తున్నారు. తెలంగాణ పదేండ్ల ప్రాయంలో అడుగుపెట్టిన పండుగనాడు మీరు మాకు పాలపిట్టలై దర్శనమిస్తున్నారు. ఆచంద్రతారార్కం వెలిగే అమరజ్యోతులై సదా మా హృదయాల్లో వెలుగుతున్నారు. జోహార్ తెలంగాణ అమరవీరులకు..

మలిదశ ఉద్యమం ఆవిష్కరించిన అపురూప ఘట్టాలెన్నెన్నో.. ధర్మాగ్రహంతో ఉద్యమం పొడుగునా త్యాగ పరిమళాలు వెదజల్లినారు తెలంగాణ అమరులు. ఓ అమరులారా! మీ త్యాగఫలమై 2014 జూన్ 2న ఉజ్వల కాంతులతో ఉదయించింది తెలంగాణ రాష్ట్రం.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)

యాజ్జేసుకుంటం

ఆకలైతే సప్పిడి బువ్వల ఉప్పునీళ్లకు బదులు
కన్నీళ్లను కలుపుక తాగినోళ్లను..
అగ్గి తానమాడి చీకటి కూడళ్లల్ల
కొర్రాసై నిలబడినోళ్లను...

> ఉడుకుడుకు బువ్వలిన్ని తునుకలేసి
> కలుపుకొంటున్నపుడు
> వాడకట్టు మూలమీది లైటుకిందా
> నలుగురం గూడి మాట్లాడుకుంటున్నపుడు
> మిమ్ముల యాజ్జేసుకుంటం..

మండే ఎండకాలం కూడా
నిండుగా పారే వాగు వంకల కాడా..
యాసంగిలో పుట్లు పుట్లుగా పుట్టే వడ్ల కుప్ప కాడా
మిమ్ముల యాజ్జేసుకుంటం..

> ఖాళీగున్న కొలువుల్లో
> మీ అన్నదమ్ముల్లో, మీ అక్కాచెల్లెల్లో కూసుంటే
> ఆ కుర్చీలల్ల మీ రూపు తలిసి
> మిమ్ముల యాజ్జేసుకుంటం..

శెరువు నీటి అలల మీద ఊయలూగే
బతుకమ్మ శిగలోన మెరిసే గౌరమ్మల్లో
అనిత, అశ్విని, స్వర్ణలను యాజ్జేసుకుంటం..

> దసర నాడు ప్రేమగా పంచుకునే
> జమ్మాకు బంగారం, పాల పిట్టల్లో
> యాదయ్య, శ్రీకాంత్, సురేష్‌లను
> యాజ్జేసుకుంటం..

రాష్ట్రం నడిబొడ్డున
చిన్న రాష్ట్రాల సృష్టికర్త బాబాసాహెబ్ ముందు
మీ స్మృతివనం నివాళి దీపమోలే ఎలిగేది
మా కన్నీటి సమురుతోనే బిడ్డా..

> మీ ఆశయాన్ని అమలుజేసుకునేటప్పుడు
> మల్లొక ఉద్యమమే చేయాల్సి వచ్చినప్పుడు
> మీ స్ఫూర్తిని, పోరాటాన్ని తప్పక యాజ్జేసుకుంటం
> యాజ్జేసుకుంటం.. యాజ్జేసుకుంటం..



వి.దిలీప్
84640 30808

భారత స్వాతంత్ర్య పోరాటం తర్వాత అంతటి మహత్తరమైనది తెలంగాణ రాష్ట్ర సాధన విప్లవం. 1969లో రాజుకున్న ప్రత్యేక తెలంగాణ నిప్పునకు ఖమ్మం జిల్లా పాల్వంచ పునాది. అదే సంవత్సరం జనవరి 13న ఏర్పడిన తెలంగాణ పరిరక్షణ కమిటీకి ఉస్మానియా విద్యార్థులు బాసటగా నిలబడ్డరు. జనవరి 24న సదాశివపేటలో జరిగిన కాల్పుల్లో 14 మంది గాయపడ్డరు. వారిలో పదిహేడేండ్ల శంకర్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మరుసటిరోజు చనిపోయిన్రు.

ఆశయాలకు ఆదెరువు



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
93909 97371

1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. ఆగ్రహోదగ్రుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ తిరుగుబావుటా ఎగరేసి, మంత్రి పదవికి రాజీనామా చేసిన్రు. సరిగ్గా అదే కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశీర్వాదంతో మూడు దశాబ్దాల తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జలదృశ్యం సాక్షిగా ప్రత్యేక రాష్ట్ర కాడిని ఎత్తుకున్నరు. ఉద్యమానికి మెరుపు వేగాన్ని, చాతుర్యాన్ని, ఇంకా ఎన్నో హంగులనూ అద్దిన్రు, తీవ్రతను పెంచిన్రు.

నాటి శంకర్‌తో మొదలైన త్యాగాల పరంపర 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించేదాకా కొనసాగింది. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి మొదలుకొని వందలాది తెలంగాణ బిడ్డలు చావుకు ఎదురేగిన్రు. సకలజనులూ ఏకమైన మహోజ్వల విప్లవమది. ప్రతి తెలంగాణ బిడ్డా తమ అస్తిత్వం కోసం నినదించిన అపురూపమది. మలిదశ ఉద్యమంలో తెలంగాణ కాంక్షించే సర్వ శక్తులకూ అనితర సాధ్యమైన రాజకీయ నాయకత్వం అందించి గల్లీ పోరాటాల్లోనూ, ఢిల్లీ లాబీల్లోనూ అంతా తానైన కేసీఆర్ దక్షత గురించి ప్రస్తావించడం ఆయనను పొగడటం కోసం కాదు, అమరుల ఆశయాలకు ఆయన ఆదెరువు అయిండని గుర్తు చేసుకోవడం.

> తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు, జూన్ 22న, అమరులను యాది చేసుకుంటున్నం. నిరంతరం వారిని గుండెల్లో పెట్టుకొని పూజించుకునే మనం ఈ రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా, నాటి కొండా లక్ష్మణ్ బాపూజీ జలదృశ్యం సమీపాన అమరుల స్మారక చిహ్నాన్ని ఆవిష్కరింపజేసుకుంటున్నం.

అమరులు నాడు ఏమి కోరుకున్నరు? నేడు వారి స్ఫూర్తి మనకు ఏమి దిశానిర్దేశం చేస్తున్నది? అందరి అభివృద్ధి-సంక్షేమ - ఆత్మగౌరవాలకు ఆలవాలమైన తెలంగాణ; ఎలాంటి వివక్షా లేని, అసమానతల్లేని తెలంగాణ; శాంతికాముక తెలంగాణ; పాలనలో, పరిణతిలో దేశానికి దారి చూపే తెలంగాణ... ఇవి కదా?

స్వరాష్ట్రం సాధించుకున్న తొమ్మిదేండ్లలోనే తెలంగాణ ఎన్నో అభివృద్ధి సూచీల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా విలసిల్లుతున్నది. ప్రతి రోజూ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు; ఆర్బీఐ, నీతి ఆయోగ్ లాంటి సంస్థలు ఇందుకు తార్కాణంగా ప్రశంసలు, అవార్డులు, రివార్డులు ఇస్తూనే ఉన్నయి. లండన్ కేంద్రంగా మనం సర్టిఫికెట్లు అందుకుంటున్నం. అమెరికా, యూరప్ సహా అంతటా మన పేరు మార్మోగుతున్నది, పెట్టుబడులు వెల్లువెత్తుతున్నయి. ఈ 'వేదిక' పేజీలలోనే ఎన్నో సార్లు మాట్లాడుకున్నం మనం గణాంకాల సహితంగా. మరి కొద్ది గంటల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపబడే అమరుల స్మారక చిహ్నం, నిరంతరం వెలిగే జ్యోతి రూపంలోని అమరుల స్ఫూర్తి మనకు ప్రేరణ ఇవ్వడమే కాకుండా, నిరంతర జాగరూకత అవసరం అని కూడా చెప్తయి.

> 'ఉద్యమకారులు' అనే పదం ఉచ్చరించడానికి కూడా అర్హతలేని వ్యక్తులు నేడు ప్రజాపాలనపై బురద జల్లుతూ ఉన్నరు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ దండలో దారం ఆధారంగా తెలంగాణ విరాజిల్లుతూ ఉన్నది. తొట్ట తొలి ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ఆంధ్రా నాయకులతో కుమ్మక్కయి లక్షలాది రూపాయలతో టీవీలకు చిక్కిన దొంగ నేడు ఒంటెత్తున లేస్తున్నడు. అమరులకు అత్యంత అవమానం ఇలాంటి వ్యక్తి చేతిలో కాంగ్రెస్ పార్టీ తన రాజకీయాలు నడపడం.

మొన్న సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ అన్నట్టు తెలంగాణ మొత్తం వంద శాతం అభివృద్ధి జరిగిందని చెప్పడం లేదు. అది అసలు ఏ ప్రపంచంలోనూ సాధ్యం కాదు, స్వర్గంలోనూ తారతమ్యాలున్నట్టుగా! అయితే, నిరంతరం ప్రజల బాగోగులు పట్టించుకుంటూ గతానికన్నా మెరుగ్గా, ఎవరూ ఊహించతలపెట్టని గొప్ప గొప్ప సంకల్పాలకు ఆచరణ రూపం ఇవ్వడం మాత్రం కేసీఆర్ పాలనకే సాధ్యమైంది. సాగు, తాగునీరు, నిరంతర విద్యుత్, రైతుబంధు, దళిత బంధు, ఐటీ/ పారిశ్రామిక ప్రగతి, పటిష్టమైన శాంతిభద్రతలు... దేశంలో ఏ రాష్ట్రం కూడా మనకు దరిదాపుల్లో లేదు.

ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి ప్రకటిస్తున్న వినూత్న విధానాలు రూపుదాల్చాలంటే, అమరుల ఆకాంక్షల అమలు నిర్విఘ్నంగా సాగాలంటే, మరొకసారి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉన్నది. కుల పిచ్చితో కొట్టుకుంటున్న కాంగ్రెస్, మత పిచ్చిలో మునిగిపోయిన బీజేపీ రాష్ట్రాన్ని వందేండ్లు వెనక్కు తీసుకుపోగలవు. దార్శనికత చచ్చిపోయి, తెలంగాణపై ప్రేమ పుచ్చిపోయి, కేవలం కేసీఆర్ పట్ల వ్యక్తిగత ద్వేషంతో, ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయడం అనే ఏకైక దివాళాకోరు కోరికతో దిక్కూ దివాణం లేకుండా తిరుగుతున్న కొందరు బుద్ధిశీలురు కూడా తెలుసుకోవాల్సిందిదే. నిత్యం అమరులు, ఉద్యమకారులు అని జపించే మీరు వారికి క్షోభను మిగులుస్తున్నరు.

కళ్లు తెరవండి. ఐదారు రాష్ట్రాలు తప్ప నేడు దేశమంతా పేదరికానికి దిగువనే ఉన్నది. మతోద్వేగాలు తప్ప ఏమీ పట్టని పార్టీ ఏలుబడిలో మన దేశం కునారిల్లి పోతున్నది. దేశాన్ని మారుద్దామని కేసీఆర్ పిలుపునిస్తున్నరు. అందిపుచ్చుకొండి. మార్పు అంటే విప్లవం. విప్లవం అంటే అమరులు. అమరులు అంటే ప్రేమ. గుండెనిండా ప్రేమ నింపుకొండి, ప్రజల కోసం పనిచేసేవారికి బాసటగా ఉండండి. రండి అమరులకు నిజమైన నివాళులర్పిద్దాం. జై తెలంగాణ, జై భారత్...

ఉద్యమ ధ్రువతారలకు నివాళి

తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, భాషను పరిరక్షించుకోవడానికి, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా 1952 నుంచి 2014 వరకు ఈ ప్రాంతంలో జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో వెయ్యి మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు తమ ప్రాణాలనర్పించారు.



వి.ప్రకాశ్
95539 55304



తెలంగాణ వైతాళికులు కొండా వెంకట రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, బొజ్జా నర్సిములు, కేఆర్ ఆమోస్, కొలిశెట్టి రామదాసు, మల్లికార్జున్, మదన్‌మోహన్, నూకల రామచంద్రారెడ్డి, ఆచార్య జయశంకర్, ప్రొ.కేశవరావు జాదవ్ వంటి ఎందరో మహానుభావులు మూడు తరాలుగా సాగిన తెలంగాణ మహోద్యమంలో దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలకు సిద్ధమై తన పదవులను వదిలేసి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించారు. గమ్యాన్ని ముద్దాడేదాకా ఉద్యమకాడిని వదిలేది లేదని అనితర సాధ్యమైన శాంతియుత పద్ధతిలో ఉద్యమాన్ని విజయతీరం వైపు నడిపించి కోట్లాది ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చగలిగారు.

ఇరువయ్యో శతాబ్దంలో తెలంగాణ ప్రాంతంలో పలు జీవన్మరణ పోరాటాలు విఫలమైనా లేదా పరిమిత ప్రయోజనాలను మాత్రమే సాధించగలిగినా ఇరవై ఒకటవ శతాబ్ది తొలిరోజుల్లోనే మొదలైన మలిదశ ఉద్యమం గొప్ప విజయాన్ని అందించి ఈ ప్రాంత ప్రజల పోరాటాల చరిత్రను మలుపుతిప్పింది 'నాన్ ముల్కీ-గో బ్యాక్' నినాదంతో 1952లో వరంగల్‌లో విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం హైదరాబాద్ సిటీ కాలేజీ, అఫ్జల్‌గంజ్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వద్ద జరిగిన పోలీసు కాల్పులతో రక్తసిక్తమైంది. ఎనిమిది మంది యువకులు ప్రాణాలనర్పించి భవిష్యత్ తెలంగాణ ఉద్యమానికి దారిచూపే ధృవతారలైనారు.

1969 ప్రారంభం రోజుల్లోనే ఖమ్మం, వరంగల్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొదలైన చరిత్రాత్మక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోలీసుల బుల్లెట్లకు వందలాది మంది నేలకొరిగారు. ఉద్యమకారుల అంచనాలను బట్టి 369 మంది ఈ ఉద్యమంలో మరణించారు. 2001 నుంచి కేసీఆర్ నాయకత్వంలో మలిదశ ఉద్యమం శాంతియుతంగానే కొనసాగినా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా ఆవేశపూరితమైన యువతీయువకులు వందలాదిగా బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ ఉద్యమవీరుల ఆకాంక్షలను సాధించగలగడం గొప్ప నివాళి అయినా పదికాలాల పాటు వారిని ఈ రాష్ట్ర ప్రజలు స్మరించుకునేవిధంగా ప్రపంచంలోనే మరే పోరాటయోధులకు దక్కనంత గొప్ప స్మారక చిహ్నంగా 'అమరజ్యోతి'ని కేసీఆర్ నిర్మించి ఈ రోజు ఆవిష్కరిస్తున్నారు.

జలదృశ్యం స్థలంలోనే అమరజ్యోతి....

చరిత్రలో స్థలపురాణానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. 'అమరజ్యోతి' స్థలం ఎంపిక యాదృచ్ఛికంగా జరిగింది కాదు. 2001 ఏప్రిల్ 27న ఈ స్థలం జలదృశ్యంలోనే కేసీఆర్ తొలిసారి టీఆర్ఎస్ పార్టీని ప్రకటించి గులాబీ జెండాను ఎగురవేశారు. అదే సంవత్సరం మే 17న ఈ జలదృశ్యం నుంచే కరీంనగర్ సింహగర్జన సభకు తరలివెళ్లారు. సుమారు పది నెలల పాటు ఈ స్థలంలోనే మేధోమథనం జరిగి తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమ ప్రణాళికలు రూపొందించబడ్డాయి. 2002 ఫిబ్రవరి 9న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వందలాది మంది పోలీసులతో, మున్సిపల్ సిబ్బందితో చరిత్రాత్మకమైన జలదృశ్యాన్ని అక్రమంగా దౌర్జన్యంగా కూల్చివేసి తెలంగాణ ఉద్యమనేతల్లో 'కసి'ని రగిలించారు. టీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం అప్పుడు జలదృశ్యంలోనే ఉండేది.

తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని (1969లో) త్యాగం చేసిన బహుజనుల ప్రియతమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ నాలుగున్నర దశాబ్దాలు ఈ జలదృశ్యంలోనే నివసించా రు. అప్పటి తెలంగాణ ప్రజా సమితి ఉద్యమ ప్రణాళికలు కూడా రూపొందింది ఈ జలదృశ్యంలోనే. ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఒక మక్తాదార్‌కు 'ఇనాం'గా ఇచ్చిన 'జలదృశ్యం'లో హైదరాబాద్ శాసనసభను నిర్మించాలనుకున్నారు. మక్తాదారు సహకరించక న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆయన కల నెరవేరలేదు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నుంచి ఎన్టీఆర్ వరకు ఈ జలదృశ్యాన్ని సినిమా థియేటర్లు, విలాసవంతమైన హోటళ్ళు, పర్యాటక ప్రదేశంగా మార్చాలని ప్రయత్నించారు.

> వారి ఆలోచనలను బాపూజీ అడ్డుకుంటూ సుదీర్ఘమైన న్యాయపోరాటాన్ని యాభై ఏండ్లు కొనసాగించారు. అప్పటి మక్తాదారు దగ్గర తొంభై తొమ్మిదేండ్లు లీజుకు కొండా లక్ష్మణ్ బాపూజీ చట్టబద్ధంగా తీసుకొని 1958లో ప్రభుత్వ అనుమతి, కోర్టు ఆదేశాలతో జలదృశ్యంలో తన నివాస భవనాన్ని నిర్మించుకొని దాన్ని కూల్చివేసే దాకా ఆయన ఇక్కడే నివసించారు.

1997లోనే జలదృశ్యంలోని గ్రౌండ్ ఫ్లోర్‌ను తెలంగాణ ఐక్యవేదిక కార్యాలయ నిర్వహణ కోసం ఉచితంగా ఇచ్చారు. నేను, ప్రొ.జయశంకర్, ప్రొ.కేశవరావు జాదవ్, భూపతి కృష్ణమూర్తి, ప్రముఖ జర్నలిస్టులు ప్రతాప్‌కిశోర్, సంతపురి రఘువీర్‌రావు ఈ జలదృశ్యం నుంచే మూడేండ్ల పాటు తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని నిర్వహించాం. తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయం జలదృశ్యంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించడంతో నా కోర్కెను మన్నించి, సుద్దాల సుధాకర్ తేజ (వాస్తు సలహాదారు) సూచనలతో వాస్తు దోషాలను సరిదిద్ది టీఆర్ఎస్‌ను ఇక్కడే ప్రారంభించారు కేసీఆర్.

> జలదృశ్యంలో ఏడెకరాల విశాలమైన మైదానం ఉండేది. వేలాది మందితో పార్టీలో చేరికలు జరిగేవి. ప్రతిరోజూ కేసీఆర్, జయశంకర్ ప్రసంగాలు వినడానికి ప్రజలు, కార్యకర్తలు, న్యాయవాదులు వందలాదిగా తరలివచ్చేవారు. పార్టీని ప్రారంభించిన రెండు నెలలకే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో తెలంగాణ ప్రాంతంలోని అత్యధిక మండల కేంద్రాలను అతి తక్కువ సమయంలో పర్యటించాల్సి రావడంతో కేసీఆర్ హెలికాప్టర్‌ను కిరాయికి తీసుకొని జలదృశ్యంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వై.ఎస్. బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరితే కేసీఆర్ తన కార్యాలయమైన జలదృశ్యం నుంచే హెలికాప్టర్ టేకాఫ్ కావడం చంద్రబాబు జీర్ణించుకోలేకపోయారు. 2002 ఫిబ్రవరి 9, 10 తేదీల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద టీఆర్ఎస్ నాయకత్వ శిక్షణా తరగతులలో మేమంతా నిమగ్నమై ఉన్న సందర్భం. కొండా లక్ష్మణ్ బాపూజీ 'జలదృశ్యం' కేసులో వాదించడానికి సుప్రీంకోర్టుకు వెళ్లిన సమయంలో వృద్ధురాలైన ఆయన భార్యను బయటికి గెంటేసి, సామాన్లన్నీ, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోని సామగ్రిని, ఫర్నిచర్‌ను గోషామహల్ పోలీసు క్యాంపుకు తరలించి చట్టవిరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం జలదృశ్యాన్ని నేలమట్టం చేసి పర్యాటక శాఖకు ఈ స్థలాన్ని అప్పగించాడు.

> జలదృశ్యం స్థలంలోనే 2013లో కేసీఆర్ చొరవ, ఉద్యమకారుల పట్టుదలతో కొండాలక్ష్మణ్ బాపూజీకి అంత్యక్రియలు నిర్వహించాం. కేసీఆర్ ఉద్యమస్ఫూర్తిని, ఆయనలోని కసిని, పట్టుదలను, నిశ్శబ్ద మౌనం వెనుక దాగిన కోపాన్ని, ఆవేశాన్ని 'అమర జ్యోతి' నిర్మాణం, ప్రక్కనే నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం నేపథ్యంలో చూడగలం.

2001 నుంచి కేసీఆర్ నాయకత్వంలో మలిదశ ఉద్యమం శాంతియుతంగానే కొనసాగినా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా ఆవేశపూరితమైన యువతీయువకులు వందలాదిగా బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ ఉద్యమవీరుల ఆకాంక్షలను సాధించగలగడం గొప్ప నివాళి అయినా పదికాలాల పాటు వారిని ఈ రాష్ట్ర ప్రజలు స్మరించుకునే విధంగా ప్రపంచంలోనే మరే పోరాటయోధులకు దక్కనంత గొప్ప స్మారక చిహ్నంగా 'అమరజ్యోతి'ని కేసీఆర్ నిర్మించి ఈ రోజు ఆవిష్కరిస్తున్నారు.

.... నిపుణ పేజీల్లో ....
- భూ ఉపరితలంపై సముద్రాల శాతం ఎంత?
- ఆఫ్రికా-ఆస్ట్రేలియాలను విడదీసే మహాసముద్రం?
- నీటిచక్రంలో బాష్పీభవనం అనగా?
- నత్తల ద్వారా జరిగే పరపరాగ సంపర్కానికి పేరు?
- రైతు బీమా పథకం ఎప్పుడు ప్రారంభమైంది?

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

- 2050 నాటికి 130కోట్ల మధుమేహులు
- 'టైటాన్' విషాదాంతం.. ఐదుగురి మృతి
- విజిలెన్స్ దాడి.. పక్కింటిపైకి నోట్ల కట్టలు
- టీఎస్‌పీఎస్సీ కేసులో మరొకరి అరెస్టు
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరికలు

.... లోపలి పేజీల్లో

శనివారం SATURDAY 24.6.2023 | హైదరాబాద్ HYDERABAD | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 19 ‖ వెల (Price) రూ.6.50 | పేజీలు: 14+16/12 Pages: 12+16/12 | PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD | www.ntnews.com /ntdailyonline



పేదోడి ప్యాలెస్

ప్రతి ఫ్లోర్‌కు ఫైర్ సేఫ్టీ.. అడుగడుగున సీసీ కెమెరాల నిఘా.. ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్.. పెట్రోల్ బంక్, పోస్టాఫీస్.. బస్టాప్, బస్ టెర్మినల్.. బతుకమ్మ ఘాట్, హాస్పిటల్..రైతుబజార్, మిల్క్ బూత్.. స్కూల్, లైబ్రరీ, పార్కు..వాకింగ్ ట్రాక్, ప్లే గ్రౌండ్.. ఓపెన్ జిమ్ ఇండోర్ కాంప్లెక్స్.. సకల సౌకర్యాలకు నెలవు కొల్లూరు టౌన్‌షిప్! కేసీఆర్ కట్టించిన పేదోళ్ల ప్యాలెస్!!

ముఖ్యమంత్రి నివాసం ప్రగతిభవన్‌లో ఉండే లిఫ్ట్ షిండ్లర్ కంపెనీది.. **కొల్లూరు డబుల్ బెడ్రూం టౌన్‌షిప్‌లో ఉన్న లిఫ్టూ ఆ కంపెనీదే!**

పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలో కరెంటు పోకుండా జనరేటర్లుంటాయి.. **కొల్లూరు టౌన్‌షిప్‌లోనూ బ్లాక్‌కు ఒకటి చొప్పున 117 జనరేటర్లున్నాయి!**

హైదరాబాద్ మహానగరంలో విశాలమైన రోడ్లు కనిపిస్తాయి.. **కొల్లూరు లోనూ అంతే విశాలమైన రోడ్లున్నాయి!**

హైఫై నగరాల్లో అండర్‌గ్రౌండ్ నీళ్లు, కరెంటు సరఫరా ఉంటాయి.. **కొల్లూరు డబుల్ బెడ్రూం టౌన్‌షిప్ లోనూ అంతా అండర్‌గ్రౌండ్‌లోనే!**

సాధారణంగా పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లకే సెక్యూరిటీ గార్డు ఉంటారు.. **ఇక్కడా.. వందకుపైగా సెక్యూరిటీ గార్డులను నియమించారు!**

ఊర్లలో కరెంటు కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి.. **కానీ కొల్లూరులో ఏకంగా ఒక సబ్‌స్టేషనే ఉన్నది!**

జనాభాపరంగా చూస్తే హైదరాబాద్ చుట్టూ ఉన్న అనేక మున్సిపాలిటీల కన్నా కొల్లూరు టౌన్‌షిప్ పెద్దది! ప్రభుత్వం అనుకుంటే మున్సిపాలిటీ అయ్యే అన్ని అర్హతలు ఈ టౌన్‌షిప్‌కు ఉన్నాయి.

మురికివాడలను చీల్చుకుని మొలిచిన భువన భవనం
బస్తీ పేదల ఆత్మగౌరవాన్ని ఆకాశమెత్తు నిలిపిన హర్మ్యం
ఆసియాలోనే అతిపెద్ద నివాస గృహ సముదాయం
సంక్షేమ సన్నివేశానికి ఇది శిఖరాయమాన దృశ్యం
కొల్లూరు.. ఊరు కాదు.. ఓ మహానగరి!
ఏ సిటీ ఇన్ అవర్ సిటీ!.. ఏ సిటీ విత్ డిగ్నిటీ!

కబూతర్‌ఖాన లాంటి ఇరుకు గదులు కావవి.. నిఖార్సయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు. అత్యద్భుత వసతులతో ఒకేచోట 15,600 గృహాలతో నిర్మించిన భారీ టౌన్‌షిప్. ప్రపంచస్థాయి గేటెడ్ కమ్యూనిటీకి ఏమాత్రం తక్కువకాని ఇంద్రభవనాలివి. కమ్యూనిటీ హాల్స్, షాపింగ్ మాల్సే కావు.. నర్సింగ్‌హోం, మార్కెట్, పెట్రోల్‌బంక్, పోస్టాఫీసు, పార్కులు, ప్లేగ్రౌండ్, అంగన్‌వాడీ ప్లేస్కూల్, రైతుబజార్.. నగరంలో ఉన్న వసతులన్నింటినీ అక్కడ సమకూర్చింది రాష్ట్ర ప్రభుత్వం. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసింది.

దశాబ్దాలుగా పాలకుల మాటలు, నిపుణుల ప్రణాళిక కాగితాలకే పరిమితమైన దేశంలో 'ప్రణాళికబద్ధమైన పట్టణా'నికి నిలువెత్తు నిదర్శనం కొల్లూరు టౌన్‌షిప్! గరీబ్‌రథ్.. గరీబ్ కల్యాణ్ యోజన అంటూ ప్రభుత్వాలే చిన్నచూపు చూస్తున్న వేళ కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సిసలైన డిగ్నిటీ హౌసింగ్ కాలనీ..!

కొల్లూరు కేసీఆర్‌నగర్ టౌన్‌షిప్‌పై 'నమస్తే తెలంగాణ' సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధులు గుండాల కృష్ణ, వర్ధెల్లి బాపురావు.. ఫొటోగ్రాఫర్ రజనీకాంత్‌తో కలిసి అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

సంపన్నుల లగ్జరీ ఇండ్ల తరహాలో కేసీఆర్ నగర్

- గేటెడ్ కమ్యూనిటీని మించిన డిగ్నిటీ కాలనీ
- కార్పొరేట్ సౌకర్యాలతో సర్కారు నిర్మాణం
- 234 లిఫ్టులు, జనరేటర్లు.. ఫ్లోర్‌కో ఫైర్ సేఫ్టీ
- ఔటర్, ఇన్నర్ రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు
- అండర్‌గ్రౌండ్ సంపులు, కరెంట్ కేబుళ్లు
- వాకింగ్ ట్రాక్‌లు, పార్కింగ్, ఫంక్షన్ హాళ్లు
- టౌన్‌షిప్‌తో సీఎం కేసీఆర్ కొత్త అధ్యాయం
- కేసీఆర్ నగర్‌పై 'నమస్తే తెలంగాణ' కథనం

పేదోడికి ఉచితంగా 50 లక్షల విలువైన డబుల్ బెడ్రూం

మున్సిపాలిటీగా కొల్లూరు టౌన్‌షిప్ ?

ఓ బైక్ వేసుకొని ఔటర్ రింగ్‌రోడ్డు ఎక్కి సంగారెడ్డి జిల్లా కొల్లూరు వైపు అలా వెళ్తుంటే భారీ ఇండ్ల సముదాయం కనిపిస్తది. అక్కడ ఇండ్లన్నీ ఒకేలా ఉంటాయి, విశాలమైన రోడ్లు ఉంటాయి. దగ్గరికి వెళ్లి చూస్తే, ఇన్నర్, ఔటర్ రోడ్లు స్వాగతం పలుకుతాయి, షాపింగ్ కాంప్లెక్స్‌లు దర్శనమిస్తాయి, వాకింగ్ ట్రాక్‌లు, బైక్ పార్కింగ్ సదుపాయం, ఫంక్షన్ హాళ్లు.. ఇలా సకల సౌకర్యాలుంటాయి. ఇవన్నీ చూసి అదేదో ప్రైవేట్ టౌన్‌షిప్ అనుకుంటే పొరపాటే. పేదోడు ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించేలా తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం అది. అవును! కార్పొరేట్ కంపెనీలు కట్టే లగ్జరీ ఇండ్లకు ఏమాత్రం తగ్గకుండా రాష్ట్ర సర్కారు నిర్మించిన పేదల ఇండ్లు అవి.

› 10


పొరుగున బియ్యం కరువు


మనమే కల్పతరువు

దేశానికి తెలంగాణ బువ్వ!



- ఆకలి కేకల నుంచి పక్కవారి ఆకలి తీర్చే దాకా
- బియ్యం ఇవ్వాలంటూ తోటి రాష్ట్రాల విన్నపం
- తెలంగాణకు తమిళనాడు, కేరళ, కర్ణాటక లేఖలు
- అత్యధిక ఉత్పత్తితో దేశ ధాన్యరాశిగా రాష్ట్రం
- కొరత ఏర్పడినా కనికరించని కేంద్ర ప్రభుత్వం!





బియ్యం సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వానికి తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు రాసిన లేఖలు


హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఒకనాడు ఆకలి కేకలు వినిపించిన తెలంగాణ ప్రాంతం.. నేడు కడుపునిండా తినటమే కాదు, తోటి రాష్ట్రాల ఆకలి తీర్చి దేశానికే బువ్వ పెట్టేస్థాయికి ఎదిగింది. పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బియ్యానికి కొరత ఏర్పడింది. కేంద్రాన్ని కోరినా కనికరించలేదు. ఈ పరిస్థితిలో తెలంగాణ రాష్ట్రం పొరుగు రాష్ట్రాలకు కల్పతరువులా మారింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు స్వయంగా బియ్యం సరఫరా కోసం తెలంగాణ ప్రభుత్వానికి లేఖలు రాశాయి. ఒకప్పుడు బీళ్లతో నోళ్లు తెరిచి గింజ కూడా పండించలేక పడావుపడిన తెలంగాణ వ్యవసాయ భూములు.. ఇప్పుడు సీఎం కేసీఆర్ దీక్షాదక్షత ఫలితంగా దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. స్వరాష్ట్ర సాధన ఫలితాన్ని ప్రపంచానికి ఘనంగా చాటి చెప్తున్నాయి.

తోటి రాష్ట్రాలకు వెలుగురేఖ

కొవిడ్, ఆ తర్వాత సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు, ఇతర పరిణామాల నేపథ్యంలో అనేక రాష్ట్రాల వద్ద బియ్యం నిల్వలు నిండుకున్నాయి. దీంతో తమకు ఎఫ్‌సీఐ నుంచి బియ్యం పంపిణీ చేయాలని అనేక రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. కావాల్సినంత ధర ఇస్తామని › 4వ పేజీలో

నమస్తే తెలంగాణ

తకరారు బాబు ఎకరాల ఏడుపు



‘ఒకప్పుడు ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో నాలుగెకరాలు కొనేవాళ్లు. ఇప్పుడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రాలో యాభై ఎకరాలు, వందెకరాలు కొనే పరిస్థితి వచ్చింది’

- సోమవారం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు

తెలంగాణలో ఎకరం అమ్మితే.. ఏపీలో 50 ఎకరాలు

గతంలో ఆంధ్రాలో ఎకరం.. ఇక్కడి నాలుగెకరాలట!

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్కసు వ్యాఖ్యలు

తెలంగాణ బాగు కోరని బాబు.. నొసటితో వెక్కిరింతలు

రెచ్చగొట్టేందుకే ప్రయత్నం.. ప్రశంసల పాచిక అందుకే!

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నిర్మాణానికి తానే ముగ్గుపోసానని చెప్పుకునే చంద్రబాబునాయుడు.. పదే పదే తనను తాను ప్రపంచ నిర్మాతగా ప్రకటించుకునే చంద్రబాబునాయుడు.. అత్యధిక కాలం పరిపాలించిన ముఖ్యమంత్రిగా చెప్పుకొనే చంద్రబాబునాయుడు.. రాష్ట్రపతి, ప్రధానులను తానే నియమించానని చెప్పుకునే చంద్రబాబునాయుడు.. ఇన్నాళ్లకు ఆయన నోటివెంట ఒక నిక్కమైన, నిజమైన మాటొకటి వచ్చింది. ‘ఒకప్పుడు ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో నాలుగెకరాలు కొనేవాళ్లు. ఇప్పుడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రాలో యాభై ఎకరాలు, వందెకరాలు కొనే పరిస్థితి వచ్చింది’ అని బాబు వ్యాఖ్యానించారు. సోమవారం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీ అధినేత రెండు రాష్ట్రాల్లో భూముల విలువను పోల్చుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పైకి చూస్తే చంద్రబాబు వ్యాఖ్య ప్రశంసలా కనిపిస్తుంది కానీ, కాదు. తెలంగాణవాళ్లకు బతకడం, బట్టకట్టడం, వరి అన్నం తినడం నేర్పామంటూ పలు సందర్భాల్లో అహంకారం చూపిన నోరు కదా అది. ఆధిపత్య అహంకారాన్ని అణువణువునా నింపుకొన్న బాబు తన స్వభావానికి భిన్నంగా ఎక్కడైనా, ఎప్పుడైనా తెలంగాణను ప్రశంసిస్తడా? ఆయన జీవితకాలంలో ఆ పనిచేస్తడా? అందునా కేసీఆర్‌ను పొరపాటునైనా బాబు ప్రశంసిస్తడా? అదే ఆలోచించాల్సిన విషయం. అర్థం, అవగతం చేసుకోవాల్సిన విషయం. మరి చంద్రబాబు ఈ మాటలు ఎందుకు అన్నారు? వీటి లోతేమిటి? లోగుట్టేమిటి? అంతరార్థమేమిటి? అసలు సంగతేమిటి?

తెలంగాణ అంటే బాబుకు మొదటినుంచీ అవమానం. బాబు అంటేనే తెలంగాణకు మొదటినుంచీ అనుమానం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో నలిగిన తెలంగాణకు సమైక్యపాలకుల నల్లికుట్ల వ్యవహారాలు, నక్కజిత్తుల పన్నాగాలు, నంగి మాటలు బాగా ఎరుక. రాష్ట్ర ఏర్పాటును బలంగా వ్యతిరేకించిన చంద్రబాబు.. ప్రపంచంలోనే ఎక్కడాలేని ‘రెండుకండ్ల సిద్ధాంతం’ 7వ పేజీలో

దశాబ్ది ఉత్సవాలు పరిసమాప్తం



గురువారం హైదరాబాద్‌లో అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం అనంతరం క్యాండిళ్లు వెలిగించి అమరులకు నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వీ శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్, ఎంపీలు కేకే, నామా నాగేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండా ప్రకాశ్ తదితరులు



గన్‌పార్క్‌లోని అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్



డోలు వాయిస్తూ.. నృత్యాలు చేస్తూ భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివస్తున్న ఒగ్గుడోలు కళాకారులు



క్యాండిళ్లు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి తదితరులు



తెలంగాణ అమరుల స్మారక చిహ్నం వద్ద పోలీసుల ప్రదర్శన



అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవానికి బోనాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కళాకారులు





అమరుల స్మారక చిహ్నం ప్రారంభం అనంతరం సభా వేదిక వద్దకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



తెలంగాణ అమరుల స్మారక చిహ్నంలో నివాళులర్పిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, డీజీపీ తదితరులు





స్మారక చిహ్నం వద్ద మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి కేటీఆర్

అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి : హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): అమరుల త్యాగం అజరామరమని, అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి అని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరీశ్‌రావు ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరులకు వినమ్ర శ్రద్ధాంజలి.. తెలంగాణ ప్రగతిలో ప్రకాశిస్తున్నది మీ త్యాగనిరతి.. అమరుల త్యాగం.. అజరామరం.. అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి.. ఉద్యమ ధ్రువ తారలకు ఘన నివాళి.. జై తెలంగాణ'.. అని హరీశ్‌రావు ట్వీట్‌లో రాసుకొచ్చారు.

త్యాగధనులను గుండెల్లో పెట్టుకుంటాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి కేటీఆర్ ఉద్విగ్నభరిత ట్వీట్ చేశారు. 'హైదరాబాద్ నడిబొడ్డున కొలువుదీరిన అమరుల స్మారక చిహ్నం – జ్వలించే దీపం సాక్షిగా త్యాగధనులను ఎప్పుడూ మా గుండెల్లో పెట్టుకుంటాం.. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల సేవలో పునరంకితం అవుతాం'.. అని కవితాత్మకంగా ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.



అమరులకు క్యాండిల్‌తో నివాళి అర్పిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్



హైదరాబాద్‌లో అమరుల స్మారక చిహ్నం గురువారం కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై, స్మారక చిహ్నంతో పాటు పలు విభాగాలను ప్రారంభించారు. తెలంగాణ అమరుల స్మృతి వనం ప్రారంభోత్సవం అనంతరం నినదిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాజ్యసభ సభ్యుడు కేకే, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీజీపీ అంజనీకుమార్, ఎంపీలు తదితరులు





డ్రోన్‌ల ప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు



అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డ్రోన్‌ల ప్రదర్శన



హైదరాబాద్‌లో తెలంగాణ అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ట్యాంకుబండ్‌పై ఒగ్గు కళాకారుల విన్యాసం

అమరులారా వందనం



శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ మనుమరాలిని ముద్దు చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ సంతోష్



అమరుడు సిరిపురం యాదయ్య కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు



అమరుడు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రి జగదీశ్‌రెడ్డి



అమరురాలు కావలి సువర్ణ తల్లిని గౌరవిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



అమరురాలు కావలి సువర్ణ కుటుంబ సభ్యుడిని గౌరవిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అమరుడు యాదిరెడ్డి కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దశాబ్ది ఉత్సవాలు పరిసమాప్తం



గురువారం హైదరాబాద్‌లో అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం అనంతరం క్యాండిళ్లు వెలిగించి అమరులకు నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వీ శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్, ఎంపీలు కేకే, నామా నాగేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండా ప్రకాశ్ తదితరులు



గన్‌పార్క్‌లోని అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్



డోలు వాయిస్తూ.. నృత్యాలు చేస్తూ భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివస్తున్న ఒగ్గుడోలు కళాకారులు



క్యాండిళ్లు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి తదితరులు



తెలంగాణ అమరుల స్మారక చిహ్నం వద్ద పోలీసుల ప్రదర్శన



అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవానికి బోనాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కళాకారులు



అమరుల స్మారక చిహ్నం ప్రారంభం అనంతరం సభా వేదిక వద్దకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



తెలంగాణ అమరుల స్మారక చిహ్నంలో నివాళులర్పిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, డీజీపీ తదితరులు





స్మారక చిహ్నం వద్ద మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి కేటీఆర్

అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి : హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): అమరుల త్యాగం అజరామరమని, అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి అని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరీశ్‌రావు ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరులకు వినమ్ర శ్రద్ధాంజలి.. తెలంగాణ ప్రగతిలో ప్రకాశిస్తున్నది మీ త్యాగనిరతి.. అమరుల త్యాగం.. అజరామరం.. అమరుల స్ఫూర్తి.. ప్రజ్వలిత దీప్తి.. ఉద్యమ ధ్రువ తారలకు ఘన నివాళి.. జై తెలంగాణ'.. అని హరీశ్‌రావు ట్వీట్‌లో రాసుకొచ్చారు.

త్యాగధనులను గుండెల్లో పెట్టుకుంటాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి కేటీఆర్ ఉద్విగ్నభరిత ట్వీట్ చేశారు. 'హైదరాబాద్ నడిబొడ్డున కొలువుదీరిన అమరుల స్మారక చిహ్నం – జ్వలించే దీపం సాక్షిగా త్యాగధనులను ఎప్పుడూ మా గుండెల్లో పెట్టుకుంటాం.. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల సేవలో పునరంకితం అవుతాం'.. అని కవితాత్మకంగా ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.



అమరులకు క్యాండిల్‌తో నివాళి అర్పిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్



హైదరాబాద్‌లో తెలంగాణ అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ట్యాంకుబండ్‌పై ఒగ్గు కళాకారుల విన్యాసం



హైదరాబాద్‌లో అమరుల స్మారక చిహ్నం గురువారం కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై, స్మారక చిహ్నంతో పాటు పలు విభాగాలను ప్రారంభించారు. తెలంగాణ అమరుల స్మృతి వనం ప్రారంభోత్సవం అనంతరం నినదిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాజ్యసభ సభ్యుడు కేకే, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీజీపీ అంజనీకుమార్, ఎంపీలు తదితరులు





డ్రోన్‌ల ప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు



అమరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డ్రోన్‌ల ప్రదర్శన

అమరులారా వందనం



శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ మనుమరాలిని ముద్దు చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ సంతోష్



అమరుడు సిరిపురం యాదయ్య కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు



అమరుడు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రి జగదీశ్‌రెడ్డి



అమరురాలు కావలి సువర్ణ తల్లిని గౌరవిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



అమరురాలు కావలి సువర్ణ కుటుంబ సభ్యుడిని గౌరవిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అమరుడు యాదిరెడ్డి కుటుంబ సభ్యులను గౌరవిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నమస్తే తెలంగాణ

దశాబ్ది దసరా!

స్వపరిపాలన సుపరిపాలనగా అద్వితీయమైన రీతిలో ఆవిష్కృతమైన తీరు తెన్నులకు దశాబ్ది ఉత్సవాలు నిలువుటద్దాలు పట్టాయి. రాష్ట్రాభివృద్ధికి, సకలజనుల సమృద్ధికి నీరాజనాలెత్తాయి. విజయాలను ముద్దాడిన వీరులతో కాలం చేసే కరచాలనమే ఈ ఉత్సవాలని చెప్పవచ్చు. కాలగమనంలో మైలురాళ్లు దాటుతున్నప్పుడు కాసేపు ఆగిచూస్తాం. నిన్నను సమీక్షించుకుంటాం. రేపటిని వీక్షించుకుంటాం. కర్తవ్యబద్ధులమవుతాం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఈ స్ఫూర్తితోనే జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖలవారీగా దినోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరగా అమరులకు మహాజ్యోతి ప్రజ్వలనంతో అపురూప నివాళి ఘటించారు. ఉత్సవాలకు ఇది సముచితమైన ముంగిపు అని చెప్పాలి. దశాబ్ది కాలంలో తెలంగాణ అభివృద్ధిలో అంగలు వేసింది. సంక్షేమంలో అంచులను తాకింది. పల్లెలు మెరిశాయి. పట్టణాలు మురిశాయి. నీరు పల్లం నుంచి పైపైకి ఎగబాకి తెలంగాణ తల్లి పాదాలు కడిగింది. సాగు బాగుపడింది. పారిశ్రామికం పరుగులు తీసింది. ఆధ్యాత్మిక గోపురం అంబరాన్ని చుంబించింది. దశాబ్దాల్లో సాధ్యం కాని అభివృద్ధి కేవలం పదేండ్ల కాలంలో సాధించిన వైనాన్ని దశాబ్ది ఉత్సవాలు దీటైన రీతిలో ఆవిష్కరించాయి. తెలంగాణ కీర్తికాంతులు దశదిశలా వ్యాపించాయి.

ఉత్సవాల చివరిరోజున అమరుల స్మృతికి సీఎం కేసీఆర్ సముచితమైన రీతిలో నివాళులు అర్పించారు. అమరజ్యోతి సాక్షిగా ఉద్విగ్నతకు లోనయ్యారు. ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. అదేవిధంగా ఈ ఉత్సవాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ పలుసభల్లో మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపన వంటి కీలక ప్రకటనలతో దిశానిర్దేశం చేశారు. అనతికాలంలోనే తెలంగాణ గొప్ప ఆర్థికశక్తిగా ఎదిగినప్పటికీ మున్ముందు అందుకోవాల్సిన శిఖరాలెన్నో ఉన్నాయని గుర్తుచేశారు. అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షల సాధన దిశగా అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. సంపద పెంచుదాం.. ప్రజలకు పంచుదాం అనేదే తమ ప్రభుత్వ నినాదమని నొక్కిచెప్పారు. తెలంగాణ దేశానికి రోల్ మాడల్ అయింది. ఈ మాడల్‌ను దేశవ్యాప్తం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

ఈ ఉత్సవాల నిర్వహణలో మంత్రులు, అధికారులు నిర్వహించిన గురుతరమైన పాత్ర ప్రశంసనీయం. ముఖ్యంగా ఉన్నతస్థాయి అధికారులు అంతా తామే అయి ఉత్సవాలను నడిపించారు. ఆయా శాఖలు వివిధ రంగాల్లో సాధించిన విజయాలను సగర్వంగా చాటిచెప్పారు. పదేండ్ల పండుగను పదికాలాల పాటు గుర్తుంచుకునేలా నిర్వహించారు. రాజకీయ నాయకత్వం దిశానిర్దేశం చేస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ నిర్ణయాలను అమలు చేసే కీలకబాధ్యత అధికార యంత్రాంగానిదే. అందుకే సచివాలయ ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్ గత తొమ్మిదేండ్ల ప్రగతి ప్రస్థానంలో తనవెంట నడిచిన ప్రతి అధికారికి, ఉద్యోగికి చేతులెత్తి నమస్కరిస్తున్నానని చెప్పడం వారి పట్ల ఆయనకున్న అభిమానానికి నిదర్శనం. అందుకు తగ్గట్టుగానే అధికార యంత్రాంగం కూడా ఉత్సవాలను అహర్నిశలు కృషిచేసి విజయవంతం చేశారు.

తెలంగాణోన్ని అని గర్వంగా చెప్పుకొంటున్నం

మానవ సమాజ పరిణామంలో ప్రజాస్వామికీకరణ ప్రక్రియలో ఒకదాని తర్వాత ఒకటిగానో, సమాంతరంగానో సాగిన ఉద్యమాలన్నీ ముందడుగులే. కొన్ని ఉన్నత విలువల్ని ప్రతిష్ఠించినవే. ఇది మలిదశ తెలంగాణ ఉద్యమానికీ, రాష్ట్రావతరణ అనంతర పరిస్థితికీ వర్తిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల అద్భుత ఫలితాలు సిద్ధించాయని చెప్పక తప్పదు.



డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

'నిజం దేవుడెరుగు
నీరు కోస్తానెరుగు
ఓ నీటి పారుదలా
నీ రస్తా కోస్తాకే
పల్లం ఒక నెపం మాత్రమే'.
'పర్రె కాలువలేవీ చెరువు ఊటేదీ
మింటికి మంటికి ఏకధారగా కురుస్తున్న చీకటి'
'ఫ్లోరిన్ ధాటికి రోగోలలా
వంకర్లు తిరిగిన నా అయ్య కాళ్ళు'
'గండిపడ్డ చెరువు, ఒట్టిపోయిన పర్రె
పర్రెవారిన పంట పొలం కాలిన మోటర్
పెరిగిన కరెంటు బిల్లు, పడావుబడ్డ ఎవుసం'

అని ఉద్యమ సమయంలో కవులు నీళ్ల గురించి పరిపరివిధాలా పలువరించిన్రు. నీటి వనరుల మళ్ళింపు గురించి, చెరువుల విధ్వంసం గురించి, ఫ్లోరిన్ గురించి పడావుబడ్డ వ్యవసాయం గురించి వేదనతో రాసిండ్రు.

రాష్ట్రావతరణ తర్వాత ఈ సంక్షోభ నివారణకు ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలొచ్చినవి. మావూరి కుంటలు, ఈ ఏడెనిమిదేండ్లలో ఎన్నడూ ఎండిపోకపోవడం ఒక నిదర్శనం. అంతేకాక వరి పంట ద్విగుణీకృతం కావడం మరొక నిదర్శనం. తెలంగాణ భూములకు విలువపెరగడం కూడా నిదర్శనం అందుకే..

'భూమి బ్లాంక్ చెక్కు



నీళ్ళు విలువను రాస్తయి
భూములు ఖాళీ తలెలు
పంచభక్ష పరమాన్నమిచ్చేది నీళ్ళు
సాటలో బట్ట శిశువులు భూములు
నొసట రాత రాసే బ్రహ్మ నీళ్లు..
నీళ్లో లేక కాదు/ నీతి లేక
బ్లాంక్ చెక్ నా తెలంగాణ...
బ్లాంక్ చెక్ మీద విలువ రాసే విధాత వచ్చిండు
భూముల నొసటిరాత రాసే బ్రహ్మ నేడొచ్చిండు'

అని తెలంగాణ ఆవిర్భావం సందర్భాన కేసీఆర్‌ను ఉద్దేశించి కవులు రాసిండ్రు. ఈ ఆకాంక్ష చాలావరకు నెరవేరిందనే చెప్పాలె.

'సభలు మీవి సన్మానాలు మీవి
కీర్తికిరీటాలు మీవి
సాహిత్య సామ్రాజ్యం మీది'
'కట్టిన కయితల్ని తరాజులు మింగినయ్
తరాజులు పట్టుకున్న చేతులెవరివి?'

అని తెలంగాణ సాహిత్యానికి జరిగిన అన్యాయాన్ని, తెలంగాణ కవుల పట్ల చూపిన వివక్షను, విస్మరణను సాహిత్యం మీద కోస్తాంధ్ర ఆధిపత్యాన్ని ఉద్యమ సమయాన తెలంగాణ కవులు ప్రశ్నించిండ్రు. కే.శ్రీనివాస్, అంబటి సురేంద్రరాజు, నందిని సిధారెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ , ముదిగంటి సుజాతరెడ్డి, గుడిపాటి, బన్న అయిలయ్య, కాశీం, ఎన్.వేణుగోపాల్, బాల శ్రీనివాసమూర్తి, జగన్‌రెడ్డి, యాకూబ్ లాంటి ఎంతోమంది విమర్శకులు తెలంగాణ సాహిత్య విశ్వరూపాన్ని ఉద్యమ సమయంలో ప్రదర్శించిండ్రు. ఫలితంగా మత్తడి, పొక్కిలి, ముంగిలి, తెలంగాణ తోవలు, దస్త్రం, షబ్నవీస్, ముద్దెర, ఫాయిదా, ఇతివృత్తం, కిటికీ, ఇగురం, ఆవర్తనం, కొలిమి, ఇరుసు, గనుమ లాంటి ఎన్నో విమర్శనా గ్రంథాలు వెలువడ్డాయి.

ఈ కృషి రాష్ట్రావతరణ తర్వాత ప్రచురణ విషయంలో ద్విగుణీకృతమైంది. తెలంగాణ సాహిత్య అకాడమీ పక్షాన నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వందకు పైగా తెలంంగాణ గ్రంథాలు ప్రచురితమైనవి. బి.నరసింగరావు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో 'తెలంగాణ ప్రచురణలు' సంస్థ దాదాపు ముప్పయి విలువైన పుస్తకాలు ప్రచురించింది. తెలంగాణ సాహిత్య అకాడమీ అనేక సాహిత్య సదస్సులను, ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలంగాణ సాహిత్య విశిష్టతను ప్రపంచానికి చాటింది. జూలూరు గౌరీశంకర్ కాలంలో 'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర'ను వెలువరించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో అనేక కవి సమ్మేళనాలు నిర్వహించి 'మట్టిముద్ర' లాంటి విలువైన సంకలనాలను ప్రచురించింది.

తెలుగు అకాడమీ ఈ కాలంలో కొన్ని మంచి పనులను చేసింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా దేశపతి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, నందిని సిధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కె.శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, కాలువ మల్లయ్య తదితరుల కమిటీ నిర్ణయం మేరకు తెలంగాణ విశిష్ట సాహితీవేత్తల వంద మోనోగ్రాఫ్‌లను ప్రచురించింది. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రను, తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను తెలిపే 'ముంగిలి'ని, విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక గ్రంథాలను ప్రచురించింది. సురవరం ప్రతాపరెడ్డి సమగ్ర రచనల ప్రచురణలో భాగంగా కొన్ని గ్రంథాలను ప్రచురించింది. ఈ విషయంలో తెలుగు అకాడమీ చేయాల్సిన కృషి చాలా మిగిలే ఉంది.

'మాటలకు రంగులద్దిన మాయలోడా
నీ కొంచెపు తనానికి
నా మాట మంచం పట్టింది గదరా'
'బడిలో మా అమ్మ పలుకు లేదు
నీ భాషనేర్పి
పుట్టినచోటనే పరదేశిని చేశావు
నా మాటనే మాట్లాడితే
నాగరీకుడిని కాను'
'నా ఏసాన్ని బాసని/ విలన్ల ఈసుల మీన
చిరునామా జేసినోల్లకు/ నా గడ్డ మీన ఏంపని'
'రేడియోలో వాళ్ళే, పత్రికల్లో వాళ్ళే
మన బాస, మన యాస
ఉర్దు తుర్క ములాని ఎక్కిరించినారు'

అని తెలంగాణ భాషను అవహేళన చేయడాన్ని కవులు ఆగ్రహంతో, వేదనతో తిరస్కరించారు. పత్రికల్లో, పాఠ్య పుస్తకాల్లో, సినిమాల్లో కోస్తాంధ్ర భాషకు పట్టం గట్టి తెలంగాణ భాషను కనుమరుగయ్యే పరిస్థితిని పసిగట్టారు.

హాస్య, విలన్ పాత్రలకు తెలంగాణ భాషను పెట్టి అపహాస్యం చేసే స్థితిని తిరస్కరించారు. కవిత్వంలోనే కాక అనేక వ్యాసాల్లో నలిమెల భాస్కర్, నందిని సిధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కాలువ మల్లయ్య, ముదిగంటి సుజాతరెడ్డి, అన్నవరం దేవేందర్, నాలాంటి వాళ్ళు తెలంగాణ భాష విశిష్టతను చాటారు. గోరటి వెంకన్న, గూడ అంజయ్య లాంటి కవి గాయకులు పాటల్లో మన భాషను వాడి దానికి గౌరవ స్థానం ఇచ్చినారు. కేసీఆర్ తెలంగాణ భాషలోనే ఉపన్యాసాలిచ్చి ప్రజలను ఉద్యమోన్ముఖులను చేశారు. ఈ అన్నింటి ఫలితంగా, రాష్ట్రావతరణ ఫలితంగా తెలంగాణ భాషకు అన్నిరంగాల్లో గౌరవస్థానం రావడం జరిగింది. పత్రికల్లో వస్తుంది. కోస్తావాళ్ళు సినిమాల్లో కూడా గౌరవస్థానం ఇస్తున్నరు. ఫలితంగా తెలంగాణ వాళ్ళకు డైరెక్టర్లుగా, హీరోలుగా, రచయితలుగా, కవులుగా, గాయకులుగా, అవకాశాలు లభిస్తున్నవి. మన యువతకు ఉపాధి లభిస్తున్నది.

'బొడ్రాయి పోశమ్మ, అమ్మ ముత్యాలమ్మ
బోనాల గంపల్ల బర్కతేమాయె'

అంటూ తెలంగాణ ఆచార వ్యవహారాలను, బతుకమ్మ, బోనాలు, దసరా లాంటి పండుగలను, కట్టుబొట్టును కోస్తాంధ్రులు అవహేళన చేస్తూ వాటిని అంతర్ధానం జేసే పరిస్థితిని కవులు నాడు కనిపెట్టి, వాటి విశిష్టతను చాటుతూ కవితలల్లిండ్రు. ఇవ్వాళ అట్లా వాటిని అగౌరవపరిచే పరిస్థితి పోయి గౌరవించే స్థితి వచ్చింది. ఇవన్నీ తెలంగాణ ఉద్యమం వల్ల, తెలంగాణ అవతరణ వల్ల ఒనగూడిన ఫలితాలు ఎన్నో. ఇప్పుడు నేను తెలంగాణ వాడిని అని సగర్వంగా చెప్పుకొనే స్థితి వచ్చింది. ఇది చిన్న విజయమేమీ కాదు.

తెలంగాణ సాహితీవేత్తలకు దూరదూరంగా ఉన్న 'రవీంద్రభారతి'ని తెలంగాణ సాహితీవేత్తల పరం జేసింది. సాంస్కృతిక శాఖ తెలంగాణ నాటకాలకు, సినిమాలకు, కళాకారులకు ప్రాచుర్యాన్ని కల్పించింది. ఈ కాలంలో అనేకమంది సూచనల మేరకు 'ఆంధ్రసారస్వత పరిషత్' 'తెలంగాణ సారస్వత పరిషత్'గా పేరు మార్చుకొని ఎల్లూరి శివారెడ్డి జుర్రు చెన్నయ్య గార్ల సారథ్యంలో ప్రభుత్వ సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహించింది. తెలంగాణ విశిష్టతను తెలిపే పుస్తకాలను ప్రచురించింది. తెలంగాణ సాహితీవేత్తలకు అవార్డులను ప్రదానం చేసింది.

ఆశయం, ఆయుధం కన్నా బలమైనది. ప్రపంచంలో అనేక గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, మానవాభ్యుదయాన్ని ఆకాంక్షించిన ఉత్తమ ఆశయాలే! సామాజిక దురాచారాల నుంచి సంఘ సంస్కరణల వైపు మళ్లినా, పీడనను ఎదుర్కొని విముక్తిని సాధించినా, అశాస్త్రీయ ఆలోచనలను రూపుమాపి, శాస్త్రీయ ఆవిష్కరణలు గావించినా, చివరికి వివక్ష విషసర్పమై కాటేసిన సీమాంధ్రుల దోపిడీని ఎదిరించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా వీటన్నింటి వెనుకా చోదకశక్తిగా పనిచేసింది. మార్పు వైపు నడిపించిన ఒక సదాశయమే!

కలిసి సాగితేనే సాకారం



నారదాసు లక్ష్మణ్‌రావు
98490 59562



జనహితాన్ని కాంక్షించే ఏ పనికి పూనుకోవాలన్నా, మనకున్న అన్ని శక్తులకన్నా ముందుగా ఒక బలమైన ఆశయాన్ని నిర్మించుకోవాలి. తెలంగాణ సాధకుడైన కేసీఆర్ అంతిమ ఆశయం బంగారు తెలంగాణ నిర్మాణం. అది సాధ్యం కావాలంటే అత్యధిక ప్రజలు నివసిస్తున్న పల్లెలు స్వావలంబన సాధించాలి. దీన్ని సాకారం చేయడానికి కేసీఆర్ 'గ్రామజ్యోతి' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం విజయవంతం కావాలంటే నిధులు కేటాయిస్తే సరిపోదన్న విషయం కు తెలుసు. 1950 నుంచే పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అనేక కమిటీల సూచనల మేరకు ప్రయత్నాలు సాగించినా ఆశించిన మేర అభివృద్ధి సాధ్యం కాలేదు. అందుకే దూరదృష్టి కలిగిన కేసీఆర్ ప్రజల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో లేనిదే ఏ పథకమూ విజయవంతం కాదని, అందుకోసం తానే బరిలోకి దిగి ప్రజలను భాగస్వాములను చేస్తూ పల్లె ప్రగతి పథకాన్ని బలమైన ఆశయంగా ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. యావత్ ప్రజాప్రతినిధులను, యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తున్నారు.

చైనాలో విప్లవం విజయవంతమయ్యాక, సాంస్కృతిక విప్లవానికి తెరలేపాడు మావో! ఓడిపోయిన శక్తులు తిరిగి కుట్రలు సాగిస్తాయని, ఆ కుట్రలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తాయని ప్రజలకు ఈ కుట్రలను విప్పిచెప్పడంతో పాటు, కుట్రదారుల్ని అణచివేస్తూ, ప్రజల్లో సోషలిస్టు భావజాలాన్ని బలంగా స్థిరపరిచే ఉద్దేశంతో సాంస్కృతిక విప్లవాన్ని ప్రతిపాదించాడు మావో. ఇప్పుడు తెలంగాణ పట్ల కూడా అలాంటి కుట్రలే తెరపైకి వస్తున్నాయి. ఓడిపోయిన తెలంగాణ వ్యతిరేక సీమాంధ్ర వక్తులు, వారి తాబేదార్లు తెలంగాణ సమాజంలో గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి స్థితిలో ఎన్ని అభివృద్ధి పథకాలకు అంకురార్పణ చేసినా, వాటిని విఫలం చేసే శక్తులు కూడా కోరలు విప్పుతాయి. కేసీఆర్ సాంస్కృతిక పునాదిని బలోపేతం చేసే ఆశయంతో పల్లెప్రగతిని వేదికగా చేసుకున్నారు.

సాంస్కృతిక వికాసమే సామాజిక అభివృద్ధికి దారితీస్తుంది. అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంటూనే అసలైన తెలంగాణ ఆత్మను ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. పల్లె జీవితంలోని మానవీయ విలువలను తిరిగి పాదుకొల్పేందుకు ప్రయత్నిస్తూ, తమ ప్రసంగాల్లో వాటికి పెద్దపీట వేస్తున్నారు. పరాధీనతా భావాన్ని వీడి, ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేసుకోవాలని, కాళ్లు మొక్కడం, ఏడుస్తూ బాధామయ జీవితాన్ని జీవించడం కాకుండా, మన జీవితాన్ని మనమే గెలుచుకోవాలని పిలుపునిస్తున్నారు. వ్యక్తి బాధ్యతను, వ్యక్తిశీలతను పెంపొందించుకునేలా దిశానిర్దేశనం చేస్తున్నారు. ఒక ప్రాంతంలో పండే పంటలు వాటిని మార్కెట్ చేసుకోవడం, చేసుకునే వృత్తులు, వాటిద్వారా స్వావలంబన పొందడం గురించిన ఆశావహ దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలో విద్య, వైద్యం, పారిశుధ్యం, హరితహారం, ఇంకా అనేక విషయాల్లో ప్రజలే బాధ్యత వహించి, ప్రజలే సమస్యల పరిష్కారాన్ని వెతుక్కొనేలా చేస్తూ వర్క్ కల్చర్‌ను డెవలప్ చేస్తున్నారు.

పల్లె జీవన నేపథ్యంలోంచి వచ్చిన కేసీఆర్‌కు, ఆ గ్రామీణ జీవనవిధానం పరిఢవిల్లాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నది. ఆధునిక అభివృద్ధి నమూనాలను అందిపుచ్చుకుంటూనే, అభివృద్ధికి మానవీయ కోణాన్ని నిర్దేశించుకోవాలి అని తపన పడుతుంటారు. పిలిచి తమ సాంస్కృతిక మూలాలను బలోపేతం చేసుకుంటూ, అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కాలని పల్లె ప్రగతి ప్రధాన ఉద్దేశంగా చెప్తారు.

దశాబ్దాల పోరాటాల అనంతరం అనేక త్యాగాల తదనంతరం, భావితరాలకు అద్భుత కానుకగా అందించిన అపూర్వ విజయాన్ని, దాని స్ఫూర్తిని పది కాలాల పాటు పదిలపరచాలి. తెలంగాణ అభివృద్ధికి పాలకుల విధానాల రూపకల్పన ఎంతైతే అవసరం ఉంటుందో, అంతకు రెట్టింపు ప్రాధాన్యం ప్రజల భాగస్వామ్యానికి ఉంటుంది. యాభై ఎనిమిదేండ్ల కిందట సాధారణంగా ఉన్న చిన్నదేశం సింగపూర్ నేడు ప్రపంచంలోని అనేక దేశాలకు రోల్‌మాడల్‌గా మారింది. ఇంకా ప్రపంచంలోని చిన్న చిన్న దేశాలు నేడు ప్రగతిపథంలో పయనించగలుగుతున్నాయంటే అందుకు ఒకే ఒక కారణం.. ప్రజలకు, పాలకులకు అభివృద్ధిని ఆవిష్కరించే దృఢ సంకల్పం, దానికోసం కలిసి శ్రమించే కార్యాచరణ ఉండటమే.

ఆరంభంలోనే పల్లెప్రగతి కార్యక్రమం అద్భుత విజయాన్ని సాధించింది. ప్రజలు అన్నిచోట్లా అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. కాలానుగుణమైన మార్పులను సంలీనం చేసుకుంటూ సాగిపోయే జనజాతర. ఈ పల్లె ప్రగతి ఆగిపోకుండా కాపాడే బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిది. గుండెగుండెలో ఆకాంక్షించే చైతన్య జ్యోతులను వెలిగించాలి. విజయాల్ని, వైఫల్యాల్ని నిర్దేశించేది పవిత్రమైన ఆశయం, ప్రయత్నలోపం లేని ఆచరణ.. ఈ రెండు కేసీఆర్‌లో అణువణువునా నిక్షేపమై ఉన్నాయి. ఆయన ఆశయానికి అండగా నిలుద్దాం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

ఆ మాటల్లో ఆంతర్యమేంటి?

'రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన ప్రతిపాదన మేరకు హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలి. దీనికి అన్ని రాజకీయపార్టీలు కలిసిరావాలి' అని బీజేపీ సీనియర్ నేత, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన ఒకవైపు చెప్తూనే అన్ని పార్టీలు కలిసి వస్తే రెండో రాజధాని ఏర్పడుతుందని ధీమాగా చెప్పడంలో ఆంతర్యంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.



వెల్జాల చంద్రశేఖర్
98499 98092



విద్యాసాగర్‌రావు ఏ హోదాలో ఈ మాట చెప్పారు? బహుశా ఇది బీజేపీ ఆలోచనా? అనే అనుమానాలకు బలం చేకూర్చుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేసే విషయంపై పార్టీలో చర్చిస్తామని చెప్పడంతో ఇది విద్యాసాగర్‌రావు వ్యక్తిగత నిర్ణయం కాదన్నది తేలిపోయింది. దీంతో బీజేపీ నాయకులు చల్లకు వచ్చి ముంత దాచినట్టు పార్టీ అభిప్రాయాన్ని తమ వ్యక్తిగత అభిప్రాయంగా చెప్తున్నా వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్న ఆలోచన వెనుక తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర ఉన్నదా? అనే కోణంలో రాజకీయ పరిశీలకులు అనుమానిస్తున్నారు. ఎంతోమంది బలిదానాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని చూసి ఓర్వలేక బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తీసుకువస్తుందా? అనే అనుమానాలను తెలంగాణవాదుల్లోనూ కలుగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఎదుగుదలను చూసి ఓర్వలేని తనమా? లేక తమ పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చని తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రపూరిత వ్యూహంతో బీజేపీ నేతలు ఈ ప్రతిపాదన చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌ను రెండో రాజధానిగా అంగీకరించిన మరుక్షణం కేంద్రపాలిత ప్రాంతంగా మారుతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఢిల్లీ దేశ రాజధాని అయినందుకే అది కేంద్ర పాలిత ప్రాంతమైంది. అలాగే హైదరాబాద్ రెండో రాజధాని అయితే కేంద్ర పాలిత ప్రాంతం కాకుండా ఎలా ఉంటుంది?. ఇదే హైదరాబాద్ రెండో రాజధాని చేయలన్న ప్రతిపాదన వెనుక ఉన్న అసలు కుట్ర.

హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్న ప్రతిపాదన కొత్తదేమి కాదు. రాష్ట్ర విభజన సందర్భంగా సమైక్యవాదుల నుంచి ఈ డిమాండ్ వచ్చింది కూడా. తెలంగాణ వాదులు తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అప్పుడు సమైక్యవాదుల నుంచి వచ్చిన డిమాండ్ ప్రస్తుతం తెలంగాణ బీజేపీ నాయకుల నుంచి రావటం ఆశ్చర్యం కలిగించే అంశం. తెలంగాణలో బీజేపీకి భవిష్యత్ లేదన్న అంచనాతో రాష్ట్ర అస్తిత్వాన్ని కూడా దెబ్బతీయడానికి వారు వెనుకాడటం లేదని తెలంగాణవాదలు మండిపడుతున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ప్రజలు ఎన్నుకున్న ఆప్ ప్రభుత్వాన్ని కేంద్రపాలిత ప్రాంతమన్న సాకుతో లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్ని ఇబ్బందులు పెడుతున్నది ప్రత్యక్షంగా చూస్తున్నదే.

ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండాపోయింది. కేంద్రపాలిత ప్రాంతమైనప్పటికీ అక్కడ ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానికే సర్వాధికారాలుంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినప్పటికీ అత్యున్నత కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా లెఫ్టినెంట్ గవర్నర్‌కు సర్వాధికారాలు కట్టబెట్టే విధంగా ఆర్డినెన్స్ తీసుకురావడానికి కేంద్రం యత్నిస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీ ప్రభుత్వం అక్కడ కేంద్రపాలిత ప్రాంతం కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఒకవైపు ప్రత్యక్షంగా చూస్తూ బీజేపీ నాయకులు రెండో రాజధాని జపం చేయడంలో మర్మం ఏమిటి? తెలంగాణకు హైదరాబాద్ తలకాయనే కాదు, గుండెకాయ కూడా. దేశానికి రెండో రాజధాని అయితే హైదరాబాద్‌కు ఏదో ఒరుగుతుందన్నట్టుగా బీజేపీ నాయకులు భుజాలు ఎగిరేస్తున్నారు. కానీ భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం ఎదుర్కోబోయే ఇక్కట్లపై బీజేపీ నాయకులకు సోయి లేకపోవడమా? లేక బీజేపీ అధినాయకత్వం ఆడిస్తున్న నాటకంలో పావులుగా మారారా? అనే కోణంలో అనుమానించక తప్పదు. కర్ణాటక ఫలితాల అనంతరం దక్షిణాదిలో బీజేపీకి స్థానం లేదని తేలిపోయింది. తెలంగాణలోనూ బీజేపీకి శృంగభంగం తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ కారణంగానే రెండో రాజధాని అంశాన్ని బీజేపీ తెరపైకి తీసుకవచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

తెలంగాణ పట్ల బీజేపీ మొదటినుంచి విద్వేషపూరిత వైఖరినే చాటుకుంటూ వస్తున్నది. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయడం మొదలుకొని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బలహీనపరిచే ఎమ్మెల్యేలకు ఎర వరకు పన్నని కుట్రలేదు. తెలంగాణ రాష్ట్ర అవతరణనే పార్లమెంట్ సాక్షిగా 'తల్లిని చంపి బిడ్డను బతికించారు' అని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవహేళన చేసిన బీజేపీని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. హైదరాబాద్‌ను వదలుకునేటట్టు అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు జాప్యం జరిగి ఉండేది కాదు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమనేత కేసీఆర్ చివరిదాకా రాజీలేని పోరాటం చేయాల్సి వచ్చింది. అసలు హైదరాబాద్ లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఊహించుకోగలమా? అందుకు తెలంగాణ ప్రజలు అంగీకరిస్తారా?. ఈ సోయి అయినా తెలంగాణ బీజేపీ నేతలకు లేకుంటే ఎట్ల? ఎవరి కోసం, ఎవరి తరఫున వారు ఈ రెండో రాజధాని ప్రతిపాదనను చేస్తున్నారు? సూటిగా సమాధానం చెప్పగలరా?.

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలని అంబేద్కర్ రాజ్యాంగంలో రాశారని బీజేపీ నాయకులు వక్రభాష్యం చెప్తున్నారు. ఈ అంశం రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. భాషాప్రయుక్త రాష్ట్రాలపై 'థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పుస్తకంలో (1955) అంబేద్కర్ తన వ్యక్తిగత ఆలోచనలను పంచుకున్నారు. హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలన్న దానికి అంబేద్కర్ కొన్ని కారణాలు చూపారు.

రాజధాని ఢిల్లీకి శత్రుదేశాలైన పాకిస్థాన్ 300 కి.మీ. చైనా సరిహద్దు 500 కి.మీ. దూరంలో ఉండటం దేశానికి క్షేమకరం కాదని 1955లో అంబేద్కర్ అప్పటి కాలమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చేశారు. అప్పటి పరిస్థితులు వేరు, ప్రస్తుత పరిస్థితులు వేరు. పెరిగిన టెక్నాలజీ కారణంగా శత్రు దేశాలు దాడి చేయాలనుకుంటే ఢిల్లీ అయినా ఒక్కటే, హైదరాబాద్ అయినా ఒక్కటే. దూరాభారం అనేది ప్రస్తుత పరిస్థితుల్లో అసలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే కాదు. దక్షిణాదికి ఉత్తరాదికి మధ్య అంతరాన్ని తొలగించడానికి హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయడం మంచిదేనని కొందరి వాదన. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేసినంత మాత్రాన అంతరం తొలిగిపోతుందా? హైదరాబాదే ఎందుకు? బెంగళూరును చేయాలని కర్ణాటక, చెన్నైని చేయాలని తమిళనాడు ప్రభుత్వాలు కూడా గతంలో డిమాండ్ చేశాయి. మరి దీనికి బీజేపీ నాయకులు ఏం సమాధానం చెప్తారు. ఇక్కడో విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి తగ్గబోయే ప్రాతినిధ్యంపై ఎందుకు మాట్లాడం లేదు. దేశ జనాభాలో 18 శాతమే ఉన్న దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీకి 36 శాతం కాంట్రిబ్యూషన్ అందిస్తున్నాయి. మరి ఆ దామాషా లెక్కన దక్షిణాదికి ఆర్థిక సాయం అందుతుందా? ఈ విషయాన్ని బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు దేశ సంపదను దోచిపెడుతుంటే దక్షిణాది బీజేపీ నాయకులు ఎందుకు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు?

బీజేపీ నాయకులు చేస్తున్న ప్రతిపాదన కేవలం ఎన్నికల ఎత్తుగడగానే అర్థమవుతుంది. ఈ ఏడాది చివరలో తెలంగాణకు, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలతో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నికలు జరుగనున్నాయి. రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన ద్వారా హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్ర ఓటర్లను, ఉత్తరాది ఓటర్లను గంపగుత్తగా పొందవచ్చన్నది బీజేపీ నాయకుల ఎత్తుగడ అయి ఉంటుంది. హైదరాబాద్ పట్ల వారికి నిజంగా ప్రేమ ఉన్నట్టయితే కేంద్రం వివక్షపై ఎందుకు మాట్లాడటం లేదు. విభజన హామీల కోసం ఎందుకు డిమాండ్ చేయడం లేదు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com



బుద్దా మురళి

ఆరేండ్లలోనే ఇంతైతే.. అరవై ఏండ్లలో ఎంతయ్యేదో!

దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రం.. దేశం మొత్తం ఆకలి తీర్చేంత ఆహారధాన్యాల ఉత్పత్తి.. 24 గంటల విద్యుత్తు, ఇంటింటికీ మంచి నీరు.. రుతుపవనాలు ఆలస్యమై ఎండలు మండిపోతున్నా నిండుకుండలా కనిపిస్తున్న చెరువులు...పచ్చగా కళకళలాడుతున్న గ్రామాలు.. దేశంలో అత్యధికంగా పర్ క్యాపిటా ఇన్‌కమ్.. ఇదీ ప్రస్తుత తెలంగాణ ముఖచిత్రం.



కరువు దృశ్యాల చిత్రీకరణకు, పేదరికానికి సెట్టింగ్ అవసరం లేకుండా సహజంగా చిత్రీకరించవచ్చు అన్నట్టుగా ఉండేది తెలంగాణ గ్రామీణ ముఖచిత్రం. ఎట్లుండె తెలంగాణ ఇప్పుడెట్లయింది? మంత్రం వేస్తే అయిందా?కాలమే మార్చిందా? 2014కు ముందు నాటి తెలంగాణ, ఇప్పటి తెలంగాణను చూస్తే తొమ్మిదేండ్లలోనే ఇంత మార్పు అయితే, అరవై ఏండ్ల కిందటే ఈ మార్పు మొదలై ఉంటే ఎక్కడ ఉండేవాళ్లమో అనిపిస్తున్నది. అరువై ఏండ్లలో మనం ఎంత అభివృద్ధి కోల్పోయామో? 2014 నుంచి తొమ్మిదేండ్లు గడిచినా, మొదటి ఆరు నెలలు రాష్ట్రం ఏమిటో అర్థం చేసుకోవడానికి, రెండు రాష్ట్రాల మధ్య పంపకాలకే సరిపోయింది. మిగిలిన దానిలో ఒక సంవత్సరం కరోనా మింగేస్తే, మరో సంవత్సరం నోట్ల రద్దు మింగేసింది. నికరంగా మిగిలింది ఆరున్నర, ఏడేండ్లు మాత్రమే. ఆరున్నరేండ్ల కాలంలోనే తెలంగాణ కాళేశ్వరం పూర్తిచేసుకున్నది. మిషన్ కాకతీయ, ఇంటింటికీ మంచినీరు అందించే మిషన్ భగీరథ, 24 గంటల విద్యుత్ ఇవ్వడం ద్వారా తెలంగాణ సగర్వంగా తలెత్తుకొని నిలబడగలిగింది. గ్రామాల అభివృద్ధి, వ్యవసాయరంగం అభివృద్ధి మాత్రమే కాదు. ఐటీ రంగంలో అభివృద్ధి రేటులో దేశంలోనే నంబర్ వన్. తెలంగాణ ఏర్పడితే ఐటీ రంగం దెబ్బ తింటుందని ప్రచారం చేసినవారు విస్తుపోయేవిధంగా అప్పటి కన్నా మూడింతలు ఎక్కువ అభివృద్ధి సాధించి చూపించింది.

తెలంగాణ ఏర్పాటుకు ముందు నిత్యం రైతుల ఆత్మహత్యలు, అర్ధరాత్రి పూట నాలుగైదు గంటల పాటు వ్యవసాయానికి విద్యుత్ లభించేది. అర్ధరాత్రి పొలంలోకి వెళ్తే పాముకాటుతో రైతుల మరణ వార్తలు ఏదో ఒక ప్రాంతంలో కనిపించేవి. అర్ధరాత్రి ఇచ్చే విద్యుత్తును పగటిపూట ఇవ్వాలని రైతుల ఆందోళన. మరి ఇప్పుడు రాత్రిపూట, పగటి పూట అని కాదు 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా. వ్యవసాయానికి విద్యుత్ చార్జీలు పెంచవద్దని రైతులు ఆందోళన చేస్తే సమైక్యరాష్ట్రంలో కాల్పులు జరిపి ప్రాణాలు తీస్తే, తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్తుతో పాటు వ్యవసాయం చేసే రైతులకు అండగా ఉండేందుకు రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుబంధు అమలు చేస్తున్నారు. ఏటా రెండు విడుతలుగా ఎకరానికి పది వేల రూపాయల సహాయం అందిస్తున్నారు.

అభివృద్ధి అంటే హైదరాబాద్ మాత్రమే కాదు, హైదరాబాద్‌లో ఆకాశమంత ఎత్తులో భవనాలు కనిపించవచ్చు కానీ గ్రామాలు కళకళలాడుతున్నాయి. రైతుల ముఖాల్లో ఎప్పుడూ లేనంత సంతోషం కనిపిస్తున్నది. బాగా గుర్తుంది తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి దసరా పండుగ. రైతుల ఆత్మహత్యలు అలా సాగుతూనే ఉన్నాయి. రైతుల ఆత్మహత్యలు సాగుతుంటే దసరా పండుగ ఎలా జరుపుకొంటారు, ఈసారి పండుగ జరుపుకోకండి అని తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించినవారు సలహాలు ఇచ్చారు.

> అసెంబ్లీలో విద్యుత్తుపై చర్చ జరిగితే, విద్యుత్ రంగంలో ఏ సంవత్సరంలో ఏం చేయబోయేది, ఏ సంవత్సరంలో విద్యుత్ రంగం పరిస్థితి ఎలా ఉండబోయేది ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గణాంకాలతో సహా వివరించారు. 'మూడేండ్ల వరకు విద్యుత్ కష్టాలుంటాయి.

మూడేండ్ల తర్వాత మిగులు విద్యుత్ దశకు చేరుకుంటాం' అని కేసీఆర్ వివరిస్తే.. సభలో విపక్ష నాయకుడిగా ఉన్న జానారెడ్డి అదే జరిగితే, తాను టీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తానని సవాల్ చేశారు. మరి ప్పుడు విద్యుత్తురంగంలో ఎక్కడున్నాం? దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ సొంత రాష్ట్రంలో విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పరిశ్రమలకు విద్యుత్తు ఇవ్వలేకపోతుంటే తెలంగాణ మాత్రం మిగులు విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు విక్రయించే స్థితిలో ఉన్నది.

ఇది చిన్నప్పటి నుంచి మనం చూసిన తెలంగాణ నేనా అని అనిపిస్తున్నది. తొమ్మిదేండ్లు గడిచిపోయి 10వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన తెలంగాణ ఆరున్నరేండ్లలోనే ఇంత ప్రగతి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. కేంద్రం రైతుబంధు పథకం అనుసరిస్తున్నది. మరికొన్ని రాష్ట్రాలు అమలుకు ముందుకువచ్చాయి. ఏపీలో అమలుచేస్తున్నారు. టీఆర్ఎస్ ఇప్పుడు బీఆర్ఎస్‌గా మారింది. ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు వస్తాయని కాదు, తెలంగాణలో ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకాల ప్రభావం అనేక రాష్ట్రాల్లో ఉంటుంది. మన సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రలో ఈ ప్రభావం ఇంకా ఎక్కువగా ఉంటుంది. దేశానికి ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబై ఉన్నది మహారాష్ట్రలో అయినా దేశంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నది మహారాష్ట్రలోనే.. రైతులకు తెలంగాణ అమలుచేస్తున్న పథకాలను మహారాష్ట్ర అమలుచేయడం లేదు. అమలు చేయాలని అక్కడ ఒత్తిడి పెరగడం సహజం. నిజానికి టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చకముందే తెలంగాణ ప్రభుత్వ పథకాల ప్రభావం మహారాష్ట్రలో కనిపించింది. తెలంగాణకు సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలోని కొన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాలను తెలంగాణలో కలపాలని ఆందోళన చేశారు.

కేంద్రం నుంచి సహకారం లేకపోయినా ఇది తెలంగాణ సాధించిన విజయం. ఒకవేళ కేంద్రం నుంచి సహకారం లభించి ఉంటే? ఆకాశమే హద్దుగా దూసుకెళ్లేది. ఐటీఐఆర్ వంటి ప్రాజెక్టును బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి ఉండకపోతే తెలంగాణకు ఎంతో మేలు జరిగేది. సహకారం మాట దేవుడెరుగు తెలంగాణను స్వాహా చేయాలనే చూశారు మొదటినుంచి. సాధారణ మెజారిటీతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే అప్పటికి ఇంకా హైదరాబాద్ నుంచే పాలన సాగించిన ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఓటుకు నోటు' ద్వారా శాసనసభ్యులను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని అస్థిరపరిచి హైదరాబాద్‌పై తమ పట్టు కొనసాగించాలనుకున్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉండటం వల్ల బాబు రాత్రికిరాత్రి అమరావతి వెళ్లాల్సివచ్చింది. ఆ తర్వాత బీజేపీ ఇదే పనికి పూనుకున్నది. బీజేపీ తరపున శాసనసభ్యులను కొని ప్రభుత్వాన్ని అస్థిరపరిచాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం పూనుకొని సన్యాసులను పంపింది. వారు పట్టుపడటంతో దేశవ్యాప్తంగా బీజేపీ వ్యవహారం తెలిసొచ్చింది. ఒకవైపు కుట్రలను ఎదుర్కొంటూనే తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి సామాన్యమైనది కాదు. తెలంగాణ మేమే ఇచ్చామనేది కాంగ్రెస్ వాదన. నిజమే మరి హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలిపింది ఎవరు? ఇచ్చామనే దానికి క్రెడిట్ తీసుకుంటే, పచ్చగా ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలిపి కరువు కాటకాలతో దెబ్బతీసింది మేమే అని కూడా ఒప్పుకోవాలి. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమాన్ని 4 వందల మందిని పొట్టనపెట్టుకొని అణచివేసింది కూడా మేమేనని ఒప్పుకోవాలి. మేము ఇచ్చామని చెప్తున్నవారు, మేం ఆంధ్రాలో కలపడం ద్వారా తెలంగాణను ఆరు దశాబ్దాల పాటు వెనుకబాటుతనంతో ముంచెత్తామని కూడా ఒప్పుకోవాలి. 2009 డిసెంబర్ 9న కేంద్రం తెలంగాణ ఏర్పాటును ప్రకటిస్తే రాజీనామాలతో అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ కాదా? అడ్డుకున్నది మేమే అని కూడా ఒప్పుకోవాలి. 2009లోనే తెలంగాణ ఏర్పడి ఉంటే తెలంగాణ మరింత అభివృద్ధి సాధించి ఉండేది కదా?

> 2014లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలిసిందే. విడిపోతే మేం అభివృద్ధి చెందుతాం అనే వాదన వేరు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి చెంది తలెత్తుకొని నిలిచింది. ఆరున్నరేండ్ల కాలంలో ఇంత అభివృద్ధి సాధించి అనేకరంగాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఇదేస్థాయిలో మిగిలిన అరవై ఏండ్లు అభివృద్ధి చెంది ఉంటే తెలంగాణ ఎక్కడో ఉండేది. అరవై ఏండ్ల వెనుకబాటుకు ఎవరు బాధ్యులు?

'పద్నాలుగేండ్ల పాటు ఉద్యమం చేశాం, తెలంగాణ సాధించా'మని చెప్పుకొని 2014లో టీఆర్ఎస్ ఎన్నికలకు వెళ్లింది. ప్రజలు సాధారణ మెజారిటీతో అధికారం ఇచ్చారు. 2018లో తెలంగాణ సాధించాం, నాలుగేండ్లలో చెప్పింది చేసి చూపించామని చెప్పుకొని ఎన్నికలకు వెళ్లారు. అందుకే ప్రజలు ఈసారి భారీ మెజారిటీ ఇచ్చారు. సెంటిమెంట్‌తో మళ్లీ మళ్లీ గెలువరని కొందరి విమర్శ. 2014 ఎన్నికల్లో కన్నా 2018 ఎన్నికల్లో మెజారిటీ ఎక్కువ వచ్చిందంటే సెంటిమెంట్ 2014లో ఎక్కువ ఉంటుందా? 2018లో ఎక్కువ ఉంటుందా? ప్రజలు అమాయకులేం కాదు. వారికి ఎక్కడినుంచి ఎక్కడికి వచ్చామో తెలుసు. సాధించిన అభివృద్ధిని బేరీజు వేసుకొనే నిర్ణయం తీసుకుంటారు. ఇది తెలంగాణ కాలం. తెలంగాణకు తిరుగు లేదు.

మళ్లా అండగా నిలుద్దాం

దేశంలో గత కొద్ది నెలలుగా ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థల రూపంలో దాడులు జరుగుతున్నాయి. గత తొమ్మిదేండ్లలో సీబీఐ, ఈడీ, ఐటీలు నమోదు చేసిన కేసులు, అరెస్టుల లెక్కలే బలవంతుల దౌర్జన్యకాండకు అద్దం పడుతున్నాయి.





డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
92465 26899

గత తొమ్మిదేండ్లలో ఈడీ ఏకంగా 5,310 కేసులు నమోదు చేసింది. అందులో ప్రాంతీయ పార్టీల ముఖ్యనేతలు, వారిని సమర్థించే సంస్థలు, వ్యక్తులే ఎక్కువగా ఉండటం శోచనీయం. నిష్పాక్షికంగా పనిచేస్తూ జాతి ప్రయోజనాలను కాపాడటం కోసం ఉద్భవించిన సీబీఐ 25 వేలకు పైగా కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో ఎక్కువ శాతం ఏండ్ల తరబడి విచారణ సాగిన తర్వాత కోర్టుల్లో వీగిపోయాయి. 90 శాతానికి పైగా ఇలాంటి కేసులే ఉండటం విషాదం. ఇక ఐటీ దాడులకు లెక్కే లేదు.

తమ ఆధిపత్యాన్ని, ఆగడాలను ప్రశ్నించే ప్రజా ప్రభుత్వాలను అస్థిరపరచటం, పార్టీలను చీల్చటంతో పాటు భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న ప్రజల్లో చీలిక తేవటమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థగా పేర్కొంటున్న భారతదేశంలో బలమైన కేంద్రంతో పాటు బలమైన రాష్ట్ర ప్రభుత్వాలు మనగలిగితేనే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రపంచ చిత్రపటంలో మన దేశానికి తగిన గుర్తింపు లభిస్తుంది. ఈ విషయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకుంటే మంచిది. అరవై ఏండ్ల పోరాటం తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం విషయంలోనూ కేంద్రం అవలంబిస్తున్న వైఖరి భిన్నంగా ఉన్నది.

'తెలంగాణ అంటేనే కేసీఆర్, కేసీఆర్ అంటేనే తెలంగాణ'... అన్న రీతిలో సాగుతున్న ఆకుపచ్చటి తెలంగాణలో మంటల్ని రగిల్చేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఆ కుటిల యత్నాలు ఎన్నటికీ ఫలించవనే విషయం వారికి అర్థం కావడం లేదు. ఇబ్బందులు పడ్డ అన్ని సమయాల్లోనూ మేధావులు, విద్యావంతులు తెలంగాణ ప్రజలకు అండగా నిలిచారు. తమకు తెలంగాణయే ముఖ్యమని, తెలంగాణను అన్ని విధాలుగా ప్రగతివైపు పరుగు పెట్టించగల శక్తి, సామర్థ్యాలు కలిగిన నాయకుడు కేసీఆర్ ఒక్కరేనని తేల్చిచెప్పారు. తెలంగాణ రాష్ట్రం 10వ ఏట అడుగుపెడుతున్న సందర్భంలో.. ఇంకా సాధించాల్సిన లక్ష్యాలు, నెరవేర్చుకోవాల్సిన స్వప్నాల విషయంలో మేధావులు మరోమారు కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలి. అనేక త్యాగాలతో ఏర్పడిన తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్ నాయకత్వాన్ని ఇప్పుడు దేశం కోరుకుంటున్నది. తెలంగాణ మోడల్ తెరమీదికి వచ్చిన నేపథ్యంలో దేశంలోని మేధావి లోకమంతా కేసీఆర్ సేవలు దేశ ప్రజలందరికీ చేరువయ్యే దిశగా బలపరచాలి. నాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ మేధావి వర్గాలతో సమాలోచనలు జరిపారు. వారి సలహాలు, సూచనలతో ముందుకెళ్లారు, ఇప్పుడు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

> తెలంగాణ అభివృద్ధి చెందినట్టు దేశం అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. హిందుత్వం ముసుగులో ప్రజాస్వామ్య లౌకిక విధానాలను దెబ్బతీస్తున్న ఈ తరుణంలో వాటి పునాదులను మరింత బలీయంగా తయారు చేసుకునేందుకు కేసీఆర్ లాంటి నాయకుడు దేశానికి అవసరం అని దేశ ప్రజలు భావిస్తున్నారు. ఈ తరుణంలో మేధావులంతా కేసీఆర్‌కు బాసటగా నిలవాలి. ప్రస్తుతం దేశంలో నెలకొన్న అప్రజాస్వామిక విధానాలను కూకటివేళ్లతో పెకిలించాలి. హిందూత్వ పేరుతో దేశ ప్రజలను విచ్ఛిన్నం చేస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న మోదీ పాలనకు చరమగీతం పాడాలి.

నిజమే.. బలవంతుల దౌర్జన్యం కంటే మేధావుల మౌనమే సమాజానికి ఎక్కువ నష్టం చేకూరుస్తుంది. కండ్లెదుటే అనేక అకృత్యాలు జరిగిపోతున్నాయి. అయినా మేధావులు మౌనంగా ఉంటే దేశ ప్రజలు ఎంతో నష్టపోతారు. మేధావులు మౌనం వీడితే ప్రజాస్వామ్యానికి, సమాజానికి భవిష్యత్తులో జరిగే నష్టాన్ని నిలువరించగలుగుతారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి గొప్ప బహుముఖ ప్రజ్ఞాశాలికి వెన్నుదన్నుగా నిలిస్తే తెలంగాణ వలె దేశం కూడా అనతికాలంలోనే అభివృద్ధి పథాన ముందుకుసాగుతుంది.

(వ్యాసకర్త: ఉమ్మడి ఏపీ మాజీ ప్రధాన సమాచార కమిషనర్)

తెలంగాణే అతడి ఆశ, శ్వాస

తెలంగాణ రానే రాదన్నారు. ఒకవేళ వచ్చినా రాష్ట్రంగా మనుగడ సాధించలేదన్నారు. ఉద్యమకారుడి చేతిలో రాష్ట్రం ఉంటే రోజూ దొమ్మీలు, దోపిడీలే అన్నారు. కరెంటు లేక రాష్ట్రం చిమ్మచీకట్లలో మగ్గిపోతుందన్నారు. ఆర్థికంగా దివాళా తీస్తుందని జోస్యం చెప్పారు. పెట్టుబడిదారులు ముందుకురారని చెప్పారు. అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అవినీతిలో కూరుకుపోతుందన్నారు. నిరుద్యోగం పెచ్చరిల్లి అశాంతికి తెలంగాణ నెలవుగా మారుతుందన్నారు. కానీ, వీటన్నింటిని తెలంగాణ పటాపంచలు చేసింది.



ఓరుగంటి సతీశ్
80080 06667


రాదనుకున్న తెలంగాణలో అసాధ్యం అనుకున్న అభివృద్ధిని చేసి చూపించారు ముఖ్యమంత్రి కేసీఆర్. చిమ్మచీకట్లో ఉన్న రాష్ట్రాన్ని వెలుగు వైపు నడిపించారు. విద్యుదుత్పత్తి, పంపిణీలో దేశంలోనే ఒక రోల్ మాడల్‌గా నిలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణ ఆవిర్భవించేలా చేశారు. పెట్టుబడుల వరద పారిస్తున్నారు. రికార్డు స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను సృష్టించి నిరుద్యోగుల ఆశలను నిజం చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ.. అన్నదాతకు అండగా నిలుస్తూ.. రైతు రాష్ట్రంగా నిలిపి శభాష్ తెలంగాణ అనిపించేలా చేశారు. దేశంలో ఏ మూలకు వెళ్లినా నేను తెలంగాణోన్నని గర్వంగా చెప్పుకొనేలా చేశారు.

ఇల్లలకగానే పండుగ కాదు. రాష్ట్రం తెచ్చుకోవడంతోనే పనైపోలేదు. సాధించుకున్న రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడం ముఖ్యం. ఇగో కేసీఆర్ ఏం చేసిండంటే ఇవన్నీ చేసిండు. తెలంగాణ ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలను జరుపుకొన్నది. కొంతమందికి ఇప్పుడు దశాబ్ది వేడుకలు ఎందుకని అనుమానపడ్డారు. ఎందుకు చేసుకున్నామంటే... ఎట్లా ఉన్న మనం ఎట్ల య్యామో ప్రపంచానికి చెప్పుకోవడానికి. మనకు మనం వెయ్యేండ్ల వైపు పరుగులు తీయడానికి ఈ వేడుకలు జరుపుకొన్నాం. ఒక ఆత్మస్థయిర్యం నింపుకోవడానికి ఈ వేడుకలు. ఇల్లు కట్టుకుంటున్నపుడు పునాదులు బలంగా ఉండాలి. రాష్ట్రానికి ఈ పదేండ్ల పాలన పునాది వంటిది. కేసీఆర్ వంటి నేత ముఖ్యమంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి బలమైన పునాదులు పడ్డట్టే.

> నేను ఈ మాటలను వట్టిగా చెప్తలేను. కేసీఆర్ ఏదైనా చేయాలనుకుంటే రాత్రింబవళ్లు నిద్రపోరు. తన ఆలోచనలన్నింటిని రంగరిస్తారు. ఫలితాన్ని రాబడ్తారు. ఇది కార్యసాధకుడి లక్షణం. రాష్ట్రం ఏర్పడకముందటి ముచ్చట. 2009 మే నెలలో ఒకరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ సంగారెడ్డి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బయల్దేరారు.

పత్రికా విలేకరిగా ఉన్న నేను ఆయన ఇంటర్వ్యూ కోసం.. క్షేత్రస్థాయిలో ఎన్నికల పరిశీలన కోసం ఆయనతో కలిసి హెలికాప్టర్‌లో వెళ్లాను. మెదక్ జిల్లాలోని రామాయంపేట తదితర నియోజకవర్గాల ప్రచారం ముగించుకొని చివరికి సంగారెడ్డికి చేరుకున్నాం.

ఆ సమయంలో మెదక్ జిల్లాలోని అత్యంత వెనుకబాటుకు గురైన ఆందోల్, సంగారెడ్డి ప్రాంతాలకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నీళ్లు ఇవ్వడంపై మా ఇద్దరి మధ్య చర్చ జరిగింది. మంజీరా నది వట్టిపోయిన తీరును మేం హెలికాప్టర్ నుంచి చూశాం. ఒక్కసారి కాదు.. ఒక రెండు మూడుసార్లు హెలికాప్టర్ నడుపుతున్న పైలెట్‌తో ఆ నది చుట్టూ చక్కర్లు కొట్టించారు. నీళ్లు లేని వైనంపై తన ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, ఆందోల్ ప్రాంతాలకు నీళ్లు తరలించడం చాలా కష్టమని అప్పటి సీఎం, మంత్రులు చెప్తున్నారని, సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఈ ప్రాంతం ఉండటంతో నిర్లక్ష్యానికి గురవుతున్నదని, కానీ, మనసు పెట్టి పని చేస్తే ఇక్కడికి కూడా నీళ్లు ఇవ్వవచ్చని చెప్పారు.



అంతేకాదు, తెలంగాణ వస్తది. వచ్చిన తర్వాత ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు వస్తాయని బల్లగుద్ది చెప్పారు. తెలంగాణ వచ్చింది. ఇప్పుడు సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు పనులను కేసీఆర్ ప్రారంభించారు. ఏడాదిగా శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సముద్ర మట్టానికి 664.50 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి నీళ్లు ఇచ్చే భగీరథ ప్రయత్నం నిరాటంకంగా జరుగుతున్నది.

2009లోనే పాలమూరు నుంచి ఎంపీగా పోటీ చేసిన కేసీఆర్.. ఎన్నికలు అయిన వెంటనే.. ఫలితాలు కూడా ప్రకటించకముందే పాలమూరుకు నీళ్లు ఇచ్చే ప్రణాళికను ముందేసుకున్నారు. ఇప్పుడు పాలమూరు-రంగారెడ్డి పథకం ఒక కొలిక్కి వచ్చింది. అతి త్వరలోనే దీని ఫలితాలు ప్రజలకు అందబోతున్నాయి. ఒక్క ఇవే కాదు, తెలంగాణలో ఇప్పుడు అమలవుతున్న అనేక పథకాలు కేసీఆర్ మేధోమథనం నుంచి వచ్చినవే. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక సందర్భాల్లో కేసీఆర్ తన మదిలోని ప్రణాళికలను ప్రజలకు చెప్పేవారు. అప్పట్లో అసలు తెలంగాణ వస్తుందో, రాదో తెలియదు కానీ.. కేసీఆర్ ఏదేదో చేస్తడట అంటూ నాటి అధికార, ప్రధాన ప్రతిపక్షాల వారు మాట్లాడేవారు.

> ఎవరెన్ని అవహేళనలు చేసినా.. ఎన్ని విధాలుగా మాట్లాడినా కేసీఆర్ తాను చెప్పానే ఉండేవారు. కేవలం చెప్పడంతోనే కేసీఆర్ సరిపెట్టలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచరించి చూపించారు. దటీజ్ కేసీఆర్. కలలు కనడమే కాదు, వాటిని సాకారం చేసుకోవడం ఎలాగో తెలిసినవారు కేసీఆర్.

రాజకీయులు ప్రజలు, తమ ప్రాంతం గురించి ఆలోచించడం సహజం. మన దేశం, ఉమ్మడి రాష్ట్రంలో అనేక మంది హేమాహేమీల్లాంటి నేతలున్నారు. ఉద్యమకారులు, గొప్ప రాజనీతిజ్ఞులు, పరిపాలనాదక్షత ఉన్నవారిని కూడా మనం చూశాం. ఈ అన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో కాకుండా వేర్వేరు నేతల్లో కనిపించేవి. కానీ, ప్రజలను ప్రేమించడం, ప్రాంతాన్ని ప్రేమించడం చాలా అరుదు. రాజనీతిజ్ఞత, పరిపాలనాదక్షత, ఉద్యమాలు చేయడం, పోరాట చరిత్ర వంటివన్నీ కలిగి ఉన్న అరుదైన, విలక్షణ నేత కేసీఆర్ మాత్రమే. సమకాలీన రాజకీయాల్లో కేసీఆర్ వంటి నేత లేరనడంలో అతిశయోక్తి లేదు తెలంగాణను కేసీఆర్ ఆకళింపు చేసుకున్నంతగా మరెవ్వరూ చేసుకోలేకపోతున్నారు. కేసీఆర్ తెలంగాణను ప్రేమిస్తరు. తెలంగాణనే శ్వాసిస్తరు. కేసీఆర్‌తో మాట్లాడిన ఏ సందర్భంలోనైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కొత్తగా ఏం చేద్దాం, ఎలా చేద్దాం, రాష్ట్రంలో ఏం జరుగుతున్నది. దేశంలో ఏం జరుగుతోందన్న చర్చనే ఎక్కువగా ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే తెలంగాణ కోసం పనిచేసే హోల్‌టైం వర్కర్ కేసీఆర్. సుదీర్ఘంగా ఆయనను దగ్గరగా చూసి ఈ మాట చెప్తున్న. రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల్లో ఈ తరహా నేత ఎవ్వరూ లేరు. 40 ఏండ్లకు పైగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న కేసీఆర్ పూర్తి స్థాయి రాజకీయ నాయకుడు. పార్ట్‌టైం నేత కాదు, రాష్ట్రపతిగా పనిచేసిన ప్రణబ్ ముఖర్జీ తన పుస్తకం 'ది కొయలిషన్ ఇయర్స్' పుస్తకంలో కేసీఆర్ వ్యక్తిత్వం గురించి రాశారు. 2004లో యూపీఏ క్యాబినెట్ కూర్పు జరుగుతున్నపుడు భాగస్వామ్య పక్షాల నుంచి తమకు కావాల్సిన మంత్రిత్వ శాఖల గురించి అనేక డిమాండ్లు వచ్చాయని, కానీ, కేసీఆర్ మాత్రం తన లక్ష్యం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన అని, తనకు మంత్రి పదవులపై పెద్దగా ఆసక్తిలేదని, ఎలాగైనా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి మాత్రం పట్టించుకోవాలని, తన డిమాండ్ అదొక్కటే అంటూ చెప్పారని గుర్తుచేసుకున్నారు. కేసీఆర్‌లో ఉన్న నిస్వార్థానికి ఇంతకన్నా పెద్ద తార్కాణం ఇంకేం కావాలి? అందుకే తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కేసీఆర్.

ఎటమటం



రంగుపడింది

రేవంత్‌రెడ్డి అధ్యక్షుడయ్యాక టీపీసీసీ టీడీపీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీగా మారిందని ఆ పార్టీ నేతలు గతంలో విమర్శించారు. అనేవాళ్లు ఎలాగూ అంటారని రేవంత్ లైట్ తీసుకున్నట్టున్నారు. ఇప్పుడు ఏకంగా గాంధీభవన్‌కు పెట్టిన బోర్డులో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బ్యాక్‌గ్రౌండ్‌లో ఎల్లో కలర్ వేశారు. పూర్వాశ్రమంలో రేవంత్ టీడీపీ కావడంతో సింబాలిక్‌గా టీపీసీసీకి ఎల్లో కలర్ వేసినట్టున్నారు. సీనియర్లు ఏమన్నా పట్టించుకోకుండా రేవంత్ హయాంలో మొత్తం మీద కాంగ్రెస్‌కు రంగు పడింది.




పక్కీ బాత్

కాంగ్రెస్ మునిగిపోయే పడవ. అయినా ఆ పార్టీలో ఎవరైనా చేరాలనుకుంటే ఆపబోం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారుతారని జరుగుతున్న ప్రచారంపై ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి ఈటల, కోమటిరెడ్డి దూరంగా ఉండటంపై వారిని కొందరు నేతలు ఆరా తీయగా, బండిని మార్చకుండా ఇంటింటికి తిరిగినా ఫలితం లేదనే పొల్గొనడం లేదని అన్నట్టు సమాచారం. మొత్తం మీద బండి, ఆయన వ్యతిరేక వర్గం రెండూ కూడా బీజేపీకి భవిష్యత్ లేదని తేల్చేశాయి. అందుకే కాబోలు పార్టీ మారుతామనే వారిని ఆపబోమన్న బండి సంజయ్, తాను కూడా బిస్తర్ సర్దుకొని రెడీగా ఉన్నట్టు చెప్పడం వెనుక అసలు మతలబు ఇదీ.

ఉల్టా చోర్



దొంగే, 'దొంగా.. దొంగా' అని అరిచినట్టుగా ఉన్నది ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ వైఖరి. హిండెన్‌బర్గ్ రిపోర్టుతో అదానీ వ్యవహారం బయటపడటంతో అదానీ-అంబానీ సంబంధాలపై విపక్షాలు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) డిమాండ్ చేశాయి. జేపీసీని వ్యతిరేకించి బీజేపీకి పరోక్షంగా శరద్‌పవార్ మద్దతుగా నిలిచారు. ఆ తర్వాత అదానీ స్వయంగా శరద్‌పవార్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో బీజేపీ-శివసేన సంకీర్ణ సర్కార్‌లో రేపో, మాపో ఎన్సీపీ చేరబోతున్నట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. బీజేపీకి లోపాయికారిగా ఒకవైపు మద్దతు ఇస్తూనే బీజేపీకి బీ-టీమ్‌గా మారిన శరద్‌పవారే, బీఆర్ఎస్‌పై బీ-టీమ్ ముద్ర వేయడమంటే 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్టుగా ఉంది వ్యవహారం



దీన్నేమంటరు?

కేఏ పాల్ ప్రజాశాంతి పార్టీ స్ఫూర్తితో గద్దర్ తన పార్టీకి గద్దర్ ప్రజా పార్టీ అని నామకరణం చేశారు. పేరుకు గద్దర్ ప్రజా పార్టీ అని ప్రకటించినప్పటికీ ఆ పార్టీకి అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి అన్ని పదవులు గద్దర్ తన కుటుంబ సభ్యులకే రిజర్వు చేశారు. ఒకవైపు బీఆర్ఎస్‌ను కుటుంబపార్టీగా విమర్శించే గద్దర్ అన్ని పోస్టులు తన కుటుంబానికి కట్టబెట్టడం ఏమిటి? అని విమర్శలు వెల్లువెత్తున్నాయి. గజ్వేల్ నుంచి పోటీ చేస్తామని గతంలో ప్రకటించారు. అక్కడి నుంచే పోటీ చేస్తారా? అని ఢిల్లీలో మీడియా అడిగితే పార్టీ నిర్ణయిస్తుందన్నారు. అంటే దీని అర్థం నిర్ణయించాల్సింది కుటుంబం అన్నట్టే కదా?

- వెల్జాల

బోడ్డాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అమరవీరుల త్యాగాలే స్ఫూర్తిగా..

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తొమ్మిది ఏండ్లుదాటి పదవ ఏట అడుగు పెట్టాం. ఈ సందర్భంగా మూడు వారాలు ముచ్చటైన సంబురాలు జరుపుకున్నాం. తెలంగాణ అమరుల త్యాగాలు వృథా కాలేదని ఆత్మసాక్షిగా నివాళులు అర్పించుకున్నాం. అభివృద్ధిలో పదేండ్ల ప్రస్థానం విజయవంతంగా సాగిన సందర్భంగా జరుపుకుంటున్న సంబురాలివి.

ఈ సంబురాలకు మరో విశిష్టత కూడా ఉన్నది. అది- దేశాన్ని 'తెలంగాణ మాడల్'లో తీర్చిదిద్దడానికి విజయయాత్ర ప్రారంభమైన సందర్భంగా జరుగుతున్న సంబురాలివి. విజయుడు కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి దేశంలోని దుష్ట శక్తులపై తన గాండీవాన్ని ఎక్కుపెట్టిన సందర్భంగా తెలంగాణ ప్రజలు జరుపుకుంటున్న సంబురాలు ఇవి.



అమ్మ మనస్సుతో పాటు అమోఘమైన మేధస్సు ఉన్న నాయకుడు కేసీఆర్. కాబట్టే, తెలంగాణకు పటిష్టమైన పునాది ఏర్పరిచేందుకు పగలూ రేయీ కష్టిస్తున్నారు మన కేసీఆర్. పరాయి పాలనలో ఆరు దశాబ్దాలకు పైగా కునారిల్లిన రాష్ట్రం కోలుకునేందుకు తొమ్మిది ఏండ్ల కాలం సుదీర్ఘమైనదేమి కాదు, అయితే ఈ పునాది అత్యంత పటిష్టమైనది. ఆకాశ సౌధానికి అంకురమైనది. పట్టెడన్నం-పిడికెడు ఆత్మగౌరవం కోసమే కదా తెలంగాణ ఉద్యమం, ఆ ఉద్యమ సారథి పాలకుడైన తర్వాత రెండింటికి పూచీ పడ్డారు. తడారి పోయిన నేల తల్లి ఎడారిగా మిగలడం ఇష్టం లేక సాగునీరు - తాగు నీటిపై మొదటగా దృష్టి సారించారు, అపర భగీరథుడుగా అవతారమెత్తారు. అకుంఠిత దీక్షతో అడుగు ముందుకు వేశారు. ఫలితమే కాళేశ్వరం. తెలంగాణ రైతన్నలపై కేసీఆర్ కున్న తరగని మమకారానికి తిరుగులేని సాక్ష్యం.

దేశ చరిత్రలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఏటా రెండు పంటలకు గాను ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నారు. అలాగే, ఏ కారణం చేతైనా రైతన్న మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా ఆదుకునేందుకు రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రధానంగా చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం చేసే తెలంగాణాలో చెరువుల పునరుద్ధరణ కోసం మిషన్ కాకతీయ పథకాన్ని ప్రారంభించి ప్రతి ఊర చెరువునూ జల సిరులతో నింపారు.

కరెంటు కోసం రైతన్నలు పడుతున్న అష్టకష్టాలు తీర్చేందుకు ఉచితంగా 24 గంటల పాటు నిరంతర కరెంటును అందిస్తున్నారు. అలాగే, ఆడ బిడ్డలు తాగు నీటి కోసం పడుతున్న కష్టాలు తీర్చేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తూ ప్రజల దూప తీర్చిండు. మొత్తంగా తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కేసీఆర్ నిమగ్నమయ్యారు. దేశానికి అన్నం పెట్టే స్థితికి తెలంగాణ చేరుకున్నది. ఒకప్పుడు సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉండి అనేక ప్రయోగాలు చేసి, అద్భుతాలు సృష్టించిన కేసీఆర్ తెలంగాణ సాధించడంపై దృష్టిసారించి విజయం సాధించారు. తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేశారు. తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ దేశ పరిస్థితి పట్ల ఆవేదన చెందుతున్నారు. 'మనదేశానికి ఉన్న లక్ష్యం ఏంటి?' అంటూ కేసీఆర్ వేసిన ప్రశ్న దేశంలోని మేధావులను కదిలించింది. మీడియా దృష్టిని కూడా ఆకర్షించింది.

దేశంలో ఎంత వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నది, ఎన్ని టీఎంసీల నీటి లభ్యత ఉన్నది కేసీఆర్ లెక్కలతో సహా చెప్పి పరిష్కారాలు చూపడం రైతన్నలను, రైతు ఉద్యమ సంస్థలను ఆలోచింప జేస్తున్నది. మరోవైపు ప్రతిపక్షాలను ఏకం చేయడం కన్నా తానే సొంత అజెండాతో దేశ ప్రజల మధ్యకు వెళ్లడం మంచిదని ఆలోచించిన కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చా రు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటూ కేసీఆర్ ఇచ్చిన పిలుపు దేశమంతా మారు మోగుతున్నది.

కేసీఆర్ తెలుగులో ప్రజల భాషలో మాట్లాడి మెప్పించారు. ఇంగ్లిష్, హిందీ, ఉర్దూలో దేశ సమస్యలపై మాట్లాడి మెప్పించగలరు. దీంతో రైతన్నల రాజ్యం కోసం కేసీఆర్ ఇచ్చిన పిలుపు ఆసేతు హిమాచలం ప్రతిధ్వనిస్తున్నది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ మొదలుకొని అనేక రాష్ర్టాల నుంచి నాయకులు, రైతులు కేసీఆర్ నాయకత్వంలోని ఈ మహోద్యమంలో వచ్చి చేరుతున్నారు. ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ ఓడిపోతుందనేది ప్రధానం కాదనీ, ప్రజలు గెలువాలని కేసీఆర్ అంటున్నారు. దేశంలో బీఆర్ఎస్ సంచలనం సృష్టిస్తున్నడంలో సందేహం లేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి 1977లో జనతా పార్టీ మాదిరిగా బీఆర్ఎస్ మహోద్యమంగా మారబోతున్నది. కేసీఆర్ ఏ ప్రతిపక్ష నేత మీదా నమ్మకం పెట్టుకొని ముందుకు పోవడం లేదు. టీఆర్ఎస్ పెట్టినప్పుడు ఒక్కడే, కానీ ఆ తరువాత కోట్లాది జనం ఆయన వెంట నడిచారు. ఇప్పుడూ అంతే. దేశవ్యాప్తంగా జనాన్ని కదిలించబోతున్నారు.

దేశ చరిత్రలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఏటా రెండు పంటలకు గాను ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నారు. అలాగే, ఏ కారణం చేతైనా రైతన్న మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా ఆదుకునేందుకు రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు.

లోక్‌సభ ఎన్నికలకు ఆరు నెలల ముందే అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలలో కేసీఆర్‌ను దెబ్బకొట్టాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్ర పన్నుతున్నాయి. ఈ రెండు పార్టీలు తెలంగాణకు వ్యతిరేకమైనవే.

దేశాన్ని డెబ్బయేండ్ల పాటు వెనుకబడేయడంలో ఈ రెండు పార్టీల పాత్ర ఉన్నది. బీఆర్ఎస్ తెచ్చే మార్పును ఇవి అంగీకరించలేవు. అందువల్ల ఈ రెండు పార్టీలు కేసీఆర్‌ను దెబ్బకొట్టాలని చూస్తున్నాయి. తెలంగాణ రాష్ర్టాన్ని ఏ మాత్రం ఆదుకోని ఈ రెండు పార్టీలు కేసీఆర్‌ను రాష్ట్రంలో దెబ్బతీయడం ద్వారా జాతీయ స్థాయిలో ఎదగకుండా చేయాలని కుట్రపన్నుతున్నాయి.

రాబోయే అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌నే కాదు, దేశ సౌభాగ్యానికి సంబంధించినవి. భాగ్యవంతమైన భారతాన్ని నిర్మించడానికి తోవచూపేవి. అందుకని తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు అండగా నిలువాలి. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు సంపూర్ణ విజయం కట్టబెట్టాలి. దేశాభివృద్ధికి, పేదల సంక్షేమానికి పాటుపడే నాయకుడు కేసీఆర్ తప్ప మరెవరూ ఉండరు. ప్రతి పేద వాడి కన్నీళ్లు తుడవడమే కేసీఆర్ లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు సహకరించాలి.



గోసుల శ్రీనివాస్ యాదవ్
బీఆర్ఎస్ నాయకులు



స్మారకానికి సలాం

తెలంగాణ అమర వీరుల స్మృతి చిహ్నం! అంతర్జాతీయ ప్రమాణాలతో కట్టిన స్మారకం.అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూర్చేలా, తరతరాలకు స్ఫూర్తి రగిల్చేలా దీన్ని తీర్చి దిద్దారు. ఫ్లోరింగ్ నుంచి ఐదంతస్తుల ఉపరితలం మీద నిరంతరం 365 రోజులు ప్రజ్వరిల్లే అమరుల జ్యోతి వరకూ ప్రతిదీ ప్రత్యేకమే. అమరుల త్యాగ ఫలమే తెలంగాణ. వారి స్మరణకు సముచితంగా నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. సుమారు రూ.180 కోట్ల వ్యయంతో తెలంగాణ అమర వీరుల స్మారకం రూపుదిద్దుకున్నది.


ఒకప్పుడు టీఆర్ఎస్ ఆవిర్భావానికి కేంద్ర బిందువైన జలదృశ్యం నేడు అమరుల స్మారక కేంద్రానికి నిలయమైంది. టీఆర్ఎస్ ఆవిర్భావాన్ని జీర్ణిం చుకోలేని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు జలదృశ్యం కార్యాలయాన్ని తొలిగించిన విష యం తెలిసిందే. ఇప్పుడు అదే ప్రదేశంలో అమరజ్యోతి నిర్మితమవ్వడం గొప్ప విషయం. సాగరహారం, మిలియన్ మా ర్చ్ సందర్భంలోనూ అనేక మంది ఉద్యమకారులు ఈ ప్ర దేశంలోనే పోలీసుల లాఠీ దెబ్బలకు గురయ్యారు. ఎక్క డైతే మన ఆత్మగౌరవం దెబ్బతిన్నదో అక్కడే అమర జ్యోతిని నిటారుగా నిలబెట్టడమంటే ఇది కదా ఆత్మ గౌరవ పతాకకు ప్రతీక.

3 ఎకరాల 29 గుంటల స్థలంలో కలకాలం నిలిచేలా, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో అపురూపమైన స్మారకాన్ని అందుబాటులోకి తెచ్చారు. సాధారణ స్మారక స్థూపాలు, ప్రతిమలకు భిన్నంగా, వైవిధ్యమైన తరహాలో ఈ చిహ్నం చరిత్రకు ఎక్కేలా నిర్మించారు. ప్రవేశం మొదలు నిష్క్రమణ వరకూ ఆద్యంతం అమరుల త్యాగాల నుంచి ప్రేరణ పొందేలా ఏర్పాట్లు చేశారు.

అదే సమయంలో సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలకు, సేద తీరడం మొదలు భోజనం దాకా గరిష్ట మౌలిక సదుపాయాలు ఇందులో ఉన్నాయి. మొత్తంగా హైదరాబాద్ సందర్శనాత్మక ప్రదేశంగా అమరుల స్మారక చిహ్నం సగర్వంగా, సమున్నతంగా చరిత్ర ఉన్నంత కాలం చెక్కు చెదరకుండా నిలబడుతుంది. రాష్ట్ర సాధన కోసం తమ ప్రా ణాలను తృణప్రాయంగా అర్పించిన అమరులను తలుచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించకూడదన్న లక్ష్యంతో అమరవీరుల జ్ఞాపకార్థం అద్భుత రీతిలో అమరుల జ్యోతిని ఏర్పాటు చేశారు. నిత్యం ప్రజ్వలించే జ్యోతి అమరుల త్యాగాలను నిరంతరం గుర్తు చేయడంతోపాటు మన లక్ష్యాలను సైతం గుర్తు చేసేలా తీర్చిదిద్దారు. ఇంత గొప్పగా అమర వీరుల స్మృతి చిహ్నా నిర్మాణం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైంది. తెలంగాణ కోసం ఆత్మ బలిదానాలు చేసిన వా రిని కలకాలం స్మరించుకునేలా ప్రపంచంలోనే స్టెయిన్ లెస్ స్టీల్‌తో అతి పెద్ద అమర జ్యోతి ఏర్పాటు చేయడమనేది అరు దైన విషయం. ముఖ్యమంత్రి కేసీఆర్ తిరుగులేని నిబద్ధతకు ఇది మరో నిదర్శనం.తెలంగాణ ఉద్యమకారుల గుండె ఉప్పొంగే అపురూప సందర్భమిది.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ ఫలాలు ఒక్కొక్కటిగా అందుతున్నా యి. సాగు, తాగు నీరు సహ ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఏ లక్ష్యం కోసమైతే ఉద్యమకారులు తమ ప్రాణాలు బలిపెట్టారో వారి కలలు ఒక్కొక్కటిగా సాకారమవుతున్న సందర్భం. పరాయి పాలనలో ఎండిబీటలు బారిన నేలలు కాళేశ్వర జలాలతో ప్రాణం పోసుకొని కనుచూపు మేర పచ్చని పంటలతో విరాజిల్లుతున్నవి. రైతు కేంద్రంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. కేవలం పదేండ్ల కాలంలోనే అభి వృద్ధిని కొంత పుంతలు తొక్కించారు కేసీఆర్.

తాజాగా గొప్పదైన అమర వీరుల స్మారకం మన కండ్ల ముందు సాక్షాత్కరించడం సీఎం కేసీఆర్ పట్టుదల, పవిత్ర సంకల్పానికి తార్కాణం.



ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384
(వ్యాసకర్త: ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

విలక్షణ పోరాట యోధుడు

తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమ పతాక రెపరెపల్ని తన అస్తిత్వంగా మలుచుకున్నాడొక ఉద్యమకారుడు. తన ఊపిరిని సైకిల్ చక్రాలుగా మార్చుకొని ఉద్యమ ఆకాంక్షను ప్రపంచం ముందు ఉంచిన ధీరుడతడు. ఉద్యమమే ప్రాణంగా కడదాకా పోరాడి అసువులు బాశాడు. అమరుడైనా ఆ బిడ్డడు చేసిన పోరాటం నేటికీ ఎందరికో స్ఫూర్తిని నింపుతున్నది. ఆ బిడ్డడే లంబాడీల వీరత్వాన్ని, తెగువను లోకానికి చాటిన ఉద్యమ వీరుడు జాదవ్ విలాస్‌రావ్ నాయక్.

నా జీల్లాంటి దుర్మార్గపు పరాయి పాలనను ధిక్కరిస్తూ తొలిదశ ఉద్యమకారులు చూపిన తెగువ, చేసిన త్యాగాలు మలిదశ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయి. పరాయి పాలకుల నుంచి మాతృభూమిని విముక్తి చేయడానికి జనులంతా తమ శాయశక్తులా పోరాడారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క దారి. ఈ ఉద్యమానికి సారథిగా ఆనాటి ఉద్యమకారుడు, ఈనాటి మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముందుండి నడిపించారు. ఆయన మార్గ నిర్దేశంలో ప్రజలంతా నిర్విరామంగా కదం తొక్కారు. అటువంటి వీరుల్లో బంజారా యువ యోధుడు, తెలంగాణ ముద్దుబిడ్డ జాదవ్ విలాస్‌రావ్ నాయక్ ఒకరు. సైకిల్ యాత్ర ద్వారా తెలంగాణ సాధనకు విలాస్‌రావ్ కృషి చేశాడు.



పోరాటాలకు పురిటి గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. రాంజీ గోండు, కొమురం భీం లాంటి వీరుల స్ఫూర్తితో ఆత్మబలాన్ని గుండెల్లో నింపుకొని ముందుకు కదిలాడు విలాస్‌రావ్. ఆయన నేటి ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలో రెక్కాడితే గాని డొక్కాడని లంబాడీ కుటుంబంలో పుట్టాడు. కూలినాలి చేస్తూ బతుకీడుస్తున్న జాదవ్ గోపిబాయి, దేవుజీల బిడ్డ విలాస్. ఒక్క సెంటు భూమి కూడా లేని నిరుపేదలు. కొడుకును బాగా చదివించాలనుకున్నారు. కానీ ఇంటి పరిస్థితులు బాగలేక, చదివించే స్థోమత లేక విలాస్ చదువు మధ్యలోనే ఆగిపోయింది. పేదకుటుంబం కావడంతో కూలి పనికి వెళ్లక తప్పలేదు. విలాస్‌రావ్ చిన్నప్పటి నుండి సామాజిక స్పృహకలవాడు. కనుక ఎల్లప్పుడూ ప్రజలకోసం, దేశంకోసం ఆలోచించేవాడు. నలుగురికి మంచి జరుగుతుందంటే ధైర్యంతో దేనికైనా సిద్ధపడేవాడు. వచ్చిన కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరకుండా సుమారు మూడేండ్ల పాటు జీతం తీసుకోకుండా విఠర్యోగా నిస్వార్థ సేవచేసి స్థానిక ప్రజల్లో మంచి పేరును సంపాదించుకున్నాడు. అటువంటి ఆ యువకున్ని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మరింత ప్రభావితం చేసింది. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ పోరాటాన్ని ఆకళింపు చేసుకున్నాడు. సైకిల్ యాత్ర ద్వారా ప్రజా పోరాటానికి సిద్ధమయ్యాడు. అలా 2002 నుంచి సైకిల్ యాత్రగా బయలుదేరాడు. ఈ యాత్ర 2012 వరకు కొనసాగింది.

పరాయి పాలనలో నీళ్లు, నిధుల, నియామకాల విషయమేకాదు ప్రతి ఒక్క అంశంలోనూ అన్యాయం, వివక్ష కానవచ్చాయి. భాషా సాహిత్యాలు చిన్నచూపుకు గురయ్యాయి. 2001లో కేసీఆర్ ఎత్తుకున్న తెలంగాణ జెండాను తాను భుజాలకెత్తుకున్నాడు విలాస్. సొంత ఊరు నుంచి ప్రయాణం సాగించాడు. గ్రామస్థులు ఇతని యాత్రను ఎంతో గొప్పగా స్వాగతించారు. తన ప్రయాణంలో భాగంగా గ్రామ గ్రామాన తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి ప్రసంగించాడు. తన ప్రచార రథం అయిన సైకిల్‌కు ఇరుపక్కలా తెలంగాణ జెండాలు, ముందువైపు నాయకుడు కేసీఆర్ ఫొటోను ఉంచుకున్నాడు. ఇతని యాత్ర ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ మీదుగా కరీంనగర్, మంచిర్యాల గుండా ఆసిఫాబాద్ వరకు సాగింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను వెలిబుచ్చుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం తిరిగాడు. లగడపాటి రాజగోపాల్ లాంటి నాయకుల ముందుకు వెళ్లి నిర్భయంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించి 'విడిపోయి కలిసుందాం' అన్న సందేశాన్ని వినిపించాడు. మొత్తంగా తెలంగాణలోని పాత పది జిల్లాలతో పాటు ఆంధ్రా,మహారాష్ట్రలను కలుపుకొని 10 వేల కిలోమీటర్ల దూరం ఈ యాత్ర సాగింది.

2001లో కేసీఆర్ ఎత్తుకున్న తెలంగాణ జెండాను తాను భుజాలకెత్తుకున్నాడు విలాస్. సొంత ఊరు నుంచి ప్రయాణం సాగించాడు. గ్రామస్థులు ఇతని యాత్రను ఎంతో గొప్పగా స్వాగతించారు. తన ప్రయాణంలో భాగంగా గ్రామ గ్రామాన తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి ప్రసంగించాడు. తన ప్రచార రథం అయిన సైకిల్‌కు ఇరుపక్కలా తెలంగాణ జెండాలు, ముందువైపు నాయకుడు కేసీఆర్ ఫొటోను ఉంచుకున్నాడు.

ఆయన యాత్రను అడ్డుకోవాలని అనేక మంది ప్రయత్నించారు. నిజామాబాద్ జిల్లా జానకంపేట బస్టాండ్‌లో నిద్రించినప్పుడు తన యాత్రకు బలాన్ని ప్రసాదిస్తున్న సైకిల్‌ను దొంగిలించారు కొందరు స్వార్థపరులు. మరోసారి ఖమ్మం సరిహద్దులో, విశాఖపట్నంలలో విలాస్‌ని బాగా కొట్టి సైకిల్‌ను లాక్కున్నారు. అయినా అధైర్యపడలేదు. తాను అడుగుపెట్టిన చోటల్లా ప్రజలు, నాయకులు ఎదురేగి స్వాగతం పలికారు. అతని ప్రసంగాలకు ముగ్ధులయ్యారు. విలాస్ యాత్రను గురించి ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలుసుకొని అతన్ని తనవద్దకు రప్పించుకొని భుజం తట్టారు. తన్నీరు హరీష్‌రావు, కేటీఆర్, నారదాసు లక్ష్మణరావు తదితరులు విలాస్‌ను ప్రోత్సహించి యువతకు రోల్ మాడల్‌గా అతన్ని అభివర్ణించారు.తొమ్మిదేండ్లపాటు నిర్విరామంగా స్వరాష్ట్ర స్వప్నాన్ని కండ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఈ యాత్రను కొనసాగించాడు. ఈ క్రమంలో ఎన్నో బెదిరింపులు, దాడులను ఎదుర్కొన్నాడు.

2009లో చిదంబరం ప్రకటన వెనక్కి తీసుకున్నప్పుడు పట్టరాని దుఃఖాన్ని పంటికింద దాచుకొని తన సైకిల్ సంకల్ప యాత్రను కొనసాగించాడు. విద్యార్థి గర్జన, వంటావార్పు, రోడ్ల దిగ్బంధనం, సకల జనుల సమ్మె వంటి సహాయ నిరాకరణ కార్యక్రమాలలో పోరుబిడ్డలతో కలిసి ఉద్యమించాడు. 2012లో తెలంగాణ వాదాన్ని వినిపిస్తూ ఖానాపూర్ సభకు వెళ్తూ స్కూల్ బస్సు ఢీకొని ప్రమాదవశాత్తు మరణించాడు. విలాస్ అమరుడయ్యాడన్న వార్త తెలంగాణప్రజలను దుఃఖసముద్రంలో ముంచేసింది. విలాస్ మరణించిన రెండు సంవత్సరాలకు 2014 జూన్ 2 న తాను కలలుగన్న ప్రత్యేక తెలంగాణరాష్ట్రం ఆవిర్భవించింది. నేడు వినూత్న అభివృద్ధి పంథాతో దూసుకుపోతూ దశాబ్ది సంబురాలు జరుపుకుంటున్నది.

విలాస్‌కు భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వీరిలో చిన్నవాడు మాతృగర్భంలో ఉన్నప్పుడే విలాస్ మరణించాడు. అతనికి 'తెలంగాణ నాయక్' (టీజీనాయక్) అని పేరుపెట్టారు. ఐదుగురు పిల్లల్ని సాకుతూనే భర్తమరణంతో కుంగిపోయిన విలాస్ భార్య కవితాబాయి 2018 ఫిబ్రవరి 18న కన్ను మూసింది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ పిల్లలు అనాథలయ్యారు. దిక్కుతోచని స్థితిలో పిల్లలు 93ఏండ్ల తమ నానమ్మతో ఉంటున్నారు.



డా.సూర్యాధనుంజయ్
98491 04187
(వ్యాసకర్త:ప్రొఫెసర్ ఉస్మానియా యూనివర్సిటీ)

కలలు సాకారమౌతున్నవేళ...!

దశాబ్ద కాలం కింద మనం
కన్న కలలన్నీ సాకారమౌతున్న వేళ
అంకితభావంతో నీరు పల్లమెరుగు సామెతను
తిరుగరాసిన ధీశాలి ఎవరు?
అగాధాల్లో సాగిన నదులను
ఎగువకు పారించిన చైతన్యం ఎవరిది?
సస్యశ్యామల పంటలతో
కల్లం మురిసిపోవడానికి
కారణ భూతులెవరు?

రైతు దేశానికి జీవనాడియై
రైతుబంధువుగా నోటికి బుక్కెడు
బువ్వనందిస్తూనే ఉంటాడు
ఆడపిల్లలున్న తండ్రి
కల్యాణలక్ష్మితో మెరిసె
కండ్లతో ధైర్యంగా ఉండేందుకు
వెన్నుదన్నుగా ఉన్నదెవరు?

నిధులు నీళ్ళు నియామకాలు
భగీరథ, కాకతీయలతో
జలమయమైన మన పల్లెలు
సుజలధారలతో దాహాలను తీర్చి
ఎండాకాలంలో నిండుగా చెరువులు
మెరుపులీనె మత్స్య సంపద
పసిడి పంటల రాశుల వెనుక
ఎవ్వరి ఆలోచన యుక్తులున్నయ్!

సబ్బండ వర్ణాల స్వయం
ఉపాధికి మూలవిరాట్ ఎవరు?
కులమతాలకతీతంగా ప్రగతిపథంలోకి
మన బంగారు తెలంగాణ మార్పునకు
నడుం బిగించే నాయకులెవరు?
మార్పులు కనుల ముందు
ఒక్కొక్కటిగా నెరవేరుతుంటే
తెలంగాణ అమరవీరుల
కలలు సాకారమైనట్లే..

కలలు ఒక్కొక్కటిగా సాకారమౌతుంటే
దశాబ్ది ఉత్సవాలు శతాబ్ది ఒరవడికి
నాంది గీతం పాడుతున్నది
తెలంగాణ జాతిపిత
అపర చాణక్యుడు
మాన్యశ్రీ కేసీఆరే!!!



డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
85558 99493

అజరామరం.. మీ త్యాగం...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన త్యాగధనులకు వేల వేల వందనాలు... అరవై ఏండ్ల తెలంగాణ అస్తిత్వ ఉద్యమాలలో మీ పోరాటం, అమరం.. అజరామరం...మీ త్యాగం.. మీ త్యాగస్ఫూర్తి నిరూపమానం. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం మీరు చేసిన త్యాగం వెలకట్టలేనిది.

ప్రత్యేక తెలంగాణే లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించింది. రాష్ట్ర సాధనకోసం కేసీఆర్ నాయకత్వంలో అనేక రకాలుగా ఉద్యమం కొనసాగింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నా కేంద్రం స్పందించకపోవడంతో 'తెలంగాణ వచ్చుడో-కేసీఆర్ చచ్చుడో' అని గర్జించిన కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు కూర్చున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలతో సకల జనం రోడ్ల పైకి వచ్చారు. అనేక మంది ఆత్మబలిదానాలకు సిద్ధపడ్డారు. ఒక వైపు కేసీఆర్ దీక్ష.. మరో వైపు బిడ్డల ప్రాణాలు.. ఈ ధర్మ పోరాటంలో మన ఉద్యమానికి ఆనాటి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. కానీ సీమాంధ్రులు కుట్రలు పన్ని సమైక్య ఉద్యమాన్ని లేవనెత్తారు. దీంతో కేంద్రం వెనక్కుతగ్గింది. దీంతో కేసీఆర్ తిరిగి ఉద్యమానికి పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటం ఫలితంగా 2014 జూన్ 2న స్వరాష్ట్రం సిద్ధించింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు.

మలిదశ తొలి అమరుడు శ్రీకాంతాచారితో పాటు, పోలీస్ కిష్టయ్య, యాదిరెడ్డి, సువర్ణ, సిరిపురం యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, ఇషాంత్ రెడ్డి.. విలేకరి సునీల్, పావని, చింతకింది మురళి, రవీందర్, సుమలత... ఇలా ఎందరో తెలంగాణ బిడ్డలు రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత వారందరికీ ఘనంగా నివాళులు అర్పించేందుకు గాను హుస్సేన్‌సాగర్ తీరాన అమరజ్యోతిని ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. అమరుల త్యాగఫలితమే తెలంగాణ రాష్ట్రం అందుకే ఏ పని మొదలు పెట్టాలన్నా అమరులకే మొదటి వందనం.. నివాళులు అర్పించడం మన కర్తవ్యం. ఎందుకంటే అమరుల త్యాగం గొప్పది. వారి ఆశయాలను, ఆకాంక్షల్ని నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉన్నది.

అమరుల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పునర్నిర్మాణం జరుగుతున్నది. కాళేశ్వరంతో సాగునీటి రంగంలో విజయం సాధించింది. ఇతర ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. పచ్చని పంట పొలాలు పసిడి సిరుల పంటలతో ఆకుపచ్చ తెలంగాణగా అవతరించింది. అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ వర్ధిల్లుతున్నది. 90 వేల ఉద్యోగాల నియామకం తుది దశకు చేరుకున్నది. దళిత బంధు ద్వారా దళిత బిడ్డలకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. ఐటీ రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. మన ఆత్మగౌరవ నిలయం అంబేద్కర్ సచివాలయం. అంబేద్కర్ విగ్రహం. వీటి మధ్యనే ఆకాశానికే వెలుతురై నిలిచిన అమరుల స్మృతి చిహ్నం.. అమరుల స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు పోతున్నారు.

ప్రజ్వలించే అమరుల జ్యోతిగా, ఆకాంక్షలను, ఆత్మగౌరవాన్ని నిల్పి వందలాది మంది త్యాగధనుల బలిదానాల చరిత్ర స్మరించుకోవాలని మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆకాంక్ష. మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన పోరాట యోధుడు కేసీఆర్. ఆయన మస్తిష్కం నుండి పురుడు పోసుకున్నదే నేటి తెలంగాణ అమరవీరుల స్మృతి చిహ్నం. అమరుల త్యాగ స్ఫూర్తి దేదీప్యమానంగా వెలుగుతూ ఉండే అఖండ అమర దీపం... నిత్యం అమరులను మననం చేసుకుందాం..

తెలంగాణ అమర వీరులకు జోహార్లు! జోహార్లు...



చిటుకుల మైసారెడ్డి
94905 24724



గద్దెనెక్కాల్సింది ప్రజలు.. పార్టీలు కాదు

దేశానికి ఇప్పుడు కావాల్సింది ఒక పార్టీ గద్దె దిగటం.. ఒక పార్టీ గద్దెనెక్కడం కాదు. ప్రజలు గద్దెనెక్కాలి. వారి జీవితాలు మారాలి. అందుకు దేశం ఒక సామూహిక లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. క్రమశిక్షణతో, నియంత్రిత విధానంతో పురోగమించాలి. దేశాన్ని సరైన ప్రగతి పంథాలో నడిపించడానికి హైదరాబాద్ వేదికగా మారితే.. అది మన రాష్ట్రానికి గర్వకారణం.

స్వార్థంతో నిండిన రాజకీయాలను
శుద్ధిజేయగ పొద్దుపొడుపల్లె వస్తావా

స్వాతంత్ర్యపోరులో సత్యాగ్రహోద్యమం
చేపట్టిన గాంధీ మార్గాన వస్తావా

సీఎంగా ఉంటూనే జాతీయ సమరం

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉంటూనే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో

(నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి):

తెలంగాణ భూమి పుత్రుడు, రాష్ట్ర సాధకుడు, అభివృద్ధి ప్రదాయకుడు, నాలుగు కోట్ల ప్రజల ప్రియతమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరలోనే జాతీయ రాజకీయాల్లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. కేసీఆర్ నేతృత్వంలో, పోరుగడ్డ తెలంగాణ వేదికగా నూతన జాతీయ రాజకీయ పార్టీ అవతరించబోతున్నది. టీఆర్ఎస్‌లోని అత్యంత విశ్వసనీయ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అవి తెలియజేసిన సమాచారం ప్రకారం అధికారమే అంతిమంగా చేసే తంత్రాలకు. పదవులే

చట్టం చట్టుబండలైంది..
ఉన్మాద మూకలదే రాజ్యమైంది

పాలన పేరుతో ప్రత్యర్థులను వెంటాడుతున్నరు..
సంస్కరణ సాకుతో షావుకార్లను పోషిస్తున్నరు

వీధుల్లో కేంద్ర మంత్రుల వీరంగం..
రాజ్ భవన్లలో గవర్నర్ల తారంగం

దేశం పతనమైంది..
ద్వేషమే మతమైంది..
ప్రజాస్వామ్యం పరిహాసం
ఆర్థికవేత్తలు అపహాస్యం

పండించే రైతు కోసం కాదు.. పంచే ప్రధాని
బొమ్మ కోసం పంచాయితీ జరుగుతున్నది

75 ఏండ్ల స్వాతంత్ర్య వజ్రోత్సవం..
తాగునీళ్లకు గతిలేని జాతి జనం.. అకలి దప్పుల్లో
సమాజం.. అవకాశాలు లేని అంధకారం

ధరలు ఆకాశంలో..
ధైర్యం పాతాళంలో
ఏమవుతున్నదీ దేశం?
ఎన్నాళ్లీ చీకటి యుగం?

దేశ రాజకీయ ప్రాగ్ దిగంతాన
కొత్త సూర్యుడు ఉదయించబోతున్నడా?
కల్లోల జాతి కెరటాల మీది నుంచి మరో
అరుణోదయం దూసుకు రానున్నదా?
వింధ్య పర్వత శ్రేణులను దాటుకుని కొత్త వాణి
ప్రతిధ్వనించనున్నదా? వజ్రోత్సవ భారతి మరో
ప్రజాస్వామ్య ప్రాభవాన్ని ప్రభవించనున్నదా?
దేశం ఒక కొత్త నాయకుడి కోసం
ఎదురుచూస్తున్నదా?

ఉజ్వల భారత్ కోసం

- దేశం పిలిచింది!!

ఉద్యమ వీరుడు!

జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్ గ్రాండ్ ఎంట్రీ

- సీఎం సారథ్యంలో త్వరలో ప్రత్యామ్నాయ శక్తి
- కొత్త పార్టీ అవతరణ హైదరాబాద్ వేదికగానే
- తెలంగాణ గడ్డ నుంచే దేశం కోసం ఉద్యమం
- ముఖ్యమంత్రిగా ఉంటూనే దేశం కోసం యుద్ధం
- ఫ్రంట్‌లు, పొత్తులన్నీ పార్టీ ఏర్పాటు తర్వాతే
- అభివృద్ధి కోసం సమగ్ర ప్రత్యామ్నాయ ఎజెండా
- బడుగు బలహీన వర్గాలే కేంద్రంగా విధాన కల్పన
- తెలంగాణయే మాడల్.. టీఆర్ఎస్ వర్గాల వెల్లడి

11న హైదరాబాద్‌కు కుమారస్వామి రాక

ఇప్పటికే కేసీఆర్‌తో మేధావులు, ఆర్థికవేత్తల చర్చలు

అమరుల యాదిలో..

స్వరాష్ట్ర ఏర్పాటు నుంచి తెలంగాణ అమరవీరులకు అండగా రాష్ట్ర సర్కారు

ఆరు దశాబ్దాల పోరాటం.. ఎందరో అమరుల త్యాగఫలం.. కేసీఆర్ దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రజల ఆకాంక్ష సాకారమైంది. తమ చావుతోనైనా ప్రత్యేక రాష్ట్రం రావాలని ప్రాణాలర్పించిన బిడ్డల ఆశయాలు స్వరాష్ట్రంలో ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి.

ఆశయాల బాటలో

615 మంది కుటుంబాలకు ఆర్థికసాయం • కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగాలు

అమరుల స్ఫూర్తితో కేసీఆర్ సంక్షేమ పాలన • హర్షం వ్యక్తంచేస్తున్న అమరుల కుటుంబాలు

స్వరాష్ట్రంలో స్వపరిపాలన చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకవైపు అమరుల ఆశయాలను ఆచరణలో పెడుతూనే మరోవైపు త్యాగధనుల కుటుంబాలను అక్కున చేర్చుకొంటున్నారు. ఎప్పటికప్పుడు వారికి అండగా నిలుస్తున్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచేలా సుపరిపాలన సాగిస్తున్నారు. ఆది నుంచీ అమరుల త్యాగాలను తలుచుకొన్నాకే ఏ పనైనా మొదలెడుతున్నారు.

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఢిల్లీ నుంచి తొలిసారి 2014 ఫిబ్రవరి 28న హైదరాబాద్ గడ్డపై అడుగుపెట్టిన కేసీఆర్ నేరుగా గన్‌పార్క్‌లోని అమరుల స్థూపాన్ని సందర్శించి, ఘననివాళులర్పించారు. 2014 ఎన్నికల్లో గెలిచిన అనంతరం తిరిగి అమరుల స్థూపం వద్దకే వచ్చి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరమే పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. 'రాష్ట్ర సాధన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల కీర్తి అజరామరంగా నిలిచిపోతుంది. కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో అభ్యుదయం వైపు పయనిస్తాం, అభివృద్ధి సాధిస్తాం..అన్ని రకాలుగా బాగుపడతామని తెలంగాణ ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వ పాలన ప్రజలు కేంద్ర బిందువుగా.. ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా కొనసాగుతుందని నిండు మనసుతో ఈ సందర్భంగా తెలంగాణ సమాజానికి హామీ ఇస్తున్నాను. తెలంగాణా సమాజం అభ్యుదయం అంచులను ముద్దాడాలంటే ప్రభుత్వ పాలన ఉద్యమ పంథాలోనే పారదర్శకంగా కొనసాగాలనే కర్తవ్యాన్ని పరిపూర్ణంగా నేను స్వీకరిస్తున్నాను.' అంటూ సీఎం కేసీఆర్ వాగ్దానం చేయడమేకాదు తొమ్మిదేండ్లుగా అందులోని ప్రతి మాటనూ ఆచరణలో పెడుతుండడం గర్వకారణం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకమూ అమరుల ఆశయాలను ప్రతిఫలిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతి బడ్జెట్‌ను అమరులవీరుల స్థూపం వద్ద ఉంచి నివాళులర్పించిన తర్వాతే అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే అది పండుగైనా, మరే ఉత్సవమైనా, పథకమైనా ఏ కార్యక్రమాన్ని చేపట్టినా తొలుత అమరవీరులకు నివాళులు అర్పించడమే సంప్రదాయంగా కొనసాగిస్తున్నది. అమరుల స్ఫూర్తితో సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారు. వారి ఆశయాల బాటలో తెలంగాణ సర్కారు అద్భుత విజయాలు సాధిస్తున్నది. తమ బిడ్డల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ అభివృద్ధిని చూసి నేడు ప్రతి అమరుడి కుటుంబం మురుస్తున్నది.

615 మంది కుటుంబాలకు 10 లక్షల చొప్పన సాయం

స్వరాష్ట్రంలో పాలనాపగ్గాలు చేపట్టిన సీఎం కేసీఆర్ నాటి నుంచీ అమరుల స్ఫూర్తిని చాటుతుండడమేగాకుండా రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలను ఆదుకొంటున్నారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్లు 615 మందిని గుర్తించారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ. 61.50 కోట్ల సాయాన్ని అందజేశారు. అమరువీరుల కుటుంబాల్లో ఉన్నవారికి ఉద్యోగావకాశం కల్పించారు. అమరవీరుల పిల్లల ఆలనాపాలనా ప్రభుత్వమే చేపట్టింది. వారి అభీష్టం మేరకు చదివించే బాధ్యతలను కూడా ప్రభుత్వమే భూజానికెత్తుకున్నది. ఎంతో మంది అమరవీరుల కుటుంబాల పిల్లలను ఉన్నత చదువులు చదివించింది. ఆ కుటుంబాలకు సీఎం కేసీఆర్ ఇంటి పెద్ద దిక్కులా అండగా నిలిచారు.

జిల్లాలవారీగా సాయం

జిల్లా	కుటుంబాలు
నల్లగొండ	67
కరీంనగర్	188
ఖమ్మం	08
నిజామాబాద్	56
రంగారెడ్డి	38
మహబూబ్‌నగర్	21
హైదరాబాద్	22
ఆదిలాబాద్	27
మెదక్	64
వరంగల్	124
మొత్తం	**615**




భరత్ ఉంటే సంబురపడేటోడు

ప్రత్యేక రాష్ట్రం కోసం ఉవ్వెత్తున ఆందోళనలు, ఉద్యమాలు సాగుతున్నాయి. అందులో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సోమగాని భరత్ చురుగ్గా పాల్గొన్నాడు. తన చావుతోనైనా ఆంధ్రా నాయకులు, వారికి వత్తాసు పలుకుతున్న వారికి కనువిప్పు కలుగాలని లేఖ రాసి, 2013 మే 20న ఓయూ క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీకి ఎదురుగా ఉరేసుకొని ఆత్మబలిదానం చేసుకొన్నాడు.

సూర్యాపేట: కొడుకు మరణవార్త తెలుసుకొని అతడి తల్లిదండ్రులు సోమగాని కృష్ణ, సుజాత హతాశులయ్యారు. తెలంగాణ వచ్చి.. ఇంత అభివృద్ధి జరుగుతున్న సమయంలో తమ బిడ్డ ఉంటే ఎంత సంబురపడిపోయేవాడో అని నిత్యం యాదిజేసుకుంటున్నారు. 'కొడుకు చనిపోయి దిక్కులేని పక్షుల్లా అయిన మమ్మల్ని సీఎం కేసీఆర్ ఆదుకొన్నరు. రూ. 10 లక్షల సాయంజేసిన్రు. నా బిడ్డ జ్యోత్స్నకు సర్కారీ నౌకరీ ఇచ్చి.. కుటుంబాన్ని నిలబెట్టిన్రు. ఇయ్యాల తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతున్నది. అభివృద్ధి ఫలాలు అందరికీ దక్కుతున్నాయి. ప్రజలకు ఏ సమస్య రాకుండా, లేకుండా సీఎం కేసీఆర్ చేస్తున్నారు. అమరుల ఆశయాలు నెరవేరుతున్నయ్' అని భరత్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం నా అన్న ఎంతో ఆరాటపడ్డడు. తన చావుతోనైనా తెలంగాణ రావాలని ఆత్మబలిదానం చేసిండు. చనిపోయే ముందు నాకు చెల్లెలంటే ఇష్టమని, ఆమెను ఆదుకోవాలని ఉత్తరం రాసి జేబులో పెట్టుకొన్నడు. నా అన్న ఆఖరి కోరికను తెలంగాణ ప్రభుత్వం తీర్చింది. 2016 జూన్ 2న నాకు నల్లగొండ జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చింది. ఇప్పుడు సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. నా అన్న కల కన్నట్టు స్వరాష్ట్రంలో సంతోషంగా బతుకుతున్నా.' అని భరత్ సోదరి జ్యోత్స్న ఉద్వేగభరితంగా చెప్పింది.

రవీందర్ కల సాకారం





సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన పిట్ల రవీందర్ (రాజు) తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో చురుగ్గా పాల్గొన్నాడు. హైదరాబాద్‌లో చదువుకొంటున్న రవీందర్.. సకల జనుల సమ్మె తర్వాత బతుకమ్మ పండుగ కోసం సొంతూరికి వచ్చాడు. జోగిపేట తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో రవీందర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని 'జై తెలంగాణ' నినాదాలు చేస్తూ ఆత్మార్పణం చేసుకొన్నాడు.

అందోల్: అందోల్ గడ్డపై ఉద్యమ కాగడాను రగిలించాడు. రవీందర్ 2011 అక్టోబర్ 1న దవాఖానలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. చెట్టంత కొడుకు మృతితో తల్లి మంచంపట్టింది. విషాదంలో మునిగిపోయిన ఆ కుటుంబాన్ని స్వరాష్ట్రంలో తెలంగాణ సర్కారు అక్కున చేర్చుకొన్నది. రూ.10 లక్షల ఆర్థిక సాయంతోపాటు రవీందర్ సోదరుడు అనిల్‌కు ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం ఇచ్చింది. 'తమ్ముడు కోరుకున్న తెలంగాణ వచ్చింది. సీఎం కేసీఆర్ సుపరిపాలనలో అన్ని రంగాల్లోనూ ఎంతో అభివృద్ధి చెందుతున్నది. పదేండ్ల కిందటి తెలంగాణ.. ఇప్పటి తెలంగాణను పోల్చి చూస్తే ఎంతో మార్పు కనిపిస్తున్నది. పక్కరాష్ట్రాలు సైతం అసూయ పడేలా సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. నా తమ్ముడు బతికి ఉంటే ఎంతో సంతోషపడేవాడు. స్వరాష్ట్రంలో నా తమ్ముడి కల నెరవేరుతున్నది.' అని రవీందర్ సోదరుడు అనిల్ ఆనందంగా చెప్తున్నాడు.



అమరుడు నరేశ్.. తల్లి భూమమ్మ

నరేశ్ త్యాగం వృథా కాలే..

మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన భూమమ్మ, సిద్దయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. వారి చిన్న కుమారుడు ఓరగంటి నరేశ్ (18) మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న క్రమంలో తెలంగాణ రాదేమోననే బెంగతో 2012 డిసెంబర్ 31న ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మబలిదానం చేసుకొన్నాడు.

హవేళీఘనపూర్: ఎదిగివచ్చిన కొడుకును కోల్పోయిన ఆ తల్లిదండ్రులకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. ఆ కుటుంబానికి రూ. 10 లక్షల సాయం అందజేయడంతోపాటు నరేశ్ అన్న నర్సింలుకు రామాయంపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో వార్డెన్‌గా ఉద్యోగం ఇచ్చారు. ప్రభుత్వ సాయంతో భూమి, రెండు బర్రెలు కొనుక్కొని ఆ తల్లిదండ్రులు జీవనం సాగిస్తున్నారు. 'తెలంగాణ కోసం నా కొడుకు ప్రాణాలు వదిలిండు. కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మా కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయం చేసింది. నా చిన్న కొడుకుకు ఉద్యోగం ఇప్పించి నా కుమారుడు లేని లోటును తీర్చింది. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవిస్తున్నాం.' అని నరేశ్ తల్లి పేర్కొన్నది. 'మాకు సీఎం కేసీఆర్ అండగా నిలబడ్డరు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా మారింది. ఇవన్నీ చూ స్తుంటే నా తమ్ముడి త్యాగం వృథా కాలేదనిపిస్తున్నది' అని నరేశ్ అన్న నర్సింలు అన్నాడు.

మమ్మల్ని ఆదుకున్నది ఒక్క కేసీఆరే..



సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామానికి చెందిన కొండేటి వేణుగోపాల్‌రెడ్డి 2010 జనవరి 19 సాయంత్రం 4 గంటలకు ఒంటి మీద కిరోసిన్ పోసుకొని ఆత్మార్పణ చేసుకున్నారు. ఆయన మృతితో తెలంగాణ అంతటా ఆందోళనలు, ఉద్రిక్తలు పెరిగాయి.




పెన్‌పహాడ్: 'వేణుగోపాల్‌రెడ్డి మృతితో తెలంగాణ అంతటా ఆందోళనలు, ఉద్రిక్తలు పెరిగాయి. కొండేటి ప్రాణ త్యాగం వృథాకానివ్వకుండా తెలంగాణ సాధించుకొని తీరుతామని ప్రతినబూనారు. కానీ, కుటుంబాన్ని ఎవరూ ఆదుకోలేదు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం నా కొడుకు ఆత్మత్యాగానికి పాల్పడ్డాడే తప్ప ఆత్మహత్య చేసుకోలేదు. అయితే, శవం మీద ప్రమాణాలు చేసిన నాయకులెవరూ మమ్మల్ని ఆదుకోలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకనే మాకు న్యాయం జరిగింది. అమరుల కుటుంబాలను అన్ని తీర్ల ఆదుకుంటున్నడు. నేడు తెలంగాణ ప్రజల సంతోషంలో నా కొడుకు వేణుగోపాల్‌రెడ్డిని చూసుకుంటున్నా' అని వేణుగోపాల్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ కంటతడి పెడుతూ చెప్పారు. 'నా కొడుకు తెలంగాణ కోసం నిలువునా కాలిపోయిండు.. 'కాలి మాడిపోయిన నా కొడుకు జీవితం తెలంగాణకు వెలుగులు ఇచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం మంచిగ అయితున్నది. సీఎం కేసీఆర్ నాకు 10 లక్షల రూపాయలు ఇచ్చిండు. నా చెల్లె కొడుకుకు ఉద్యోగం ఇచ్చిండు'అంటూ చెప్పుకొచ్చింది.



నెరవేరిన యాదయ్య ఆశయం

'తెలంగాణ రాష్ట్రం కోసం నేను చచ్చిపోతున్నా.. తెలంగాణ ఉద్యమంలో ఇదే చివరి బలిదానం కావాలి'.. అంటూ 2010 ఫిబ్రవరి 21న ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు దగ్గర ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మార్పణ చేసుకున్నారు సిరిపురం యాదయ్య.

రంగారెడ్డి: యాదయ్యది రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామం. యాదయ్య మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు కుటుంబంలో ఓ వైపు ఆనందం.. తన తమ్ముడు పోయాడనే ఆవేదన ఉండేదని అంటున్నాడు యాదయ్య సోదరుడు సిరిపురం మహేశ్. తమ కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారని చెప్తున్నాడు. రూ. 10 లక్షలు ఆర్థిక సాయం అందజేయడంతోపాటు తనకు బీసీ హాస్టల్‌లో కొలువు ఇచ్చి కుటుంబానికి ధైర్యం ఇచ్చారని ఆనందం వ్యక్తంచేస్తున్నాడు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ చేస్తామని చెప్పినవన్నీ చేసి చూపిస్తున్నరు. హామీ ఇవ్వని పనులుగూడ జేస్తున్నరు. స్వరాష్ట్రంలో నా తమ్ముడి ఆశయాలు నెరవేరుతున్నయ్.' అని మహేశ్ తెలిపాడు. అందరూ నన్ను సిరిపురం యాదయ్య అన్న అని అంటుంటే గర్వంగా ఉంది. కేసీఆర్ సార్ పుణ్యమాని అని నా ఇద్దరు పిల్లలను బాగా చదివిస్తున్న.



కానిస్టేబుల్ కిష్టయ్య కలలు నెరవేరినయ్

కానిస్టేబుల్ కిష్టయ్య (పుట్టకొక్కుల కిష్టయ్య)ది కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలకు తీవ్ర కలత చెందాడు. మాచారెడ్డి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ 2009 డిసెంబర్ 1న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మ బలిదానం చేసుకొన్నారు.



కరీంనగర్: ప్రత్యేక రాష్ట్రం కోసం అమరుడైన కిష్టయ్య కుటుంబాన్ని తెలంగాణ సర్కారు అక్కున చేర్చుకొన్నది. ఆ కుటంబం కల నెరవేర్చి అండగా నిలిచింది. తెలంగాణ సర్కారు సహకారంతో డాక్టర్ అయిన ఆయన కూతురు ప్రియాంక, ఉద్యోగాలు పొందిన భార్య పద్మావతి, కుమారుడు రాహుల్ కేసీఆర్ పాలనపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. తమలాగే తెలంగాణ అమరుల కుటుంబాలు చాలా సంతోషంగా ఉన్నాయని ప్రియాంక, భార్య పద్మావతి చెప్తున్నారు. 'సీఎం సర్ ఇచ్చిన ప్రోత్సాహం, ఆర్థిక సహాయంతోనే నేను డాక్టర్ కాగలిగాను. నాన్న చనిపోయిన నాటి నుంచే కేసీఆర్ సార్ మా కుటుంబానికి అండగా నిలబడ్డారు.' అని ప్రియాంక చమర్చిన కళ్లను తుడుచుకొంటూ చెప్పింది. 'నా భర్త చనిపోయినప్పుడు చాలా బాధపడ్డ. మొదటిసారి కేసీఆర్ సార్‌ను కలిసినప్పుడు తను కూడా చాలా బాధపడ్డరు. ఆయన ఆశయం వృథా పోనీయమని ఆనాడే అన్నరు. ఇప్పటి వరకు కేసీఆర్ సార్ అదే మాట మీద ఉన్నరు. మా కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నరు. నాకు, నా కొడుకు రాహుల్‌కు ఉద్యోగం ఇచ్చిన్రు. మా పిల్లలు తమ కాళ్ల మీద తాము నిలబడ్డరు అంటే అందుకు కారణం కేసీఆర్ సారే' అని కిష్టయ్య భార్య పద్మావతి తెలిపారు. తమలాంటి అమరుల కుటుంబాలకు అండగా నిలువడమే గాదు.. తెలంగాణను సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు.

తీరిన తిరుమలేశ్ కోరిక

తన చావుతోనైనా తెలంగాణ రావాలని.. తెలంగాణ వస్తే తనలాంటి వారందరికీ ఉద్యోగాలొస్తాయని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడకు చెందిన నరాల తిరుమలేశ్ 2010 మార్చి 24న ఆత్మబలిదానం చేసుకొన్నాడు.



ఇబ్రహీంపట్నం: తిరుమలేశ్ మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అయితే, త మకు రూ.10 లక్షల సాయంతోపాటు రెండో కొడుకు అజయ్‌కుమార్‌కు ఉద్యోగం ఇచ్చి తెలంగాణ సర్కారు ఆదుకొన్నదని తి రు మలేశ్ తల్లి నరాల వీరమణి పేర్కొన్నది. కడుపులో దుఃఖం ఉన్నా.. స్వ రాష్ట్రంలో తనబిడ్డ కల నెరవేరినందుకు ఆనందంగా ఉన్నదని అంటున్నది. తెలంగాణ వస్తేనే తనలాంటోళ్లకు కొలువు లు వస్తయని తిరుమలేశ్ అంటుండే. కొడుకుని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిపోయిన మాకు సీఎం కేసీఆర్ అండగా నిలిచిన్రు. తెలంగాణ అచ్చినంక నా కొడుకు కోరుకున్నట్టే ఎంతో మందికి కొలువులు అచ్చినయ్. నా కొడుకు కోరిక నెరవేరింది.' అని తిరుమలేశ్ తల్లి వీరమణి తెలిపింది.

నేటి తెలంగాణ జూసి యాదిరెడ్డి మురిసేటోడు

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన మందడి నర్సింహారెడ్డి, చంద్రమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిది నిరుపేద వ్యవసాయ కుటుంబం. చంద్రమ్మ ఆకుకూరలు అమ్ముతూ పిల్లలను పోషించుకొన్నది. యాదిరెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితుడైండు. ఎక్కడ ఉద్యమం జరిగితే అక్కడికి వెళ్లిపోయేవాడు. సమైక్యపాలకులు తెలంగాణ రాకుండా అడ్డుకొంటున్నారని మనస్తాపానికి గురయ్యాడు. తెలంగాణ ఉద్యమంవైపు దేశం చూపు పడాలని ఢిల్లీకి వెళ్లి పార్లమెంటు భవనం ముందు చెట్టుకు ఉరేసుకొన్నడు.



రంగారెడ్డి: యాదిరెడ్డి చావుతో తెలంగాణ ఉద్యమం దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలు తీసుకొన్న యాదిరెడ్డి కుటుంబానికి స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. ఆ కుటుంబానికి రూ. 10 లక్షల సాయం చేశారు. యాదిరెడ్డి సోదరుడు ఓంరెడ్డికి ఉద్యోగం ఇచ్చారు. 'నా కొడుకు తెలంగాణ కోసం ప్రాణాలు తీసుకొన్నడు. చెట్టంత కొడుకు చనిపోయి దిక్కులేని స్థితిలో ఉన్న మాకు సీఎం కేసీఆర్‌సారు అండగా నిలిచిండు. రూ. 10 లక్షల ఆర్థిక సాయం చేయగా, ఆ పైసలతోటి నా కొడుకు పేరుమీద భూమి కొనుక్కొన్న. నా చిన్న కొడుకుకు ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని నిలబెట్టిండు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అందరికీ అన్ని సౌలతులు జేస్తుండు. అందరినీ ఆదుకొంటున్నడు. ఇప్పుడు ఇంత డెవలప్ అయిన తెలంగాణను చూస్తే నా కొడుకు ఎంత మురిసేటోడు. నా కొడుకు కోరుకున్నట్టే తెలంగాణల అందరూ సంతోషంగా ఉన్నరు.' అని యాదిరెడ్డి తల్లి చంద్రమ్మ పేర్కొంటున్నది.



ఛాలెంజింగ్ ఛేజింగ్

ఎక్స్‌ట్రాక్షన్-2

నెట్‌ఫ్లిక్స్: జూన్ 16
తారాగణం: క్రిస్ హెమ్స్‌వర్త్, ఓల్గా కుర్లింకో, గోల్ షిఫ్టె తదితరులు
దర్శకత్వం: సామ్ హార్‌గ్రేవ్

చేజింగ్ థ్రిల్లర్ సినిమాలు ఇష్టపడని వాళ్లుండరు. సస్పెన్స్ ఎలిమెంట్స్ పూర్తిస్థాయిలో పండకపోయినా.. కండ్లుచెదిరే ఫీట్లు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. క్రిస్ హెమ్స్‌వర్త్ నటించిన ఎక్స్‌ట్రాక్షన్-2 ఈ తరహా చిత్రమే! ఎక్స్‌ట్రాక్షన్-1కి మంచి మైలేజీ రావడంతో దానికి కొనసాగింపుగా ఈ చిత్రం నిర్మితమైంది. ఇటీవల ఓటీటీలో విడుదలైన ఈ సినిమా రికార్డ్ స్ట్రీమింగ్ నమోదుచేస్తున్నది. కథలోకి వెళ్తే ట్రైలర్ రేక్ (క్రిస్ హెమ్స్‌వర్త్) మంచి ఆఫర్ ఇస్తే ఎలాంటి రెస్క్యూ ఆపరేషన్లు అయినా చేస్తాడు. అంతకుముందు జరిగిన ఒక ఆపరేషన్‌లో చావు అంచుల వరకు వెళ్తాడు రేక్. కొన ప్రాణాలతో ఉన్న అతణ్ని స్నేహితులు కాపాడతారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మరో రెస్క్యూ ఆపరేషన్ వస్తుంది. జార్జియాలో మాఫియా డాన్ తమ్ముడు జైలులో ఉంటాడు. శిక్ష పడిన ఖైదీ అయినప్పటికీ సకల సౌకర్యాలూ అనుభవిస్తుంటాడు. తనతోపాటు భార్యాపిల్లలను అక్కడే బందీలుగా ఉంచుకుంటాడు. అతని భార్యాపిల్లలను జైలు నుంచి కాపాడే పని ఒప్పుకొంటాడు రేక్. ఈ ఆపరేషన్‌ను రేక్ పూర్తి చేశాడా, లేదా? అన్నది మిగిలిన కథ!

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | ఆదివారం 25 జూన్ 2023 www.ntnews.com





'ఈ పదేండ్ల కాలంలో తెలంగాణ అద్భుతమైన అభివృద్ధిని సాధించింది. ప్రతి రంగంలోనూ ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప సంకల్పంతో బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తున్నారు' అంటున్నారు ప్రముఖ నటుడు, నిర్మాత మురళీమోహన్. సినీ రంగంలో యాభై ఏండ్లుగా అలుపెరుగని ప్రయాణాన్ని సాగిస్తున్నారాయన. రాజకీయ, వ్యాపార రంగాల్లోనూ అనేక విజయాలు సొంతం చేసుకున్నారు. మృదుస్వభావిగా, అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా సంభాషించారు మురళీమోహన్. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2014 - 2023

ఇంత ప్రగతి.. ఊహించ లేదు

నా చిన్నతనంలో మా నాన్నగారు ఆదిలాబాద్ జిల్లాలో ఫారెస్ట్ కాంట్రాక్టర్‌గా పనిచేసేవారు. సెలవు రోజుల్లో నేను కూడా ఆదిలాబాద్ వెళ్లేవాణ్ని. అలా బాల్యం నుంచే నాకు తెలంగాణతో అనుబంధం ఏర్పడింది. ఆ బంధం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ ప్రజల చిరకాల కోరిక. ఉమ్మడి రాష్ట్రంలో కొందరు నాయకులు తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టినా, మధ్యలోనే కాడి వదిలేశారు. గమ్యం వరకూ తీసుకెళ్లలేకపోయారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టినప్పుడు ఆయన ప్రత్యేక తెలంగాణ తీసుకొస్తాడనే నమ్మకం నాతోపాటు చాలామందికి ఉండేది కాదు. 'ఈ బక్క ప్రాణం రాష్ట్రాన్ని ఏం సాధిస్తాడు?' అని అనుమానించారు. కానీ కేసీఆర్ చక్కటి కార్యదక్షతతో, అద్భుతమైన ప్రణాళికతో ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఆయన ప్లానింగ్ ఎలా ఉంటుందో నేను బాగా గమనిస్తూ ఉండేవాణ్ని. కేసీఆర్ పట్టుదల, అకుంఠిత దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ నేరవేరింది.

పంజాబ్‌తో పోటీ

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓసారి నేను 'ఆంధ్రప్రదేశ్ డెల్టా ఏరియా.. పంటలు బాగా పండుతున్నాయి. మరి తెలంగాణలో నీళ్లు ఎందుకు రావు?' అని అడిగాను. అప్పుడాయన 'సముద్రమట్టం కంటే తెలంగాణ ఎత్తులో ఉంటుంది కాబట్టి గోదావరి, కృష్ణా నీళ్లు తీసుకురావడం కష్ట'మని చెప్పారు. 'ఆంధ్రా భూభాగం నదికి సమాంతరంగా ఉండటం వల్ల నీళ్లు ఇవ్వడం సులభం' అన్నారు. 'తెలంగాణకు నీళ్లు తీసుకురావాలంటే అంచెలంచెలుగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఎత్తిపోసి రిజర్వాయర్స్ నింపాలి. ఇదంతా చాలా ఖర్చుతో కూడుకున్నది, కరెంట్ బిల్లు కూడా చాలా ఉంటుంద'ని లెక్కలు చెప్పారు. కానీ స్వరాష్ట్రం సాధించిన తరువాత, కేసీఆర్ తెలంగాణను డెల్టా ప్రాంతంలా చేయాలని సంకల్పించారు. ఎంత ఖర్చయినా వెనుకంజ వేయలేదు. 'మా నీళ్లు మాకు కావాలి.. మా పంటలు మేం పండించుకోవాలి. మేం నలుగురికి పెట్టేలా ఉండాలి కానీ, దిగుమతి చేసుకునే స్థితిలో ఉండకూడదు' అనే సంకల్పంతో ఇరిగేషన్ ప్రాజెక్టులకు అద్భుత రీతిలో రూపకల్పన చేశారు. కాబట్టే, ఈ రోజు తెలంగాణలో చెరువులు, కుంటలు నీళ్లతో కళకళలాడుతున్నాయి. రిజర్వాయర్స్ జలకళను సంతరించుకున్నాయి. ఫలితంగా పంటలు బాగా పండుతున్నాయి. ఇంతకుముందు తెలంగాణలో వరి తక్కువగా పండేది. కానీ నేడు వరి అత్యధికంగా పండే పంజాబ్‌తో పోటీపడుతున్నది. ఇప్పుడు తెలంగాణలో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతున్నది. కరెంటు విషయంలో కూడా మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉన్నది.

ఐటీలో నెంబర్‌వన్

ఐటీ రంగంలోనూ తెలంగాణ దూసుకుపోతున్నది. మంత్రి కేటీఆర్ అంకితభావంతో పని చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇండియాలోనే నెంబర్‌వన్ అవుతుందనే నమ్మకం ఉంది. తెలంగాణకు ఎన్నో బహుళజాతి సంస్థలు వస్తున్నాయి. కేటీఆర్ దావోస్, యూకే, యూఎస్ వెళ్లి మరీ తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. హైదరాబాద్‌కు తరలి వస్తే అన్ని సదుపాయాలూ కల్పిస్తామంటూ పారిశ్రామికవేత్తలను మెప్పిస్తున్నారు. పరిశ్రమల వల్ల ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం కూడా మూడు పువ్వులు-ఆరుకాయలుగా విరాజిల్లుతున్నది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలోనూ ఇంత రియల్ ఎస్టేట్ బూమ్ లేదు. కొత్త పరిశ్రమలతోపాటు అవుటర్ రింగ్ రోడ్డు కూడా ఈ విజయానికి ముఖ్య కారణం. ఇక్కడి భూమి కూడా ఎంతో గట్టిది. అందుకే మాలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధైర్యంగా నాలుగైదు అండర్‌గ్రౌండ్ సెల్లార్లు కట్టుకుంటున్నారు.

న్యూయార్క్‌లా మారింది

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను కలుపుతూ అవుటర్ రింగ్ రోడ్డు వేయడం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంది. చాలా తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఎన్నో కొత్త ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు వెలిశాయి. ఈరోజు హైదరాబాద్‌ను చూస్తుంటే న్యూయార్క్ నగరంలా కనిపిస్తున్నది. ఈ విషయంలో మనమంతా గర్వపడాలి. కేటీఆర్ లాంటి కొడుకు, కవిత లాంటి కూతురు, హరీశ్‌రావు లాంటి మేనల్లుడు ఉండటం నిజంగా కేసీఆర్ అదృష్టం. ఈ ముగ్గురూ అద్భుత ప్రతిభావంతులే. అన్ని భాషలూ మాట్లాడతారు. అసెంబ్లీ మొదలుకొని పార్లమెంట్ వరకు ఎక్కడైనా తమ ప్రసంగాలతో ఆకట్టుకుంటారు. ఏ రాష్ట్రానికైనా కావలసింది ఇలాంటి సమర్థ నాయకత్వమే.

...✍ మధూరి మధు

టిక్‌టాక్‌లో పుట్టి.. యూట్యూబ్‌తో జట్టుకట్టి.. తాజాగా వెబ్‌సిరీస్‌లతో అదరగొడుతున్నది అనన్య శర్మ. ఈ వరంగల్ అమ్మాయి సినీతారగా ఓ వెలుగు వెలగడమే తన లక్ష్యం అంటున్నది. ఆమె నటించిన వెబ్‌సిరీస్ 'అర్థమైందా అరుణ్‌కుమార్' ఆహాలో ఈ నెల 30 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా అనన్య శర్మ 'జిందగీ'తో పంచుకున్న సంగతులు..

అర్థమైందా మీకు..!

సినిమాలంటే నాకు చాలా ఇష్టం. అంతమాత్రాన యాక్టర్ అయిపోతానంటే కుదురుతుందా? చూడటం వేరు, అందులో నటించడం వేరు! ఇంటర్‌లో ఉన్నప్పుడే నటనపై ఆసక్తి ఏర్పడింది. వన్ ఫైన్ మార్నింగ్ అమ్మతో 'నేను యాక్టర్ అవుతా' అని చెప్పాను! అమ్మ ఆశ్చర్యపడింది. 'ముందు చదువుపై శ్రద్ధ పెట్టు' అన్నది. ఆ క్షణం కాస్త చిన్నబుచ్చుకున్నా.. అమ్మ మాటలోనూ నిజం ఉందనిపించింది. పైగా అమ్మానాన్నా ఇద్దరూ లెక్చరర్లే. నాన్న రమేశ్ శర్మ కెమిస్ట్రీ లెక్చరర్. అమ్మ ప్రగతి జువాలజీ అధ్యాపకురాలు. ఒక్కగానొక్క కూతుర్ని నేను. గారాబం చేసేవారు. అలాగని చదువు దగ్గర నిర్లక్ష్యం చేస్తే ఒప్పుకొనేవారు కాదు.



క్యాంపస్‌లో బీజం

చెన్నైలో ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు.. కాలేజ్‌లో డ్రామా క్లబ్ ఉండేది. అక్కడే నటనలో ఓనమాలు దిద్దుకున్నాను. నాలుగేండ్ల ఇంజినీరింగ్‌లో క్యాంపస్‌లో ఉన్నది రెండేండ్లే! మిగిలిన రెండు సంవత్సరాలనూ కొవిడ్ కాజేసింది. అలా ఇంజినీరింగ్ స్టూడెంట్ లైఫ్ సగమే ఎంజాయ్ చేశాను. అయితే, ఆన్‌లైన్ క్లాసులు కావడంతో ఫ్రీ టైమ్ ఉండేది. క్యాంపస్‌లో నేర్చుకున్న నట విన్యాసాలన్నీ ప్రదర్శించడానికి టిక్‌టాక్‌ను వేదికగా ఎంచుకున్నా. రెగ్యులర్‌గా రీల్స్ చేస్తుండేదాన్ని. నటనపై సీరియస్‌గా ఉన్నానని అమ్మావాళ్లకు కూడా అర్థమైంది.

వయా యూట్యూబ్

నటనను కెరీర్‌గా మలుచుకోవడానికి షార్ట్‌ఫిల్మ్ దగ్గరి దారి అనిపించింది. అయితే, ఎవరిని అప్రోచ్ అవ్వాలో తెలిసేది కాదు. అప్పుడు నా క్లాస్‌మేట్ హర్షిత్‌రెడ్డి గుర్తుకొచ్చాడు. చాయ్‌బిస్కెట్ యూట్యూబ్ చానెల్‌తో అసోసియేట్ అయ్యాడని తెలిసింది. అతణ్ని సంప్రదిస్తే విలువైన సలహాలు ఇచ్చాడు. అదే సమయంలో వాళ్లు 'బ్రదర్ అండ్ సిస్టర్' షార్ట్ ఫిల్మ్ తీస్తున్నారు. ఆడిషన్ చేసి నన్ను సిస్టర్ పాత్రకు ఎంచుకున్నారు. అలా నా మొదటి షార్ట్‌ఫిల్మ్ యూట్యూబ్‌కెక్కింది. ఆ వెంటనే '30 వెడ్స్ 21' వెబ్‌సిరీస్‌లో హీరోయిన్ చాన్స్ వచ్చింది. విభిన్నమైన మనస్తత్వం ఉన్న పాత్ర అది. దర్శకుడు పృథ్వీ, అతని టీమ్ సహకారంతో ఆ క్యారెక్టర్‌ను సమర్థంగా పోషించాను. ఇంట్లోవాళ్లు, ఫ్రెండ్స్.. అందరూ సంతోషించారు. ఈ ఆనందంలో ఉండగానే 'లాలీపాప్' సాంగ్ నన్ను మరింత వైరల్ చేసింది. తాజాగా 'ఆహా' ఓటీటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రేక్షకులను పలకరిస్తున్నందుకు థ్రిల్‌గా ఫీలవుతున్నా. 'అర్థమైందా అరుణ్‌కుమార్'లో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. దీన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా. ఫీమేల్ లీడ్ క్యారెక్టర్లు, సూపర్ ఉమెన్ పాత్రలు చేయాలని ఉంది.

జోన్స్ నయా జోష్



ఇండియానా జోన్స్ మరో అడ్వెంచర్‌కు సిద్ధమవుతున్నాడు. తన అభిమానులను అలరించడానికి దాదాపు పదిహేనేండ్ల తర్వాత సెల్యులాయిడ్ స్క్రీన్‌పైకి మళ్లీ వస్తున్నాడు. 1981లో మొదలైన జోన్స్ సాహస యాత్ర హాలీవుడ్‌లో అప్పట్లో రికార్డులు సృష్టించింది. ఈ ఫ్రాంచైజీలో ఐదో సినిమాగా నిర్మితమైన 'ఇండియానా జోన్స్ అండ్ డయల్ ఆఫ్ డెస్టినీ' ఈ నెల 30న ప్రేక్షకులను పలకరించనుంది. మొదటి నాలుగు సినిమాలకు స్టీవెన్ స్పీల్‌బర్గ్ దర్శకత్వం వహిస్తే, తాజా చిత్రానికి జేమ్స్ మ్యాన్‌గోల్డ్ డైరెక్టర్‌గా వ్యవహరించాడు. స్పీల్‌బర్గ్ స్థాయిలో కాకపోయినా ఆయన మెచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దామని చెబుతున్నాడు దర్శకుడు జేమ్స్. మరోవైపు ఈ సిరీస్‌లో మొదటి భాగం నుంచి హీరోగా నటిస్తున్న హారిసన్ ఫోర్డ్ తాజా చిత్రంలోనూ కథానాయకుడిగా కనిపిస్తున్నాడు. 80 ఏండ్ల హారిసన్ ఎలాంటి సాహసాలు చేశాడో చూడాలని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. నయా సినిమా వస్తున్న నేపథ్యంలో ఇండియానా సిరీస్‌లో రూపొందిన నాలుగు చిత్రాలు ఓటీటీ వేదిక డిస్నీ హాట్‌స్టార్‌లో గత నెల 31 నుంచి స్ట్రీమింగ్ అవుతున్నాయి. జోన్స్ అభిమానులంతా వాటిని చూసే పనిలో బిజీగా ఉన్నారు. ఎనిమిది పదుల జోన్స్ గత చిత్రాల్లోని తన పాత్రను మరిపిస్తాడో లేదో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే!!



బాధ్యతతో కూడిన వరం

Sonam Kapoor

పెండ్లితో సినిమాల్లో జోరు తగ్గించిన సోనమ్ కపూర్ కొడుకు పుట్టాక కెరీర్‌కు కామా పెట్టింది. మళ్లీ మరో ఇన్నింగ్స్‌కు సిద్ధపడుతున్న సోనమ్ పదినెలలుగా తన కొడుకుతో ప్రతిక్షణాన్ని అద్భుతంగా ఆస్వాదించానని చెప్పుకొచ్చింది. 'ప్రతి మహిళకూ అమ్మతనం బాధ్యతతో కూడిన వరం. మాతృత్వాన్ని ఎంజాయ్ చేయాలంటే కొన్ని సవాళ్లు కూడా స్వీకరించాల్సి ఉంటుంది. తను తినే ఆహారం గురించి కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ఎందుకంటే, జిహ్వాచాపల్యం కొద్దీ ఏదేదో తినేస్తే, తల్లి పాలు తాగే పిల్లాడికి ఏదైనా సమస్య రావచ్చు. అందుకే, అనుక్షణం తను జాగ్రత్తగా ఉంటూ, పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి' అని అమ్మగా తను తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించింది సోనమ్. తల్లయిన నటికి సినిమాల్లో అవకాశాలు తగ్గిపోతాయన్న వాదన అర్ధసత్యం అంటున్నదామె. 'సినిమాల్లో మాత్రమే కాదు, బయట ఏ రంగం తీసుకున్నా మహిళలు సత్తా చాటుతున్నారు. మల్టీటాస్కింగ్‌లో ఆడవాళ్లు అగ్గిపిడుగులే! ఏకకాలంలో నాలుగైదు పనులు చక్కబెట్టగలరు. అయితే, గర్భిణిగా నెలలు నిండే క్రమంలో, తల్లయిన కొత్తలో ఆమె వేగం తగ్గవచ్చు. అంతమాత్రానికే స్త్రీ శక్తిసామర్థ్యాలు సన్నగిల్లినట్టు కాదు' అని ఇండస్ట్రీలో తన పని అయిపోయిందని కామెంట్ చేసినవారికి కౌంటర్ ఇచ్చింది.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY | 22.6.2023 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+16/12 Pages: 16+16/12 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 17 వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది...

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

శుక్రవారం FRIDAY 23.6.2023 NAMASTE TELANGANA

అమర జ్యోతి
అఖండ స్ఫూర్తి





బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పదేండ్లలో వందేండ్లకు ప్రగతి బాట



బండి పల్లవి
91822 11810

ఉద్యమ తెలంగాణ ఉజ్వల తెలంగాణగా మారుతుందనడానికి దేశ, విదేశీ సంస్థల గుర్తింపులు, కితాబులే ప్రామాణికం. స్వయంపాలనలో జోడెద్దుల్లాంటి అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తయితే పదేండ్లలోనే వందేండ్ల శాశ్వత నిర్మాణాలతో తెలంగాణ తనకు తానుగా పునర్నిర్మింపబడుతుండటం గొప్ప విషయం. దశాబ్దిలోకి అడుగుపెట్టిన సందర్భంలో ఒకసారి నాటి తెలంగాణ చేదు గురుతులను మననం చేసుకుంటే దుఃఖం ఆగదు. బీడువారిన పొలాలు, పొక్కిలైన నేలలు, నెర్రెలువారి కండ్లళ్లకెళ్లి నెత్తురువారిన తెలంగాణ పల్లెల దుస్థితి తెలియంది కాదు. స్వరాష్ట్రం సిద్ధించాక కేవలం తొమ్మిదేండ్లలో తెలంగాణ రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి.

తెలంగాణ రాష్ట్రమొస్తే సంక్షోభాల కుంపట్లు రాజుకుంటాయని, అసలు పాలనే చేతకాదని, చిమ్మని చీకట్లుంటాయని అవహేళన చేసినవాళ్లే ఇవాళ తెలంగాణ నవ నిర్మాణాలు చూసి కితాబులిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పరాయి నుంచి స్వయంపాలన ప్రస్థానాన్ని తీసుకుంటే ఇవాళ తెలంగాణ రీ ఇన్నోవేషన్, రీ కన్‌స్ట్రక్షన్ దిశగా దూసుకుపోతున్నది. కేసీఆర్ పాలన వందేండ్లకు పైగా గుర్తుండేవిధంగా తెలంగాణలో నవ నిర్మాణాలు అద్దం పట్టడంతో పాటు తెలంగాణ ఖ్యాతి ప్రపంచవ్యాప్తమవుతున్నది. తాజాగా రాష్ట్రంలోని నిర్మాణాలకు ఐదు అంతర్జాతీయ అవార్డులు లభించడమే దీనికి కొలమానం. లండన్‌కు చెందిన గ్రీన్ ఆర్గనైజేషన్ 2023కి గాను ప్రకటించిన గ్రీన్ యాపిల్ అవార్డులను వివిధ విభాగాల్లో యాదాద్రి ఆలయం సహా ఐదు నిర్మాణాలు దక్కించుకున్నాయి.

కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గొడగొడ ఏడ్చిన గోదావరిని చేరదీసి సాగునీటి రంగంలో తొలి విజయాన్ని సాధించింది. తెలంగాణ నీటిపారుదల రంగం దుర్భర స్థితిని గుండెల నిండా దాచుకున్న కేసీఆర్ తొలిదశలో సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రపంచంలో అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రికార్డు సమయంలో నిర్మించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సముద్ర మట్టం నుంచి 618 మీటర్ల ఎత్తుకు గోదావరి జలాలు ఎత్తిపోస్తున్నాయి. 45 లక్షల ఎకరాల్లో రెండు పంటలకు సాగునీరందిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ ఇంజిన్‌గా మారింది.



శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకానికి సైతం కాళేశ్వరం జలాలను ఉపయోగిస్తున్నారు. ఏడెండ్లలో పది పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయగా, తెలంగాణ ఏర్పాటు తర్వాత కాళేశ్వరం, చనఖా-కొరాటా, సమ్మక్క, భక్తరామదాసు, తుమ్మిళ్ల బారేజీలను పూర్తిచేసింది. ఇక పాలమూరు-రంగారెడ్డి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పది జిల్లాలకు తోడు మరో 23 కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి, జిల్లాల సంఖ్యను 33కు పెంచింది. దీంతో చిన్న జిల్లాలతో రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన సాగుతున్నది. ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్లకు సమీకృత భవనాలను నిర్మించింది. రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 43 నుంచి 74 వరకు, మండలాల సంఖ్యను 459 నుంచి 612 వరకు, గ్రామ పంచాయతీల సంఖ్యను 12,769 వరకు పెంచింది.

తెలంగాణ అన్నిరంగాల్లో దార్శనికతతో ముందుకుపోతున్నదనడానికి సచివాలయ నిర్మాణం అద్దం పడుతున్నది. 28 ఎకరాల విస్తీర్ణంలో 2.5 ఎకరాల్లో భవనాన్ని అత్యాధునిక హంగులు, సౌకర్యాలతో నిర్మించిన సచివాలయం 26 నెలల రికార్డు సమయంలో పూర్తికావడం విశేషం.

నూతన సచివాలయాన్ని ప్రారంభించుకున్న రెండు నెలల్లోనే తెలంగాణకు 'లండన్ గ్రీన్ అవార్డు' దక్కడం గర్వించదగిన విషయం. దేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడుకున్న మొదటి పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో నిర్మించింది. అదేవిధంగా ఎనిమిది దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన మొజంజాహీ మార్కెట్ హైదరాబాద్‌కు ఐకానిక్ మార్కెట్‌గా పేరొందింది. ఈ మార్కెట్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం రూ.15 కోట్లతో ఆధునీకరించింది. ఇక దేశంలోనే అరుదైన నిర్మాణం హైదరాబాద్‌లోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి. కేబుల్ టెక్నాలజీతో దేశంలో నిర్మితమైన తొలి బ్రిడ్జి ఇదే.

అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, అద్భుత ఆలయ శిల్పకళా నైపుణ్యంతో, ఆలయ ప్రాశస్త్యం, వైభవం ప్రస్ఫుటమయ్యేలా యాదాద్రి ఆలయం రూపుదిద్దుకున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీద అందరూ అబ్బురపడేలా రూపుదిద్దుకున్న యాదగిరి గుట్ట ఆలయం ఆయన నవీన, ఆధ్యాత్మిక పాలనకు మచ్చుతునక. ఇదే తరహాలో కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న గుడుల పునర్నిర్మాణ పనులు కూడా ఊపందుకుంటున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బుద్ధిస్ట్ హెరిటేజ్ థీమ్ పార్కును 247 ఎకరాల్లో తెలంగాణ ప్రభుత్వం నాగార్జున కొండపై ఏర్పాటుచేసింది. ఆసియాలోనే అతిపెద్ద మహాస్థూపాన్ని అందమైన థీమ్‌పార్కును నిర్మించింది. ఆచార్య నాగార్జునుడు నడయాడిన నంది కొండ, ఆయన బోధించిన వచనాల విశేషాలను ప్రదర్శిస్తూ బుద్ధవనం చరిత్రకు నిలువుటద్దంలా నిలిచింది.

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల స్మృతికి ఘనంగా నివాళులు అర్పించేందుకు, అమరుల త్యాగాలను స్మరించేందుకు హైదరాబాద్‌లో ఒక మహాస్మృతి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల స్మృతికి ఘనంగా నివాళులు అర్పించేందుకు, అమరుల త్యాగాలను స్మరించుకునేందుకు హైదరాబాద్‌లో ఒక మహాస్మృతి కేంద్రాన్ని ఏర్పాటుచేసింది తెలంగాణ ప్రభుత్వం. ప్రపంచంలో అపూర్వమైనరీతిలో జ్వలించే మహా దీపకళిక రూపంలో ఈ అమరవీరుల స్థూపం ఉండేలా, స్మృతికేంద్రం నిర్మాణమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అంబేద్కర్ ఆశయాలను విశ్వవ్యాప్తం చేయడంతో పాటు, ఆయన ఆశయాల సాధనకు ప్రజాప్రతినిధులు, అధికార గణాన్ని ఉద్యుక్తులను చేయాలన్న సంకల్పంతో ప్రపంచంలోనే అతి పెద్దదయిన 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు.

ఇక నవీన తెలంగాణలో వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పటిష్ఠమైన చర్యలతో తెలంగాణ రాష్ట్రం 'ఆరోగ్య తెలంగాణ'గా అవతరించింది. గచ్చిబౌలిలో టిమ్స్‌ను తీర్చిదిద్దగా చుట్టూ నాలుగు సూపర్ స్పెషాలిటీ దవాఖానల నిర్మాణం, వరంగల్‌లో అత్యాధునిక సౌకర్యాలతో రూ.1200 కోట్ల వ్యయంతో హెల్త్ సిటీ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

(వ్యాసకర్త: వరంగల్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి)



బడిబాటకు నూరు మార్కులు

'విద్య లేనిదే వికాసం లేదు. వికాసం లేనిదే పురోగతి లేదు. పురోగతి లేనిదే ప్రగతి లేదు. అన్ని సమస్యలకు మూలం విద్య లేకపోవడమే' అన్నారు జ్యోతిరావు పూలే. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా బాలికల విద్యాలయాలను నిర్వహిస్తున్నది. వాటిల్లో అన్నీ సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నది. అక్కడ చదివే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందుతున్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థల్లో డాక్టర్లుగా ఇంజినీర్లుగా చేరుతున్నారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి 17 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. బడీడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి, సర్కార్ బడిలో చేర్పించడం, నాణ్యమైన విద్య అందించడం డ్రాపౌట్లను తగ్గించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ బడుల ప్రత్యేకతను వివరిస్తూ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించి విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పించడంలో విద్యాశాఖ విజయవంతమైంది. ఈ విద్యా సంవత్సరంలో బడిబాట ద్వారా 1,14,257 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరగా వారిలో 31,205 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చినవారే కావడం విశేషం.

రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలు కోరుకున్నట్టుగా ప్రజలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడుతూ గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. తద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చాలామంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ప్రారంభమైంది. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టడంతో పాటు మన ఊరు-మనబడి కార్యక్రమంలో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ ఉత్తమ ఫలితాలు సాధించడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ చేయూతనందించడంతో పాటు తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు, ఏడో తరగతుల విద్యార్థులకు ఆరు, 8 వ తరగతికి ఏడు, 9,10 తరగతుల విద్యార్థులకు 14 నోట్ పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ నిర్ణయం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో 26,074 మండల, జిల్లా పరిషత్ పాఠశాలలు, 194 మాడల్ స్కూల్స్, 475 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, 31 అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 51 సెంట్రల్ బడులు, 161 మదర్సాలు, 1002 సంక్షేమ గురుకులాలున్నాయి.11,637 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటన్నింటిలో దాదాపుగా 60. 77,073 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రభుత్వ బడుల్లో 30,93,368 (50.90శాతం), ప్రైవేటులో 29,83,705 (49.09 శాతం) ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ చెప్పున్నట్టుగా చిత్తశుద్ధి, సంకల్పసిద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చని మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైంది. 2022 మార్చి 9న సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో మన ఊరు మనబడి పథకంలో మొదటి విడత 35 శాతం బడులను ఆధునీకరించింది. టాయిలెట్స్ నిర్వహణ, తాగునీరు, డిజిటల్ విద్య, కిచెన్ వంటి 12 అంశాల్లో సౌకర్యాలు కల్పించింది.

నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చేసే ప్రయత్నంలో మొదటి విడుతలో 9123 బడులను ఎంపిక చేసి బడ్జెట్‌లో వాటికి రూ.3497 కోట్లు కేటాయించింది. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులకు కూడా చాలా జిల్లాల్లో పాఠశాలలను ఎంపిక చేసి ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మన ఊరు మనబడి పథకంలో మొదటి విడుతలో పూర్తయిన 1000 పాఠశాలలను జూన్ 20న విద్యా దినోత్సవం సందర్భంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దాని కోసం రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ, పర్యవేక్షణాధికారులను, నియమించింది. త్వరలోనే ఉపాధ్యాయ ఖాళీలను కూడా ప్రభుత్వం భర్తీ చేయనున్నది. తద్వారా పభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందనున్నది.



పాకాల శంకర్ గౌడ్
98483 77734



బీఆర్ఎస్‌లో యువతకు పెద్దపీట

2001కి ముందు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఏ ఉద్యమమూ నిలబడలేకపోయింది. ఇదిలా ఉంటే సమైక్య పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరూ ప్రశ్నించలేకపోయారు. ఈ తరుణంలో స్వరాష్ట్ర పాలన ద్వారానే తెలంగాణ బాగుపడుతుందని భావించిన తెలంగాణ ఉద్యమ రథసారథి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సుదీర్ఘమైన పోరాటం జరిగింది. దీంతో సబ్బండ వర్ణాల్లో చైతన్యం వచ్చింది.

పద్నాలుగేండ్ల పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేరి రాష్ట్రాన్ని స్వయంగా పాలించుకుంటున్నాం. ఇప్పుడు తెలంగాణలో కొనసాగుతున్న పథకాలను యావత్ దేశమే అనుసరిస్తున్నది. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కేంద్రంలోని పలువురు మంత్రులు ఒప్పుకోవడం తెలంగాణలోని పాలనాతీరుకు నిదర్శనం.

కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం సాధిస్తామనే ధీమాతో ఆయన వెంట తెలంగాణ యావత్ ప్రజానీకం నడిచింది. ఉద్యమ పార్టీ అయిన టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు, ఉద్యమకారులకు, యువకులకు ప్రాధాన్యం ఇవ్వడంలో కేసీఆర్ ముందుంటున్నారు. పార్టీ కోసం, పార్టీ నిబంధనలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేసినవారికి సముచిత స్థానం కల్పించి, గౌరవించుకుంటున్నారు.

ప్రస్తుతం తెలంగాణలో ఆయా పార్టీలు యువకులను తమ స్వలాభం కోసం వాడుకోవడం తప్ప అవకాశాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఇందుకు జాతీయ పార్టీలూ అతీతం కాదు. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ 2014 నుంచే ఉద్యమకారులకు, యువతకు ప్రాధాన్యం ఇవ్వడంలో ముందున్నది. 2014 సాధారణ ఎన్నికల్లో పది మందికి పైగా యువతకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నది. యువతను చట్టసభల్లోకి పంపిన ఘనత ఉద్యమ పార్టీది. చాలామంది యువకులను కార్పొరేషన్ చైర్మన్లుగా, సభ్యులుగా నియమించుకొని గౌరవించుకున్నది. 2018 సాధారణ ఎన్నికల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న విద్యార్థి నాయకులకే ప్రాధాన్యం ఇచ్చారు సీఎం కేసీఆర్. జాతీయ పార్టీల్లో విద్యార్థి నాయకులను వాడుకోవడమే తప్ప, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని ఇవ్వడమంటూ జరగకపోవడం శోచనీయం.

గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జరిగిన 12 స్థానిక సంస్థల కోటాలో ఆరు స్థానాలను బీఆర్ఎస్ ఏకగ్రీవంగా సొంతం చేసుకున్నది. మరో ఆరు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఆరు స్థానాలనూ బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం విశేషమైతే, ఆ ఫలితాలు వెలువడిన సాయంత్రం లోపే ముఖ్యమంత్రి కేసీఆర్ ముగ్గురు దళిత, యువ ఉద్యమకారులను ఆయా కార్పొరేషన్ చైర్మన్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యమపార్టీ బీఆర్ఎస్ మాత్రమే యువతను రాజకీయాలలో భాగస్వామ్యం చేస్తున్నది. రాజకీయ పట్టు కోసం యువతను వాడుకొని వదిలేసే జాతీయపార్టీలు యువతకు ప్రాధా న్యం ఇవ్వడంలో నిరాసక్తిని ప్రదర్శిస్తున్నాయనే విషయాన్ని ఆయా పార్టీల్లోని యువత గమనించాలి. ఆచితూచి అడుగువేసే ఉద్యమ అధినేత కేసీఆర్ తీసుకునే నిర్ణయాలు, కల్పించే అవకాశాలు అద్భుతంగా ఉంటాయనడంలో సందే హం లేదు.

భవిష్యత్తులోనూ బీఆర్ఎస్ మరింత పటిష్ఠమైన రాజకీయశక్తిగా ఎదగడానికి జిల్లాలవారీగా ఉన్న విద్యార్థి నాయకత్వా న్ని గుర్తించాలి. శిక్షణా కార్యక్రమాలతో యువతను బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములను చేయాలి. దీంతోపాటుగా బీఆర్ఎస్‌ను తిరుగులేని రాజకీయశక్తిగా మార్చడానికి యువత కూడా కృషి చేయాలి. మన ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే పార్టీతో నడిస్తే అవకాశాలు పుష్కలంగా లభిస్తాయనియువత గ్రహించాలి. రాజకీయాల్లో యువతను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్ వెంట నడవాల్సిన అవసరం ఉన్నది.



సంపత్ గడ్డం
78933 03516

గురుకుల విద్య ఒక వరం

రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ ప్రాంతంలో గురుకులాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం గురుకులాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నది. ఆహారంలో నాణ్యత పెరిగింది. దీనంతటికీ కారణం రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకత్వం ఉండటం వల్లనే...

ఉమ్మడి రాష్ట్రంలో గురుకుల విద్యాలయాలను నిర్వహించడం కష్టంగా ఉండేది. ఆ పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులు మా సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించుకునేవాళ్లు. విద్యార్థులకు నాసిరకం బియ్యంతో వండిన అన్నం పెట్టేవాళ్లు. ఆ అన్నంలో రాళ్లు, పురుగులు వచ్చేవి. దీంతో విద్యార్థులు అపెండిసైటిస్ వంటి పలురకాల వ్యాధులకు గురయ్యేవాళ్లు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని అధికార యంత్రాంగం విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తద్వారా గురుకులాల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. ఫలితంగా ఇప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారం కూడా అందుతున్నది.



పేద విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో గురుకులాల్లో ఇంగ్లీషు మీడియంలో విద్యనందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నది. ముఖ్యంగా ఉమ్మడి రాష్ట్రంలో సరైన తరగతి గదులు, బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విద్యార్థులకు సరైన తాగునీరు అందుబాటులో లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం గురుకుల విద్యాలయాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించింది. ఇవి సరిపోకపోతే నాబార్డ్ లాంటి సంస్థల నుంచి అప్పు తీసుకొని మరీ మౌలిక వసతులను మెరుగుపరిచింది.

నాటి గురుకులాల్లో ఉపాధ్యాయులు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది కొరత విపరీతంగా ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, గురుకుల ఉమ్మడి రిక్రూట్‌మెంట్ బోర్డు కలిసి ఉద్యోగులను నియమించింది. జాతీయ విద్యావిధానం-2020లోని అంశాలు, బోధనశాస్త్ర విషయాలు తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిదేండ్లుగా అమలవుతున్నాయి. అందుకే గురుకులాల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతున్నది. మంచి ఫలితాలు కూడా వస్తున్నాయి. పై సంస్కరణల ఫలితంగా పేదలు, బడుగు, దళితవర్గాల పిల్లల ప్రవేశాల కోసం వారి తల్లిదండ్రులు గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోసం పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల విద్యాలయాలకు ప్రైవేటు బడుల నుంచి వలసలు పెరుగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రవ్యాప్తంగా జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యాలయాలతో కలిపి 298 గురుకుల విద్యాలయాలే ఉండేవి. కానీ ఆ సంఖ్య 1002కి పెరిగింది. ఈ స్థాయిలో పెరగటానికి కారణం విద్యార్థుల నమోదు, అడ్మిషన్ల కోసం డిమాండ్ పెరగటమే. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల్లో దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏటా విద్యా సంవత్సరానికి ముందే.. అంటే, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే ప్రవేశానికి దరఖాస్తులు తీసుకోవడం, ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయడం జరుగుతున్నది.

గురుకుల విద్యాలయాల్లో విద్యనభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 930 మంది వైద్యులయ్యారు. 1,517 మంది ఇంజినీర్లు అయ్యారు. ముస్లిం బాలికలు కళాశాల విద్యలో జాతీయస్థాయిలో రాష్ట్రంలో రెండోస్థానంలో నిలువగా, పాఠశాల విద్యలో మూడోస్థానంలో నిలిచారు. నేడు గురుకుల విద్యార్థినీ విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో విజయాలు సాధిస్తున్నారు. అటు విద్యలోనే కాకుండా ఇటు క్రీడల్లో, సాంకేతిక విద్యలో, నీట్ లాంటి పరీక్షల్లో, పర్వతారోహణ వంటి క్లిష్టమైన అంశాల్లో చూపిస్తున్న ఫలితాలు మేధావుల నోటా ఔరా అనిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల రూపకల్పనకు ప్రతిరూపం ఈ ఫలితాలని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు గురుకులాల విద్యాలయాల్లో ఉచిత విద్య, ఉచిత భోజనం, ఉచిత వసతి సౌకర్యాలు, ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందిస్తున్నది. నేడు గురుకులాల్లో ప్రవేశాల కోసం తలిదండ్రులు పోటీపడుతున్నారంటే గురుకుల విద్యాలయాలపై ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక శ్రద్ధనే కారణం. ప్రధానంగా ఆర్థిక, సామాజిక, వెనుకబాటు ఉన్న వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గురుకుల విద్య ఒక వరం.




సీవీవీ ప్రసాద్
80196 08475

(వ్యాసకర్త: విశ్రాంత ప్రధానోపాధ్యాయులు)

నవ్వుల వానలు కురుస్తున్నయి...

నాడు పదెకరాల పొలమున్న పేదోళ్లమే మరి..
నాట్లేసే మోపుకు మా ఖాళీ కడుపులు నాగళ్లను పట్టమంటే..
కట్టుకున్నదాన్ని పైసల కోసం అవ్వగారింటికి దోలినం
ఉల్లే షావుకారింట్ల అప్పు కోసం కాలువెట్టినం
ఆడదాని మెడల పుస్తెల్తాడు కుదవెట్టినం
ఎవరికెర్క గడ్డివామెత్తున్న మా అప్పులు
ఎవ్వరు తొంగిజూసిండ్రు బోరెం కిందున్న మా రోత బతుకులను..
సాళ్లల్ల నీళ్లు లేక, చేతుళ్ల పైసల్లేక ఊరిడ్సి పోతాంటే
కచ్చురంల ఎదురచ్చి ఎన్కకు దోల్కపోయిండు మా సారు..
కట్టాలన్ని కొట్టంల గుంజకు కట్టేసి ముల్లుకట్టె వట్టుకొని
తొవ్వలున్న ముల్లకంపల్ని ఏరిపారేసికుంట... పొలాల దూపదీర్చి..
రైతుబంధుతో మా దుఃఖానికి కంచె గట్టి
ఎకరానికి ఐదు వేలిస్తే సద్దిగట్టిన్నట్టున్నదియ్యాల్ల..
కాలం కంటే ముందుగాల్నే మా తెలంగాణ సర్కారు
చింతచెట్టు నీడలా ఆదుకుంటే..
నేడు పచ్చని పొలాలు భూమికి పందిరేసినట్టున్నయ్..
కల్లంల వడ్లు కుప్ప పోస్తే బతుకమ్మ వోలె అవుపడే..
నేడు మా సారు తెలంగాణ రైతుల రాతలు మార్చితే...
వేపచెట్టు గాలిలా సల్లగ నిద్రవోతున్నం..
రైతుబంధంటే ఐదు వేల రూపాయలు ఇచ్చుడే గాదు..
లచ్చలమంది రైతులు తలెత్తుకొని సావడిల కాడ నడుస్తుండ్రు..
ఆకాశి పండగ రాకముందే
రైతన్నలింట్ల నవ్వుల వానలు కురుస్తున్నయి...



తుమ్మల కల్పనారెడ్డి
96404 62142



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



గురువారం THURSDAY 22.6.2023 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+16/12 Pages: 16+16/12 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 17 ‖ వెల (Price) రూ.6.50 | చవితి

గురువారం, సూర్యోదయం: 5-43, సూర్యాస్తమయం: 6-53. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: చవితి సాయంత్రం 5-27 వరకు. నక్షత్రం: ఆశ్లేష తెల్లవారుజామున 4-18 వరకు. వర్జ్యం: పగలు 3-44 నుంచి సాయంత్రం 5-32 వరకు. రాహుకాలం: పగలు 1-56 నుంచి పగలు 3-35 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-06 నుంచి ఉదయం 10-59 వరకు, పగలు 3-21 నుంచి సాయంత్రం 4-14 వరకు. అమృతకాలం: రాత్రి 2-30 నుంచి తెల్లవారుజామున 4-17 వరకు. ఆరుద్ర కార్తె సాయంత్రం 5-48.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పుడమిపై కేసీఆర్ ఆకుపచ్చని సంతకం



'వాయూనాం శోధకాః వృక్షాః
రోగాణా మపహారకాః
తస్మాత్ రోపణమేతేషాం
రక్షణం చ హితావహం'

చెట్లు గాలిని శుద్ధి చేస్తాయి. రోగాలను పారదోలతాయి. అందుకని, చెట్లను నాటడం, పరిరక్షించడం ప్రాణులకు ఉపయోగకరం అని హితవు చెప్పారు పెద్దలు. అడవుల ప్రాధాన్యాన్ని నాడే గుర్తించి హెచ్చరించారు విజ్ఞులు.



జోగినిపల్లి
సంతోష్‌కుమార్

నేడు ప్రపంచాన్ని వేధిస్తున్న అత్యంత ప్రధాన సమస్య అడవులు అంతరించడం. అడవులను కాపాడుకోకపోతే మానవాళి మనుగడకే ముప్పు అని శాస్త్రవేత్తలు ఎంత హెచ్చరించినా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. యూరప్ దేశాల్లో నెలకొన్న స్పృహ వల్ల అక్కడి ప్రభుత్వాలపై కొంత ఒత్తిడి వస్తున్నది. దీంతో కొంత ముందడుగు పడింది. కానీ ఇప్పటికీ ఆశించిన లక్ష్యాలను చేరుకోవడం లేదు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలు మాత్రమే చూసుకోవడం వల్ల వచ్చిన సమస్య ఇది. 'రాజకీయ నాయకుడు రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తాడు. పరిపాలకుడు భవిష్యత్‌తరాల గురించి ఆలోచిస్తాడు' అన్నాడు అబ్రహం లింకన్. నేడు ప్రపంచ దేశాల్లో రాజకీయ నాయకులున్నారే తప్ప పరిపాలకుల్లేరు.

మన దేశ పరిస్థితి కూడా ఇంతే. కానీ, మన ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మాత్రం పరిపాలకుడిలా ఆలోచిస్తారు. ఆయన భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందిస్తారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసినప్పుడు పత్రికల వారు సాధారణమైన రాజకీయాలకు సంబంధించిన ప్రశ్నలు వేశారు. కేసీఆర్ ఇందుకు భిన్నంగా దేశం గురించిన ప్రశ్నలు వేయాలని కోరారు. దేశ సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి మాట్లాడే నాయకులు కరువయ్యారు. విలేకరుల సమావేశాలు నాయకుల పరస్పర దూషణలకు వేదికలుగా మారుతున్నాయి. కానీ, కేసీఆర్ అసెంబ్లీ చర్చలను, విలేకరుల సమావేశాలను ఉపయోగకరంగా మార్చాలని భావిస్తుంటారు. ఇది చాలు ఆయన గురించి చెప్పడానికి.

భావితరాల సంక్షేమం కోసం ముందే ఆలోచించే క్రమంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ మానవాళికి పొంచి ఉన్న ముప్పును గ్రహించారు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నారు. తన పరిధిలోని తెలంగాణలో శక్తి మేరకు చెట్లు నాటడం, పరిరక్షించే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో సాగించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో చేపట్టిందే తెలంగాణకు హరితహారం కార్యక్రమం. ఇది ప్రపంచ చరిత్రలోనే చెప్పుకోదగిన పెద్ద ఉద్యమం. కేసీఆర్ దేనినైనా ఉన్నతస్థాయిలో ఆలోచిస్తారు, ఆచరిస్తారు. హరితహారం కార్యక్రమానికి కూడా భారీ ఎత్తున రూపకల్పన చేశారు. దీని అమల్లో విజయవంతమయ్యారు. నేడు దేశానికి తెలంగాణ 'హరితహారం' ఒక రోల్ మాడల్.

ఈ తొమ్మిదేండ్లలో హరితహారం ఫలితాలు అబ్బురపరిచేలా ఉన్నాయి. 2015 నుంచి 2023 వరకు జరిగిన కృషి అసాధారణమైనది. కేసీఆర్ మార్గదర్శకత్వంలో ఈ స్వల్పకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 273.33 కోట్ల మొక్కలు నాటడం గర్వకారణం. ఈ హరితహారం నిర్వహణ కోసం ఇప్పటి వరకు 10,822 కోట్లు ఖర్చుచేయడం విశేషం. 13,657 ఎకరాల విస్తీర్ణంలో 19,472 పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు జరిగింది. 6,298 ఎకరాల విస్తీర్ణంలో 2,011 బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటయ్యాయి. 1,00,691 కిలోమీటర్ల మేర రాష్ట్రం అంతటా రహదారి వనాలు విస్తరించుకొని ఉన్నాయి.

కొత్తగా మొక్కలు నాటి అటవీ విస్తీర్ణాన్ని గొప్పగా చెప్పుకోవడం కాదు. అటవీ ప్రాంతంలోనే అడవులు అంతరించిన దీనావస్థ ఉన్నదని కేసీఆర్ గమనించారు. అందుకోసం అటవీ పునరుద్ధరణకు కూడా చర్యలు చేపట్టారు. కేసీఆర్ ఏ అంశం చేపట్టినా అన్ని కోణాల్లో ఆలోచించి పక్కా ప్రణాళిక ప్రకారం చేస్తారనేది తెలిసిందే. కేసీఆర్ ఆలోచనల మేరకు 13.44 లక్షల ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం అటవీ పునరుద్ధరణ సాగించింది. 1.40 లక్షల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తిచేసింది. ఈ విధంగా 24.53 కోట్ల మొక్కలను నాటించింది. 10,886 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతాల చుట్టూ కందకాల తవ్వకం సాగించింది. అగ్ని ప్రమాదాల నివారణ కోసం 8,740 కి.మీ. మేర ఫైర్ లైన్లు ఏర్పాటుచేసింది. నేల, తేమ పరిరక్షణ కోసం అడవుల్లో పెద్ద ఎత్తున నీటి నిర్వహణ విధానాలను అమలుచేసింది. చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు మొదలైన వాటి నిర్మాణం చేపట్టింది. పరిపరి విధాల చేపట్టిన అటవీ పునరుద్ధరణ చర్యలు ఫలితాన్నిచ్చాయి. ఈ పునరుద్ధరణ చర్యల ద్వారా 53.84 కోట్ల మొక్కలు పెరిగాయి.

రాష్ట్రవ్యాప్తంగా నగరాలకు సమీపంలో 109 అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుజరిగింది. కాంక్రీట్ జంగిల్స్‌గా పేరొందిన నగరాల్లో వీటి ప్రాధాన్యం చెప్పవలసిన అవసరం లేదు. ఈ ఉద్యానవనాల్లో నగరవాసులు ఆనందంగా సేద దీరుతున్నారు. దాదాపు 75,740 ఎకరాల్లో ఈ పార్కుల అభివృద్ధి జరిగింది. ఇదేవిధంగా 164 హరితవనాల్లో వందశాతం పచ్చదనం సాధించేందుకు 1.71 లక్షల ఎకరాల్లో 1.06 కోట్ల మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం నాటించింది. భారత అటవీ సర్వే, అడవుల స్థితిగతుల నివేదికల (2021) ప్రకారం రాష్ట్రంలో ఫారెస్ట్ కవర్ 2015-21 మధ్యకాలంలో 6.85 శాతం పెరిగింది. అంటే 3.36 లక్షల ఎకరాల విస్తీర్ణం పెరిగింది. ఇదే కాలంలో రాష్ట్రంలో గ్రీన్‌కవర్ 7.70 శాతం విస్తరించింది. అంటే 5.13 లక్షల ఎకరాల మేర పెరిగింది. 2011-21 దశాబ్దిలో హైదరాబాద్ నగరం అటవీ పెరుగుదల 146.8 శాతం సాధించింది.

అడవి వృద్ధి చెందిందీ అంటే దాన్ని ఆశ్రయం చేసుకొని జంతువులు, పక్షులు వివిధ జీవరాశులు వృద్ధి చెందుతాయి. ప్రకృతి వైవిధ్యం విలసిల్లుతుంది. జీవ వైవిధ్యానికి తెలంగాణ నిలయం. 2,939 వృక్షజాతులు, 365 పక్షి జాతులు, 103 క్షీరద జాతులు, 28 పాకుడు జీవ జాతులు, 21 ఉభయచర జాతులు, అనేకరకాల అకశేరుకాలు తెలంగాణలో ఉన్నాయి. ఈ సకల జీవరాశులకు జవం చేకూర్చినట్టయింది.

ఛాయా మన్యస్య కుర్వంతి
తిష్ఠంతి స్వయ మాతపే
ఫలాన్యపి పరార్థాయ
వృక్షాః సత్పురుషాః ఇవ

అని నీతిశాస్త్రం చెప్తుంది. చెట్టు సత్పురుషులలాగా తాము ఎండలో ఉంటూ ఇతరులకు నీడనిస్తాయి. ఇతరుల కోసం ఫలాలనిస్తాయి. మిగతా నాయకుల మాదిరిగా ఏదో మొక్కుబడిగా చేయకుండా పచ్చదనాన్ని నిండుగా పెంచేందుకు.. ఇది నిరంతర ప్రక్రియగా సాగేలా స్థిరపరచాలని కేసీఆర్ భావించారు. కొందరు ఇవాళ చెట్లు నాటుతారు, రేపు ఎండిపోతాయి. కానీ హరితహారం లక్ష్యం అది కాకూడదు. చెట్లు నాటడం, అడవులను సంరక్షించడం అనేది ఒక్కనాటి బాగోతం కాదు. ఇది నిరంతర ప్రక్రియగా సాగినప్పుడే మానవాళి మనుగడ సాధ్యమవుతుంది. అందువల్ల దీనిని నిరంతర కార్యక్రమంగా మార్చడానికి కేసీఆర్ చర్యలు చేపట్టారు.



రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 14,864 నర్సరీలను ఏర్పాటుచేయించారు. గ్రామాల్లో నర్సరీలు నిర్వహించడానికి, చెట్లను పరిరక్షించడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయించారు. నీళ్లు పోయించేందుకు ట్యాంకర్లు కూడా ఏర్పాటుచేయించారు. ఇక పంచాయతీరాజ్, పురపాలక చట్టాలను కూడా సవరించి మొక్కలను పెట్టడం, సంరక్షించేందుకు చట్టం చేశారు. 10 శాతం గ్రీన్ బడ్జెట్ పెట్టడంతోపాటు మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచ్‌లు, అధికారులపై చర్యలు తీసుకునేలా చట్ట సవరణ చేశారు. రాష్ట్రస్థాయిలో గ్రీన్‌ఫండ్ ఏర్పాటుచేశారు. దేశంలో ఈ విధంగా చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. బహుశా ప్రపంచంలో కూడా ఇలా చట్టం చేసి, ప్రత్యేకంగా 10 శాతం బడ్జెట్ పెట్టిన ప్రభుత్వం మరొకటి లేదు. కేసీఆర్ ఆలోచన, ఆయన ప్రణాళికలు ఎంత గొప్పగా ఉంటాయో అనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే. ఏ కార్యక్రమాన్ని చేపట్టిన దాని అంతిమ ఫలితం అందేవరకు.. గమ్యాన్ని ముద్దాడేవరకు వదిలిపెట్టకపోవడం కేసీఆర్ నైజం. రైతులకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు ఎంతటి సత్ఫలితాలను ఇస్తున్నాయో.. హరితహారం కూడా అదేస్థాయిలో ఫలితాన్నిస్తున్నది.

ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంగా నడిచేకన్నా, ప్రజా ఉద్యమంగా సాగినప్పుడే విజయవంతమవుతుంది. తెలంగాణ సాధన ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు ఇది బాగా తెలుసు. అందుకని హరితహారం కార్యక్రమంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేశారు. పాఠశాలలు, పరిశ్రమలు ఎక్కడైనా చెట్లు నాటవలసిందే. పర్యావరణ అవగాహన కోసం బడి పిల్లలకు విస్తృతంగా వనదర్శిని కార్యక్రమాన్ని అటవీశాఖ చేపట్టడం ఈ ఉద్దేశంతోనే. వన సంరక్షణ, పర్యావరణ అభివృద్ధి, నీటి పరిరక్షణ మొదలైన లక్ష్యాలతో ప్రాంతాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యం ద్వారా ఉద్యమ రీతిలో అటవీ పరిరక్షణ, విస్తరణ సాగుతున్నది.

ఈ ఉమ్మడి కృషి వల్ల కేసీఆర్ ఆకాంక్షల మేరకు ఈ రోజు హరిత తెలంగాణ సాక్షాత్కారమైంది. గ్రామాలు, నగరాలు, రహదారులు, గనులు, కార్ఖానాలు ఎక్కడైనా పచ్చదనం పరుచుకొని ఉన్నది. మనం చిన్నప్పుడు పుస్తకాల్లో 'అశోకుడు మొక్కలు నాటించెను' అని చదువుకున్నాం. కానీ, నేడు కేసీఆర్ అశోకుడు నాటించిన మొక్కల కన్నా కొన్ని వందల రెట్లు మొక్కలు నాటించారు.


ప్రపంచంలో వృక్ష ప్రేమికులుగా పేరున్న చిప్కో ఉద్యమాన్ని పరిచయం చేసిన సుందర్‌లాల్ బహుగుణ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పయాంగ్, హరిత విప్లవ సృష్టికర్త ఎం.ఎస్. స్వామినాథన్ వంటివారికి ఏ మాత్రం తీసిపోని వ్యక్తి కేసీఆర్. హరితహారాన్ని కూడా తెలంగాణ ఉద్యమం స్థాయిలో ముందుకు తీసుకెళ్లారు. ఈ రోజు తెలంగాణనే కాదు, యావత్ దేశంలో అనేక మంది తమ పుట్టినరోజు నాడు మొక్కలు నాటుతున్నారు. అనేక మంది తమ వారు చనిపోతే వారి జ్ఞాపకార్థం ఒక మొక్కను పెడుతున్నారు. పెళ్లి చేసుకున్నా.. పిల్లలను కన్నా మొక్క పెట్టడం ఒక సంప్రదాయంగా మారుతున్నది. ఫంక్షన్లలో బహుమతులుగా కూడా మొక్కలను ఇచ్చే సంస్కృతి వచ్చింది. ఇది తెలంగాణ నుంచే మొదలైంది. చంద్రుడికో నూలుపోగులా నేను కూడా కేసీఆర్ స్ఫూర్తితో 'హరితహారం' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో నా వంతు పాత్ర పోషించాలని, ఉడుతాభక్తితో 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' కార్యక్రమాన్ని మొదలుపెట్టాను. ఇప్పుడు 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' అనేక మందిని హరితహారంలో భాగస్వామ్యులను చేసింది.

ప్రపంచవ్యాప్తంగా నీరాజనాలు: హరితహారంతో తెలంగాణ సాగించిన కృషికి ప్రపంచం నీరాజనాలు పడుతున్నది. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయసంస్థ-అర్బర్ డే ఫౌండేషన్ ద్వారా ఇచ్చే 'ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్' గుర్తింపును హైదరాబాద్ నగరం 2020లో, 2021లో సాధించింది. నీతి ఆయోగ్ సమీకృతాభివృద్ధి లక్ష్యాల సూచీల్లో, (2020-21) అటవీకరణ విభాగంలో తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా కేంద్రంగా పనిచేసే ఉద్యానవన ఉత్పత్తిదారుల అంతర్జాతీయ సంఘం (ఎఐపీహెచ్) హైదరాబాద్ నగరానికి 2022లో గ్రీన్ సిటీ అవార్డును ఇచ్చింది. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ దేశవ్యాప్తంగా నగరాల్లో నిర్వహించిన 'సిటీ నేచర్ ఛాలెంజ్-2023'లో హైదరాబాద్ మొదటిస్థానంలో నిలిచింది. హైదరాబాద్ అత్యధిక జీవవైవిధ్యం గల నగరంగా గుర్తింపు పొందింది. ఇవి కేసీఆర్ దార్శనికతకు లభించిన అవార్డులుగా చెప్పుకోవచ్చు. ప్రపంచంలో అతిపెద్ద మానవ ప్రయత్నాల్లో తెలంగాణ హరితహారం కూడా ఒకటి కావడం గమనార్హం. గోబీ ఎడారి విస్తరణను అడ్డుకునేందుకు, ఇసుక తుఫానుల నుంచి మానవ ఆవాసాలను రక్షించేందుకు చైనాలో 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ చైనా' పేరుతో 1978లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రాజెక్టు 2050లో ముగియనున్నది. దీని కోసం 8 బిలియన్ డాలర్లను ఖర్చుపెట్టి 8.8 కోట్ల ఎకరాల్లో మొక్కలు నాటుతున్నారు.

ఇది తొలి అతిపెద్ద మానవ ప్రయత్నం కాగా... బ్రెజిల్‌లో అమెజాన్ అడవుల పునరుద్ధరణ కోసం 7.3 కోట్ల మొక్కలను ఆరేండ్లలో నాటేందుకు కార్యాచరణ అమలుచేస్తున్నారు. 75 వేల ఎకరాల్లో ఇది సాగుతున్నది. వీటి సరసన తెలంగాణ హరితహారం చేరింది. మన హరితహారం ప్రపంచంలో మూడో అతిపెద్ద మానవ ప్రయత్నంగా కీర్తించబడుతున్నది. ఇలాంటి అద్భుత కార్యక్రమాన్ని చేపట్టిన కేసీఆర్ మానవాళి సంరక్షణలో ముందు నడిచిన మహానుభావుడిగా చరిత్రలో నిలిచిపోయారు. తెలంగాణను హరితబాటలో నడిపించారు. ఇది తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణం.

హరితహారం ద్వారా కేసీఆర్ మనకు కలిసి పనిచేయడం నేర్పారు. మన బాగు కోసమే కాకుండా సమష్టి శ్రేయస్సు కోసం పరిశ్రమించడం అలవాటు చేశారు. కేసీఆర్ స్ఫూర్తితో అందరం మరింత కృషిచేద్దాం. అందమైన భవిష్యత్తులోకి ప్రయాణిద్దాం.

(వ్యాసకర్త: రాజ్యసభ సభ్యులు)



ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంగా నడిచేకన్నా, ప్రజా ఉద్యమంగా సాగినప్పుడే విజయవంతమవుతుంది. తెలంగాణ సాధన ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు ఇది బాగా తెలుసు. అందుకని హరితహారం కార్యక్రమంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేశారు.

అచ్చినోళ్లు వాపస్ పోతలేరు

"ఆ రోజు పొద్దున్నుంచి మొదలు, మజ్జాన్నం దాన్క కత్తెర వట్టింది లేదు, సవురం జేసింది లేదు. అసలు గిరాకే లేదురా అయ్యా అంటే.. కడుపుల గోకుడు షురువైంది. నేనటువోయినంక గిరాకీ గినా అస్తే నోట్లె మన్ను వడ్డట్టయితదని ఆకలికి ఓర్సుకోవట్టి గంట సేపాయె. అయినా ఎవ్వలొచ్చింది లేదు, సవురం జేయుమని అడిగింది లేదు. సూడంగ, సూడంగ ఒక పిలగాడొచ్చిండు. పది, పన్నెండేండ్లుంటయి గావొచ్చు. 'అన్నా కటింగ్ జేస్తవానే' అని బైటికెళ్లె అడిగిండు. 'చేస్త దా తమ్మీ' అన్న. సైకిల్ స్టాండేసి లోపల్కచ్చిండు. ఆ పిలగానికేం అనిపిచ్చిందో ఏమో.. 'మల్లొస్తాగన్న' అని మర్రిసూడకుంట వోయిండు. ఆ పిలగాడు వొయి అద్దగంటయితున్నది. ఇగరాలే, అగరాలే.

ఏ.. ఇగ ఇంత సల్లవడొద్దామని ఇంటి మొకాన బయల్దేరిన. కన్నారంల ఉన్న బ్యాంక్‌కాలనీ నుంచి కొత్తపల్లి మండలంలోని మా ఊరు సీతారాంపూర్‌కు నా తొవ్వ సాగుతున్నది. మా ఇంటికి వొయ్యే తొవ్వల్నే ఇంకో మంగలి దుకాణం ఉంటది. లోపల పీఓపీ జేసి టిప్‌టాపుగుంటది. పెద్ద పెద్ద కుర్సీలు, సుట్టూ అద్దాలు తళతళా మెరుస్తుంటయి. ఎందుకో నా కన్ను అటుమొకానవడ్డది. ఆ అద్దాలళ్ల నా దుకాన్లకొచ్చిన పిలగాడు తళతళా మెరుస్తున్నడు. పర్రెలువాసిన అద్దాలు, శినిగిన సీట్లతో ఉన్న నా దుకాణం ఒక్కసారి కండ్లళ్ల మెర్శింది. నా దుకాణం హాలత్ జూసే ఆ పిలగాడు ఎన్కకు మర్రచ్చిండని అప్పుడర్థమైంది. ఇగ ఆ రోజు మన్నున వట్టలే.

***

'సూడుల్లా.. నువ్వట్లా బాధవడుకుంట ఉం టే నాకు మంచిగనిపిస్తలేదు, అన్నం బెడ్తున్న, ఇంత తినరాదు' అని నా సుష్మ ఒక్కతీరుగ బతిలాడవట్టింది. నాకు ఉండబుద్ధిగాక జరిగిన ముచ్చట ఆమెకు జెప్పిన. 'మరేమనుకుంటున్నవ్? ఇయ్యాళ్ల, రేపు పెద్దపెద్దోళ్లే మొకం జూసి బొట్టు వెడ్తున్నరు. ఇగ గా పిలగాన్ని ఎవ్వలడిగ్రిరు తియి?' అని పళ్లెం ముందలవెట్టింది. ఆయాళ్ల అన్నం దినుకుంటా ఇద్దరాలుమగలం ముచ్చట వెట్టుకున్నం. అప్పుజేసైనా సరే దుకాణం మంచిగ జేయించాలనుకున్నం. ఒక మంగలి కుర్సీ పదిహేను వేల నుంచి ఇరువై వేల దాన్క ఉంటది. అసొంటియి రెండు కుర్సీలు, వాటి సుట్టూ అద్దాలు వెట్టి కొత్తగా జేయాల్నంటే ఎంతలేదన్న ఓ లచ్చ రూపాలు గావాలె. 'ఔనే.. మీ అవ్వగారొళ్ల దిక్కు ఎవ్వలన్న మిత్తికిచ్చేటోళ్లున్నరానే..' అని సుష్మనడిగిన. 'ఇయ్యాల రేపు ఎవ్వలన్న పైసలు నమ్ముతున్నరానయ్యా, మీవోళ్లనే ఎవల్నన్న అడగరాదు? మళ్లా చిట్టీ ఎత్తిద్దాం' అని బరువును నా దిక్కే తోసింది సుష్మ.



కటింగ్ జేస్తున్న గుంజపడుగు పవన్‌కుమార్

అన్నం దిన్నంక నాలుగింటిదాన్క ఇంట్లనే నడుమాల్సిన. సాయంత్రం దుకాన్లకచ్చినంక పైసల్ ఎవ్వల్నడుగుదామా అని ఫోన్ల ఉన్న కాంటాక్టు లిస్టు కిందికంటున్న. ఓ సోపతిగాడు గుర్తుకొచ్చిండు. ఎంబడే వానికి ఫోన్ గల్పిన. 'అరేయ్ మావా.. ఓ లచ్చ రూపాలు అప్పు కింద కావాల్రా, మళ్లా ఐదారునెలల్ల ఇస్తా' అనడిగిన. 'అరేయ్ మావా.. నా దగ్గర లెవ్వుగని, వేరేటోళ్ల దగ్గర ఇప్పియిమంటే ఇప్పిస్తగని, మరి మిత్తి ఎక్కువరా' అని జెప్పవట్టిండు. 'ఏ అద్దురా.. అప్పుదెచ్చి ఈ పెద్దపోక్కిళ్ల తనానికి వోతే, మనం అడ్డీకి సాలమని' ఫోన్ కట్జేసిన.

సామాన్యుడి మాట

రెండు మూడ్రోజులాయె వాట్సాప్‌ల ఓ వార్త చక్కర్లు గొడ్తున్నది గని, నేను పెద్దగ వట్టిచ్చుకోలె. అసలు ఏంటిదా వార్త అని అప్పుడెందుకో ఫోన్ల ఓపెన్ జేసి సదివిన. రాష్ట్ర ప్రభు త్వం పూర్తి సబ్సిడీ మీద 'బీసీలకు లక్ష రూపాల లోన్' ఇస్తున్నదనేది ఆ వార్త సారాంశం. నాత్రి ఇంటికి వోయినంక ఆ ముచ్చట సుష్మతోని జెప్పిన. 'అప్లయ్ అయితే జేసి జూద్దాం, మన అదృట్టం మంచిగుంటే అస్తద'ని బీరువాల ఉన్న కులం, ఆదాయం సర్టిఫికెట్లను ఎంకులాడివెట్టింది. తెల్లారితే బుదారం, జూన్ ఏడో తారీఖు. దుకాన్ల గిరాకీ లేదు. స్కాన్‌జేసి ఉన్న సర్టిఫికెట్లను ఫోన్ల ఓపెన్‌జేసి ఓపారి జూసిన. అదే ఫోన్ల సైట్ ఓపెన్ జేసి లచ్చ రూపాల లోన్ కోసం అప్లయి జేసిన.

2023, జూన్ 9, పొద్దున తొమ్మిదిన్నర గొడ్తున్నది. 'హలో పవన్‌కుమారా..?', 'హల్లో, మీరెవ్వలు? దుకాన్లనే ఉన్న.. గిరాకీ లేదు, జెప్పనరా, జెల్ది కటింగ్ జేసి పంపుతా' ఎప్పుడొచ్చే గిరాకీ గినా గావచ్చునని మాట్లాడుతనే ఉన్నా.. 'హలో.. హలో.. పవన్ నేను కొత్తపల్లి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి సారును వయా' అన్నడు అటునుంచి ఫోన్లో మాట్లాడే వ్యక్తి. 'సార్, సార్.. నమస్తే.', 'నువ్వు లచ్చ రూపాల బీసీ లోనుకు అప్లయి జేస్కున్నవ్ గదా? నీకు ప్రభుత్వం సాంక్షన్ జేసింది, ఇయ్యాళ్ల 11 గంటలకు శుభం గార్డెన్లకు రా, అచ్చి నీ చెక్కు నువ్వు తీస్కాని పో' అని ఫోన్ కట్జేసిండు.

***

తెలంగాణ దశాబ్ది ఉత్సవ సంబురాలు జరుగుతున్నయి. నాకొక్కనికే అనుకున్న. కనీ, నా అసొంటోళ్లు మస్తు మందే ఉన్నరని ఆడికి వోయినంక తెలిసింది. మంత్రి గంగుల కమలాకర్ సార్ వరుసగా చెక్కులిచ్చుడు షురూ జేసిండు. 'గుంజపడుగు పవన్‌కుమార్, నాయీ బ్రాహ్మణ్' అని ముందుగాళ్ల నా పేరే విల్సిర్రు. మంత్రి గంగుల సారు చెక్కు చేతులవెట్టినంక 'కేసీఆర్ సార్ మీ కోసమే ఇంత మంచి పని షురూ జేసిండు. అతారలు గొనుక్కో, పైసల్ దుబార కర్సువెట్టకు' అన్జెప్పిండు. 'సరే సార్' రెండుజేతులా దండం పెట్టిన.

కేసీఆర్ సర్కార్ ఇచ్చిన లచ్చ రూపాలతోని తెల్లారే నా దుకాన్ల పని షురూ జేసిన. రెండు కొత్త కుర్సీలేపిచ్చిన. వాటికె దురుంగ, ఎన్కకు కొత్త కొత్త అద్దాలు వెట్టిచ్చిన. ఇప్పుడు దుకాన్లకచ్చినోళ్లు మళ్లా వాపస్ పోతలేరు.



గడ్డం సతీష్
99590 59041

చెట్టంత ఎదిగిన ఓ మనిషి

పల్లవి:
చెట్టంత ఎదిగిన ఓ మనిషి
చెట్టంటే నీకెందుకు జలసి
చెట్టులేని బతుకు లేదని తెలిసి
బతకబోకు బాధ్యత నువు మరిచి

అను పల్లవి:
చెట్టే జీవితము లేకుంటె శూన్యము
పెట్టు నువ్వొక చెట్టు తోడుంటది ఒట్టు ||చెట్టంత||

చరణం:
నవ మాసాలు మోసి కన్నది నీ తల్లి
ప్రాణవాయువిచ్చి పెంచెను చెట్టు తల్లి
జన్మనిచ్చిన అమ్మ దైవమై కొలువుంది
జగతిని ఆడించె చెట్టు దయ్యమెందుకౌతోంది
చెట్టూ అమ్మే కదా..
(నువ్వు) ఆ అమ్మ బిడ్డవె కదా...
పెట్టు నువ్వొక చెట్టు ఫలముంటది ఒట్టు ||చెట్టంత||

చరణం:
తినె తిండొక చెట్టు కట్టు బట్టొక చెట్టు
కడదాకా చెట్టు తోడుంటది ఒట్టు
పొట్ట బట్ట చెట్టయితే పట్టదెందుకు చెట్టంటే
ప్రగతికదే మెట్టయితే గిట్టదెందుకు చెట్టంటే
చెట్టుకు బతుకునిస్తె..
మనకది బతుకిస్తది...
పెట్టు నువ్వొక చెట్టు ఆసరౌతది ఒట్టు ||చెట్టంత||

చరణం:
నీ కట్టెలో ప్రాణం ఉన్నంత కాలం
కట్టె నీకవసరమె అది తెలిసిన నిజమే
కట్టెల్లో బతికె కట్టె కట్టెల్లో కాలే కట్టె
కట్టెలిచ్చె చెట్టంటే పట్టదెందుకు నీ కట్టెకు
ప్రాణమున్న కట్టెవైతె..
కట్టె నీ ప్రాణమైతె...
పెట్టు నువ్వొక చెట్టు సంరక్షణ చేపట్టు ||చెట్టంత||



ఆరుట్ల నరేశ్
94409 91345



ఈ నెల 21న
అంతర్జాతీయ
యోగా దినోత్సవం

జిందగీ చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 19 జూన్ 2023 www.ntnews.com

పతంజలి మహర్షి మానవాళికి ప్రసాదించిన వరం 'యోగ'. భారతీయ తత్వశాస్త్రాల్లో షట్ దర్శనాల్లో న్యాయం, వైశేషికం, వేదాంతం, మీమాంస, సాంఖ్యం తర్వాత యోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. యోగాభ్యాసం అంతిమలక్ష్యం మనసుపై, శరీరంపై పట్టు సాధించడమే! దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగం. 'యోగశ్చిత్తవృత్తి నిరోధః' అన్నారు పతంజలి మహర్షి. చిత్త వృత్తులు నిరోధించి, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించడమే యోగం. దానికి అష్టాంగ యోగం ఆధారం. యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి ఇందులోని అంశాలు. అది ఆహార విహార నియమాలతో, ఇంద్రియ నిగ్రహాలతో సాగించాల్సిన సాధన.

జీవన యోగం

యమనియమాల ద్వారా చెడు ఆలోచనలు, ప్రేరణలను నియంత్రించడం, మంచి ఆలోచనలను, అలవాట్లను అలవరచుకోవడం సాధ్యమవుతుంది. ఆసన, ప్రాణాయామాల ద్వారా దీర్ఘకాల ధ్యానానికి కావలసిన భంగిమలు, లయబద్ధమైన శ్వాసక్రియను నేర్చుకోవచ్చు. ప్రత్యాహార ధారణల ద్వారా విషయ లోలత్వం కలిగించే వస్తువులపై నుంచి ఇంద్రియాలను మరల్చి ఏకాగ్రతను పెంచుకోవచ్చు. ధ్యాన సమాధి స్థితుల ద్వారా నిరంతరం ధ్యానం చేయడం, దాని ఫలితంగా మనసును పూర్తిగా ఆత్మలో లయం చేయడం కొనసాగించాలి.

మనలోని అంతర్గతశక్తి స్రవంతులను, అతీంద్రియ కేంద్రాలను తెరవగలిగే శరీర భంగిమలే ఆసనాలు. మన దేహం, శ్వాసక్రియ, మనసు.. ఇంకా వీటికి వెలుపల ఉన్న విషయాల గురించి తెలుసుకునేందుకు కావలసిన ఉపకరణాలు ఆసనాలు. వీటి వల్ల మనసుపై అదుపు సాధించి, తద్వారా బాధలను, ఆందోళనలను, ఒత్తిళ్లను అధిగమించవచ్చు. మనసును శాంతపరిచి సమతుల్యత సాధించడానికి, శరీరస్థితి నుంచి మొదలు పెట్టి మానసిక లేక భావోద్వేగ స్థితివరకు యోగాభ్యాసం ఉపకరిస్తుంది.

యోగ సాధనతో మనిషికి శాశ్వతమైన శారీరక, మానసిక స్వస్థత చేకూరుతుంది. శరీరాన్ని ఆరోగ్యవంతంగా చేసే 200 పైచిలుకు ఆసనాలు, భంగిమలు, శ్వాసక్రియలు యోగశాస్త్రంలో పతంజలి మహర్షి పేర్కొన్నారు. ముఖ్యంగా యోగాసనాలు ఎన్నో రుగ్మతలను రూపుమాపుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉదాహరణకు సుఖాసనం, స్వస్తికాసనం, పద్మాసనం, సిద్ధాసనాలు ఆధ్యాత్మిక సాధనకు ఉపకరిస్తాయి. ఎన్నో దీర్ఘకాల వ్యాధులను నియంత్రించడంలోనూ ఇవి ముఖ్యపాత్రను పోషిస్తాయి. మత్స్యేంద్రాసనం, సుప్తమత్స్యేంద్రియాసనంతో మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చు. అలాగే మత్స్యాసనం, సర్వాంగాసనంతో థైరాయిడ్ గ్రంధి వాపు తగ్గుతుంది. యోగాభ్యాసంతో విద్యార్థుల్లో ఆరోగ్యం, చురుకుదనమే కాకుండా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. యువతీ యువకుల్లో వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదురయ్యే ఎన్నో మానసిక, శారీరక సమస్యలకు యోగ తరుణోపాయాన్ని చూపుతుంది. అయితే మనలో చాలా మంది ఆసనాలు వేయడమే యోగాభ్యాసమని భ్రమపడుతూ ఉంటారు. కానీ యమ, నియమాలు పాటిస్తూ ప్రాణాయామాన్ని కొనసాగిస్తూ ప్రత్యాహారం, ధారణ, ధ్యానంతో కూడిన సాధనే యోగాభ్యాసం. అప్పుడే మనసు అత్యున్నతమైన 'సమాధి' స్థితికి చేరుతుంది.

వేదకాలం కన్నా ముందే మనదేశంలో యోగ ఉనికి కనిపిస్తుంది. అతి ప్రాచీనమైన రుగ్వేదం యోగ విద్యను ప్రస్తావించటం విశేషం. క్రీ.పూ.3000 నాటి సింధు లోయ నాగరికతలో యోగ సంప్రదాయానికి చెందిన తొలి ఆనవాళ్లు లభించాయట. అదే విధంగా శ్రీకృష్ణ భగవానుడు బోధించిన 'భగవద్గీత'లో యోగ సంప్రదాయంపై సాధికారిక వ్యాఖ్యానాలున్నాయి. స్వామి వివేకానంద 1893లో అమెరికా పర్యటన సందర్భంగా వెలువరించిన ప్రసంగాల్లో యోగాను ప్రస్తావించారు. ఈ ప్రసంగాలతో యోగసాధనలకు ప్రాచుర్యం ప్రారంభమైంది. ఆ తరువాత పరమహంస యోగానంద వంటి వారు విదేశాల్లో యోగాను విరివిగా ప్రచారం చేశారు.

''**వీరోచిత** కార్యం, తొణికిసలాడే జీవకళ, ఆశావహ దృక్పథం, ఆరోగ్యలక్షణాలు, సద్గుణ ప్రకాశం ఇవన్నీ శక్తికి సంకేతాలు. అందుకే ఎంతకాలం శరీరం నిలిచి ఉంటుందో అంతకాలం దేహం, మనసు దృఢంగా ఉండాలి'' అంటారు స్వామి వివేకానంద. అలాంటి శరీరం, మనసు యోగసాధన వల్ల సుసాధ్యం అనడంలో అతిశయోక్తి లేదు.


... ✍ **ఎమ్.సంజయ్,** యోగాశిక్షకులు
యోగాప్రాంగణం, నార్సింగ్, **9010104851**

మనోనిగ్రహం

గీతావాక్యం

నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా।
నచా భావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్।। (భగవద్గీత 2-66)

ప్రతి మనిషీ మనశ్శాంతిని కోరుకుంటాడు. అందుకోసం పలు మార్గాలను అన్వేషిస్తుంటాడు. కానీ, 'మనశ్శాంతికి మూలం మనోనిగ్రహం కలిగి ఉండటమే' అని బోధించాడు శ్రీకృష్ణ భగవానుడు. 'మనోనిగ్రహం లేనివాని బుద్ధి తప్పుదారి పడుతుంది.



ఆత్మచింతన, ఆత్మనిష్ఠ కూడా సాధ్యం కాదు. ఆత్మచింతన లేని వానికి శాంతి ఉండదు. శాంతి కరువైన వారికి సుఖమెట్లా కలుగుతుంది?' అన్నాడు కృష్ణ పరమాత్మ. నిశ్చల బుద్ధి ఉండాలంటే మనసును నిగ్రహించుకోగలగాలి. మనోనిగ్రహం లోపిస్తే ముందుగా బుద్ధి వికటిస్తుంది. చాంచల్యం వల్ల బుద్ధి మనిషిని పతనం దిశగా నడిపిస్తుంది. అది శాంతికి విఘాతం కలిగిస్తుంది. కనుక జీవితమంతా అశాంతిమయమై దుఃఖభాజనమవుతుంది. దానివల్ల పరమానందస్థితికి అవరోధం ఏర్పడి.. పరమాత్మను చేరుకునే దారి మూసుకుపోతుంది. జీవుడు దేవుణ్ని చేరాలన్న సంకల్పం వికల్పం అవుతుంది. అందుకే శ్రీకృష్ణుడు అర్జునునితో 'సుఖం కావాలంటే శాంతి ఉండాలి. శాంతి ఉండాలంటే ఆత్మభావన కావాలి. అది రావాలంటే ప్రసన్న చిత్తం అవసరం. దానికి మూలం ఇంద్రియ నిగ్రహం. అదే మనోనిగ్రహం' అని సుబోధకంగా చెబుతూ జ్ఞానమార్గాన్ని దర్శింపజేశాడు.

... ✍ **విష్ణువర్ధన్**

నామజప మహిమ

గురుబోధ

భగవంతుడి నామస్మరణ మనల్ని చెడు నుంచి కాపాడుతుంది. మన చేయి అగ్నికి తెలిసి తగిలినా, తెలియక తగిలినా కాలకుండా ఉండదు. అలానే, భగవంతుని నామం పలికితే చాలు పాపాలు పరిహారం అవుతాయి. మనం ఏ పనిలో ఉన్నా, ఏ సమయంలో అయినా దైవనామాన్ని మననం చేస్తూ ఉండాలి.



హరేరామ హరేరామ రామరామ హరేహరే।
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే।।


ఈ మంత్రం అందరూ జపించ తగినది. క్రమం తప్పకుండా దీనిని పఠించడం ద్వారా దేవుడి కృప, చిత్తశుద్ధి కలుగుతాయి. కానీ, మన మానవులు లౌకిక బంధాల్లో కొట్టుమిట్టాడుతూ రోజులో ఒకసారైనా నామస్మరణ చేయడానికి ఆసక్తి చూపడం లేదు. పుట్టడం, పెరగడం, తినడం, పడుకోవడం, బాధ్యతను విస్మరించడం, చనిపోవడం.. ఈ చట్రంలో ఇరుక్కుపోయాడు మానవుడు. ఇలాంటి ప్రవర్తన పశువులది. మనకూ, పశువులకు తేడా ఉండొద్దా?! అందుకే భగవన్నామాన్ని నిరంతరం స్మరించి తరించాలి

... ✍ **అభినవ విద్యాతీర్థ మహాస్వామి**

గంగా స్నానం

కథాసుధ

ఓ ముని ధ్యానం కోసం గంగానదికి బయల్దేరాడు. దారిలో ఒక ఊళ్లో హడావుడి కనిపించి ఆగాడు. అక్కడి మహిళలు గ్రామ దేవతలకు పొంగళ్లు పెడుతున్నారు. 'ఆ గ్రామదేవత గొప్పది, ఈ దేవత గొప్పది' అని వాదించుకోసాగారు. కొద్దిసేపటికి వాదనలు ముదిరి గొడవగా మారింది. అందరూ కలిసి మునిని ఆశ్రయించారు. ఏ గ్రామదేవత గొప్పదో చెప్పమన్నారు. 'నాతోపాటు గంగానది వద్దకు వస్తే ఏ గ్రామదేవత గొప్పదో చెబుతాను' అన్నాడు ముని. అందరూ ముని వెంట కదిలారు. గంగ దరికి చేరాక ముని అందరినీ ఒడ్డుపై కూర్చోబెట్టి నదిని చూడమన్నాడు. తర్వాత కొందరిని రెండో మెట్టు మీద నిలబడి స్నానం చేయమన్నాడు. మరి కొందరిని మూడో మెట్టు మీద, ఇంకొందరిని నాలుగో మెట్టు మీద ఉండి స్నానం చేయమన్నాడు. అలా చేస్తే పుణ్యం లభిస్తుందని చెప్పాడు. దూరంగా ఉన్న గుడిని చూపిస్తూ 'మీరందరూ స్నానాలు పూర్తి చేసుకుని అక్కడికి రండి' అని బయల్దేరబోయాడు. అంతలో ఓ మహిళ 'ఏ మెట్టు మీద స్నానం చేస్తే ఏమిటి? ప్రవహించేదంతా గంగానదే కదా!' అని అడిగింది. ఆయన చిరునవ్వుతో 'నేను చెప్పేది అదే! గంగానదిలో మునిగి స్నానం చేయడానికి చాలాచోట్ల మెట్లు ఉన్నాయి. వాటిలో కొన్ని మెట్లు మంచివి, మరికొన్ని చెడ్డవి అని చెప్పడానికి వీలు లేదు. ఏ మెట్ల మీదుగా వెళ్లినా నదిలో స్నానం చేయవచ్చు. పుణ్యం సంపాదించవచ్చు. అలాగే గ్రామ దేవతలు కూడా. నమ్మి ఎవరిని ప్రార్థించినా మంచిదే. మనకు మనమే ఆ దేవత గొప్ప, ఈ దేవత గొప్ప అంటుంటాం. ఎవరుగొప్ప అనే ఆలోచనే మంచిది కాదు' అని వివరించాడు. దేవతలందరూ సమానమే అని తెలుసుకున్న గ్రామవాసులు తమ అజ్ఞానాన్ని కడిగేయమంటూ గంగానదిలో మరోసారి స్నానం చేశారు.




... ✍ **ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821**

ఈ నెల 24 నుంచి హజ్ యాత్ర

అందరూ అల్లాహ్ అతిథులే!


హజ్ యాత్ర సమానత్వానికి ప్రతీక. రాజు-సేవకుడు, ధనిక- పేద తేడాలు ఇక్కడ ఉండవు. అల్లాహ్ దృష్టిలో అందరూ సమానులే. వేసుకునే దుస్తుల రంగు ఒకటే.. తెలుపు! నినాదం ఒకటే.. 'అల్లాహు అక్బర్'. జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేపట్టాలని భావిస్తారు ముస్లింలు. ఈ మేరకు ఏటా ప్రపంచం నలుమూలల నుంచి కోట్లాది విశ్వాసులు కాబా గృహానికి చేరుకుంటారు. ఐదు రోజుల యాత్రలో ఎలాంటి భేషజాలకూ పోకుండా, ఎంతో నిరాడంబరంగా అల్లాహ్ నామస్మరణలో గడుపుతారు. ఒకరోజు ఉపవాసాన్ని పాటించడం, మరో రోజు ఖుర్బానీ చేయడం, కాబా ప్రదక్షిణలు, సఫా మర్వా కొండల మధ్య తిరగడం, అరఫాత్ మైదానంలో విడిది చేయడం లాంటివన్నీ హజ్ యాత్రలో క్రతువులు. స్తోమత గల ప్రతీ ముస్లిం హజ్ యాత్ర చేయడం విధి. ఇస్లామ్ ఐదు మూల స్తంభాల్లో హజ్ ఒకటి. ధర్మబద్ధంగా, నిజాయతీగా సంపాదించిన డబ్బుతోనే ఈ యాత్ర చేయాలన్నది ప్రవక్త ఉద్బోధ. 'ఎవరైతే ఎలాంటి అపసవ్యమైన చేష్టలకు, వ్యర్థ విషయాలకు పాల్పడకుండా, దైవ అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్తపడుతూ హజ్ చేస్తాడో అతను ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టినవానిలా పరమ పవిత్రంగా తిరిగి వస్తాడు' అని ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఉపదేశం. చిన్నా, పెద్ద, యువకులు, వృద్ధులు, స్త్రీలు, పురుషులు ఎవరైనా హజ్ యాత్రకు వెళ్లవచ్చు. వయోభేదం, లింగభేదం లేదు. హజ్ యాత్రకు వెళ్లేవారంతా అల్లాహ్ అతిథులు.

... ✍ **ముహమ్మద్ ముజాహిద్, 96406 22076**



అంబరీషుని భక్తి సంబరాలు

భాగవత నవమ స్కంధానికి లక్షణం 'ఈశాను కథలు'. ఇందులో సూర్య, చంద్రుల వంశాల విస్తృత వర్ణన ద్వారా భగవదవతారాలు, భక్తుల చరిత్రలూ అచ్చంగా ముచ్చటింపబడినాయి! సూర్యచంద్రులు లోకంలో నిష్కామ కర్మయోగానికి నిఖార్సైన- నిలువెత్తు నిదర్శనాలు- దృష్టాంతాలు. ఈ స్కంధం వైరాగ్య ప్రధానం. కనుక, ఈ కథలు శ్రద్ధగా విన్నా, చదివినా అంతఃకరణంలోని అశుభ వాసనా దోషాలు సాంతం అంతరించిపోతాయి.



మన పోతన మధురిమ 141వ భాగం

'అంబరం' అంటే ఆకాశం. 'ఈశః' అంటే ఈశ్వరుడు- భగవంతుడు. అంతటా వ్యాపించి ఉన్న ఆకాశం వలె విష్ణువును సర్వత్ర- లోపల వెలుపల వ్యాపకంగా వీక్షించు వాడే అంబరీషుడు. ఇది 'భాగవత రహస్యం'లో డోంగ్రే మహారాజ్ గారి వ్యాఖ్య.



శుకుడు పరీక్షిత్తుతో.. రాజా! పరమ పురుషుని నాభి మధ్యం నుంచి బంగారు పద్మం పుట్టింది. అందులో నుంచి చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించాడు. బ్రహ్మపుత్రుడు మరీచి మహర్షి. మరీచి కుమారుడు కశ్యపుడు. అదితి, కశ్యపులకు ఆదిత్యుడు- సూర్యుడు ఉదయించాడు! సూర్యునికి సంజ్ఞయందు వైవస్వత మనువు జన్మించాడు. ఈయనే శ్రద్ధాదేవికి భర్తయైన శ్రాద్ధదేవుడు. ఈ పుణ్యదంపతులకు ఇక్ష్వాకు మొదలైన పదిమంది పుత్రులు పుట్టారు. వీరిలో 'నభగుడు' తొమ్మిదవ వాడు. నభగుని పుత్రుడు నీతిమంతుడైన నాభాగుడు. విద్యాధ్యయనం సాగిస్తూ దీర్ఘకాలం గురుకులంలో గడిపిన అతనికి చెందాల్సిన ఆస్తిని అన్నలు ఇద్దరూ కుమ్మక్కై 'చెరిసహాయ స్వాహా!' చేసేసుకున్నారు. తమ్ముడు వచ్చి నా సొమ్ము ఇమ్మని అడిగితే.. 'నీ కొమ్ముకాచే ముసలివాడు.. మన తండ్రి ఇంకా బతికే ఉన్నాడుగా! ఆయనే నీ వాటా, పట్టుకెళ్లు' అన్నారు అన్నదమ్ములు. భాగం లేదు పొమ్మన్నారు, కనుక 'నాభాగ' అన్న నామం సార్థకమయింది. జరిగినదంతా నాభాగుడు తండ్రికి తెలిపాడు. అప్పుడు నభగుడు... 'నాయనా! బాధపడకు. అంగిరసులనే బ్రాహ్మణులు మనకు దగ్గరలోనే గొప్ప సత్త్రయాగం చేస్తున్నారు. వారు మేధావులైనా యాగంలో ఆరవ నాటి కర్మకాండను తెలుసుకోలేని మూఢులవుతారు. నువ్వు వెళ్లి వారికి అవసరమైన రెండు వైశ్వదేవ సూక్తాలు మంత్రార్థంతో సహా వినిపించు. వారు సంతుష్టులై స్వర్గానికి వెళుతూ యాగంలో మిగిలిన ధనం నీకు దక్షిణగా ఇస్తారు' అన్నాడు. అన్నప్రకారమే జరిగింది. కాని, ఆ ధనం తెచ్చుకొనే సమయంలో రుద్రుడు అడ్డుతగిలి 'యజ్ఞశేషం నీది కాదు, నాదే. కాదంటే మీ నాన్నగారి నిర్ణయం తెలుసుకు రా, నేను అంగీకరిస్తా' అన్నాడు. వెళ్లి అడుగగా 'నిజమే నాయనా! ఆ ధనం రుద్రదేవతకే చెందుతుంది. ఇది మహర్షుల నిర్ణయం' అని తెలిపాడు తండ్రి. నాభాగుడు తిరిగివచ్చి రుద్రునితో 'దేవా! ఈ ధనం మీదేనని నా తండ్రి చెప్పాడు. నేను తప్పు చేశాను. క్షమించు' అని పాదాలు పట్టుకొన్నాడు. నభగుని ధర్మానుకూల న్యాయ నిర్ణయానికి, నాభాగుని సత్య వచనానికి మెచ్చి మహాదేవుడు, నాభాగునికి ఆ సొమ్ముతోపాటు ఆత్మదర్శనాన్ని- బ్రహ్మజ్ఞానాన్ని కూడా అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

నాభాగుని ధర్మదీక్షకు, నైతిక నిష్ఠకు మహాఫలంగా ఉత్తమ భక్తసంతానం ఆయనకు లభించింది. ఉదారమైన ఉత్కృష్ట నీతి ఉన్నచోటనే ఉత్తమ భక్తికి ప్రతిష్ఠ గదా! నాభాగునికి పరమ భాగవతుడైన అంబరీషుడు జన్మించాడు. ఈ 'అంబరీషోపాఖ్యానం' విశ్వంభరుని విశేష కృపకు, భక్తపాలన కళా సంరంభత్వానికి, భక్త పరాధీనత్వానికి ఉజ్జ్వల దృష్టాంతం. దయ వేరు, కృప వేరు అన్న సూక్ష్మమూ, సున్నితమూ అయిన విషయం ఈ ఉపాఖ్యానంలో రసరమ్యంగా నిరూపితమైంది. 'అంబరం' అంటే ఆకాశం. 'ఈశః' అంటే ఈశ్వరుడు- భగవంతుడు. అంతటా వ్యాపించి ఉన్న ఆకాశం వలె విష్ణువును సర్వత్ర- లోపల వెలుపల వ్యాపకంగా వీక్షించువాడే అంబరీషుడు. ఇది 'భాగవత రహస్యం'లో డోంగ్రే మహారాజ్ గారి వ్యాఖ్య. అంబరమనగా వస్త్రమని కూడా అర్థం. విష్ణువును వస్త్రం వలె కప్పుకొని, ఆ స్వామి రక్షణలో ఉన్న నాకు ఎప్పటికీ ముప్పు వాటిల్లదన్న అఖండ విశ్వాసం కలవాడే అంబరీషుడని అధ్యాత్మపరంగా అంతరార్థం. అంబరీషునిది వైధీభక్తి. భక్తి శాస్త్రం బోధించే విధి విధానాలకు- నియమాలకు లోబడి తు.చ తప్పక ప్రవర్తిల్లే భక్తి. 'షడ్విధా శరణాగతిః' అని గతంలో గజేంద్ర మోక్షణ ఘట్టంలో వివరించిన, శరణాగతికి ఆవశ్యక అంగాలైన ఆరు లక్షణాలూ సలక్షణంగా సమ్మిళితమై ఉన్న రాజీపడని భక్తి అంబరీష మహారాజుది. 'ఆ మహాభక్తుని పట్ల తిరుగు- అడ్డులేని బ్రాహ్మణ శాపం కూడా నడ్డి విరిగి వ్యర్థమైపోయింది' అని శుకముని పలుకగా విని పరీక్షిత్తు- 'ధీమణీ! దాటరాని అవనీసుర (బ్రాహ్మణ) శాపం ఎందుకని అంబరీషుని ఏమీ చేయలేకపోయింది? నాకు విన వేడుకగా ఉంది. వివరించమ'ని వేడగా బాదరాయణి (శుకుడు) మోదమంది, సాదరంగా ఇలా వినిపించాడు... రాజా!

> శా।।'సప్తద్వీప విశాల భూభరము దోఃస్తంభంబునం బూని సంప్రాప్త శ్రీయుతుడై మహా విభవసంపచ్చాతురిం గల్గి దుర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్ సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్ఠుం డంబరీషుండిలన్'

సద్గుణ గరిష్ఠుడు, సద్భక్త వరిష్ఠుడు, భగవన్నిష్ఠుడు అయిన అంబరీషుడు ఏడు ద్వీపాలతో కూడిన అవనీ (భూ) భారాన్ని తన భుజ స్కంధాలపై మోస్తూ, సకల శుభాలతో కూడిన మహావైభవోపేతమైన సంపదలు కలిగి ఉన్నా, సంసార బంధాలకు చిక్కకుండా, దుష్ప్రవర్తన- చెడు నడతకు లోను కాకుండా, అప్రమత్తుడై- విషయలోలత్వం లేక, భక్తి నియమాలను పట్టుదలతో పాటిస్తూ, కాలం వెళ్లబుచ్చుతూ లోకంలో ఎంతో ప్రశస్తిపొందాడు.

ఆ రాజచంద్రుని దినచర్యను, దివ్య చరిత్రను మధుర మంజులంగా పాఠక హృదయాలు రంజిల్లే విధంగా వర్ణించిన భక్త కవి సార్వభౌమునికి ప్రణామాంజలి ఘటిద్దాం. శుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా!

> సీ।। 'చిత్తంబు మధురిపు శ్రీపాదముల యంద,
> పలుకులు హరిగుణ పఠనమంద
> కరములు విష్ణుమందిర మార్జనములంద,
> శ్రవములు హరికథా శ్రవణమంద
> చూపులు గోవింద రూపవీక్షణమంద,
> శిరము గేశవ నమస్కృతుల యంద
> పదములీశ్వరగేహ పరిసర్పణములంద,
> కామంబు చక్రి కైంకర్యమంద'
>
> తే।।'సంగమచ్యుత జనతను సంగమంద
> ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద
> రసన తులసీ దళములంద, రతులు పుణ్య
> సంగతుల యంద యా రాజ చంద్రమునకు'

ఆ మహాభాగవతుని ఎద- మనసు ఎప్పుడూ మాధవుని పాదపద్మాలపై తుమ్మెద వలె వ్రాలి ఉంటుంది. ఆయన వాక్కుకు వాసుదేవుని గుణ సంకీర్తనం వ్యసనం, కరా (చేతు)లకు వరాలిచ్చే ఇందిరావరుని మందిరాలను పొందికగా శుభ్రపరచి అందగించడం వ్యసనం. చెవులకు చవులూరించే చక్రహస్తుని కథలు వినడం వ్యసనం. చూపులకు కమలాక్షుని రూపాన్ని వీక్షించడం వ్యసనం. శిరస్సుకు శ్రీపతికి నతులొనర్చడం వ్యసనం. పాదాలకు పరమాత్ముని పవిత్ర ఆలయాలకు ప్రదక్షిణలు చేయడం వ్యసనం. ఆయన కోరికకు కేశవ కైంకర్యం- సేవ వ్యసనం. విష్ణు భక్తులతోటి చెలిమియే ఆ పరమ వైష్ణవుని కలిమి. అచ్యుత భక్తుల అంఘ్రి (పాద) పద్మాలను ఆఘ్రాణించడంలోనే ఆయన నాసికకు ఆనందం. రసన (నాలుక)కు తులసీదళాలయందే వ్యసనం. ఆ ధన్యజీవికి సర్వేశ్వరుని పుణ్య విషయాలలోనే ప్రేమాసక్తులు ప్రబలంగా ఉండేవి!



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

ధర్మ సందేహం

గోరింటాకు ఎందుకంటే..

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు ధరించాలని చెబుతారు ఎందుకు?

● **సరిత,** గోదావరిఖని

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఒక ఆచారంగా మన సమాజంలో స్థిరపడింది. అలంకరణలో భాగమని భావించినా, దీని వెనుక ఎన్నో ప్రత్యేకతలు దాగి ఉన్నాయి. గోరింటాకు మహిళల చేతులకూ, పాదాలకూ అందాన్ని రెట్టింపు చేస్తుంది. ఇదేదో అలంకరణ కోసం తెచ్చిన ఆడంబరం కాదు. గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఎన్నో ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఆషాఢ మాసంలో వాతావరణ ప్రభావం వల్ల అనేక సూక్ష్మ క్రిములు వ్యాపిస్తూ ఉంటాయి. వానల రాకతో గాలిలో, నీటిలో వీటి శాతం ఎక్కువగా ఉంటుంది. తేమలో ఉండే సూక్ష్మ క్రిముల ప్రభావం చేతులు ద్వారా, పాదాల ద్వారా చర్మ రంధ్రాలగుండా శరీరంలో ప్రవేశించకుండా గోరింటాకు కవచంగా పనిచేస్తుంది. అంతేకాదు, గోరింటాకు ఒత్తిడిని, వేడిని తగ్గిస్తుంది. స్త్రీ అరచేతి మధ్యలో గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాన నాడులు ఉంటాయి. గోరింటాకు ఆ నాడుల్లో ఏర్పడే అతి ఉష్ణాన్ని లాగేస్తుందని, తద్వారా గర్భాశయ దోషాలు తొలగిపోతాయని చెబుతున్నది ఆయుర్వేదం. ... ✍ **శ్రీ**



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 20.6.2023 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+16/12 Pages: 12+16/12 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 15 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



రంగారెడ్డి జిల్లా తుమ్మలూరులో సోమవారం మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు సంతోష్, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సీఎస్ శాంతికుమారి

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మద్దతు ధర కోసం రైతుల ఆందోళనలు. రోడ్డెక్కుతున్న అన్నదాతలు. మహారాష్ట్రలో ఉల్లిరైతులు, హర్యానాలో పొద్దుతిరుగుడు రైతులు.. ఇలా పలు రాష్ట్రాల రైతులు పంట పండించటానికి, పండిన పంట అమ్ముకోవటానికి నానా తంటాలు పడుతున్నారు. సాగునీటికి కటకట.. కరెంటు కష్టాలు..దళారుల మోసాలు.. ప్రభుత్వాల అలసత్వం.. వెరసి భారతీయ రైతు దగాపడుతున్నాడు. ఒక్క తెలంగాణలో తప్ప.

పంట పెట్టుబడి కోసం ఏడాదికి రెండు విడతలుగా రైతుబంధు, పంట సమృద్ధిగా పండటానికి సరిపడా సాగునీరు, పొలానికి నీరు పారించటానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు. పైరు ఏపుగా పెరగటానికి అవసరమైన ఎరువులు.. ఇలా ఒకటే మిటి అన్నదాత అవసరాలన్నింటికీ తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. పండించిన ధాన్యం మొత్తాన్ని కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వరి సాగులో నంబర్ వన్‌గా ఉన్న పంజాబ్‌ను దాటి సరికొత్త రికార్డు సృష్టించింది తెలంగాణ. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా త్వరలో ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించనున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ.

తరాలుగా పరిష్కారానికి నోచుకోని పోడు భూములకు పట్టాలివ్వటమే కాదు.. ఈ వానకాలం నుంచి పోడుభూములకు కూడా రైతుబంధు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి దోహద పడేలా.. ప్రపంచమే అబ్బుర పడేలా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం... అలాంటి మరో భారీ ప్రాజెక్టు పాలమూరు- రంగారెడ్డిని కూడా అతి త్వరలో పూర్తి చేయనున్నది. ఆరునూరైనా.. ఎవరు అడ్డుపడినా, గోదావరి నీటిని మళ్లించైనా ప్రాజెక్టును పూర్తి చేసే కృతనిశ్చయంతో ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం దండగ అన్న స్థితి నుంచి కేవలం తొమ్మిదేండ్లలో వ్యవసాయం పండుగ అనేలా చేశారు సీఎం కేసీఆర్. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశం మొత్తమ్మీద రైతు రాజ్యం అంటే ఒక్క తెలంగాణే అనేలా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌ది. ఆయన దార్శనికత, ఆయన కార్యదక్షత, ఆయన మార్గనిర్దేశనం వెరసి తెలంగాణలో రైతేరాజు.



రైతు రాజ్యం.. తెలంగాణ

'పాలమూరు' నీళ్లు పారిచ్చి తీరుతం

- 85% ప్రాజెక్టు పూర్తి.. ఆగస్టులో నీళ్లు నింపుతం
- ప్రాజెక్టు ఆలస్యం కాంగ్రెస్ నాయకుల పుణ్యమే
- కాళేశ్వరంతో పాటే ఇది కూడా పూర్తయ్యేది
- సుప్రీంకోర్టు నుంచి స్టేలు తెచ్చి పనులు ఆపిన్రు
- కృష్ణా నుంచి కాకపోతే గోదావరి నీళ్లు పారిస్తా
- మళ్లీ మనమే గెలుస్తున్నాం.. అందులో డౌటే లేదు
- వచ్చే టర్మ్‌లో మరింత బ్రహ్మాండంగా అభివృద్ధి
- రాబోయే 3, 4 నెలల్లో మీరంతా మార్పు చూస్తరు
- కందుకూరు మండలం దాకా మెట్రోను విస్తరిస్తం
- రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు బహిరంగసభలో కేసీఆర్
- హరితోత్సవంలో మొక్కలు నాటిన ముఖ్యమంత్రి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి తీరుతామని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. పాలమూరు ఎత్తిపోతల దాదాపు 85 శాతం పూర్తయిందని, ఆగస్టులో ప్రాజెక్టు రిజర్వాయర్లలో నీళ్లు నింపుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు సుప్రీంకోర్టులో కేసులు వేయటంతోనే ప్రాజెక్టు ఆలస్యమవుతున్నదని, కృష్ణా నుంచి కాకపోతే గోదావరి నీళ్లు పారిస్తానని భరోసా ఇచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుమ్మలూరులో నిర్వహించిన హరితోత్సవంలో సీఎం కేసీఆర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటే పాలమూరు పూర్తి కావాల్సిందని, పుణ్యాత్ములు కాంగ్రెసోళ్ల వల్లే ఆలస్యమైందని తెలిపారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లి స్టేలు తెచ్చి పనులు ఆపి పుణ్యం కట్టుకున్న నాయకులని మండిపడ్డారు. ఎండిపోయిన గడ్డకు › 4వ పేజీలో

రైతు వద్దకే రైస్‌మిల్లు

కల్లాల్లో వానొస్తే పంటంతా నీళ్ల పాలు.. మార్కెట్‌కు పోవాలంటే రవాణా తిప్పలు..తరుగు పోతుందేమోనన్న భయాలు..మద్దతు ధర దక్కుతదో, లేదోనన్న బుగులు..రైతు పంట పండించటం ఒకెత్తు.. అమ్మేదాకా కాపాడుకోవటం ఇంకో ఎత్తు..

ఈ తిప్పలు తప్పించేలా విప్లవాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శ్రీకారం చుట్టారు. పండించిన పంటకు లాభాలు అందించేలా 'రైతు వద్దకే రైస్‌మిల్లు'ను తీసుకురావాలని నిర్ణయించారు. రాష్ట్రం దశాబ్ది వేడుకలు జరుపుకొంటున్న ఈ శుభసమయాన సీఎం కేసీఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

ఏ కారణం చేతనైనా పండిన పంట వ్యర్థం కాకుండా, తరుగు లేకుండా, రైతులకు ధర తగ్గడం వంటి నష్టాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. రైతు పంటకు ఓపెన్ మార్కెట్ రేట్ ధర పలికేలా చేయడానికి వరిధాన్యాన్ని పలు రకాల ఉత్పత్తులుగా మార్చే దిశగా జిల్లాల వారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో గంటకు 60 టన్నులు, 120 టన్నుల బియ్యాన్ని ఆడించే అత్యాధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేయనున్నాం.

– సీఎం కేసీఆర్

- ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- ఇక ఆహార ఉత్పత్తులుగా రైతుల పంటలు
- సీఎం కేసీఆర్ మరో సంచలన నిర్ణయం
- యూనిట్ల ఏర్పాటుకు 2 వేల కోట్ల ఖర్చు
- రైతుకు నష్టం రానివ్వం.. అది మా బాధ్యత
- ధాన్యాన్ని ఆహార ఉత్పత్తులుగా మారుస్తాం
- అత్యాధునిక రైస్‌మిల్లులను ఏర్పాటుచేస్తాం
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెల్లడి
- సటేక్ కార్పొరేషన్ (జపాన్) ప్రతినిధులతో చర్చలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): అన్నదాతల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకొన్నది. వరి ధాన్యాన్ని బియ్యం, నూనె వంటి పలు రకాల ఉత్పత్తులుగా మార్చే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నది. ఇందులో భాగంగా రైతుల వద్దకే రైస్‌మిల్లులు రానున్నాయి. జిల్లాల వారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, పంట ఉత్పత్తులు విశ్వవిపణిలో అమ్ముకొని లాభాలు ఆర్జించే స్థాయికి రైతన్నను చేరుస్తామని సీఎం కేసీఆర్ › 7వ పేజీలో



26 నుంచి రైతుబంధు

- 24 నుంచి పోడు భూములకు పట్టాలు
- పట్టాల పంపిణీ తర్వాతే పెట్టుబడి సాయం
- వర్షాభావం పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి
- పైసలు పోయినా సరే.. పంటలు కాపాడుకుందాం
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్
- పాలమూరు–రంగారెడ్డి పనుల పురోగతిపై సమీక్ష



రాష్ట్రంలో అర్హులైన రైతులు **66,00,000**

పోడు పట్టాలు పొందనున్న రైతులు **1,50,224**

పట్టాలు అందజేయనున్న పోడు భూమి **4,00,000** ఎకరాలు

ఈ సీజన్‌లో పెట్టుబడి సాయం **7,500** కోట్లు

వానకాలం సీజన్‌తో కలిపి మొత్తం రైతుబంధు సాయం **72,000** కోట్లు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రైతాంగానికి సీఎం కేసీఆర్ చల్లని కబురు చెప్పారు. ఈ వానకాలం సీజన్ 'రైతుబంధు' సాయాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఎప్పటి మాదిరిగానే రైతుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ చేయాలని సూచించారు. పోడు రైతులకు కూడా ముఖ్యమంత్రి శుభవార్త చెప్పారు. ఈ సీజన్‌లో పోడు పట్టాల పంపిణీ పూర్తి కాగానే, ఆ రైతులకు కూడా రైతుబంధు సాయం పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రుతుపవనాల ఆలస్యం, వానాకాలం పంట సాగు నీటి సరఫరాకు ముందస్తు › 7వ పేజీలో

ఈ వారంలోనే సీఐలకు పదోన్నతి

- 155 మందికిపైగా డీఎస్పీలుగా పదోన్నతి
- నేడు డీపీసీ సమావేశం
- 4 రోజుల్లో ఉత్తర్వులు › 8

తకరారు బాబు ఎకరాల ఏడుపు



'ఒకప్పుడు ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో నాలుగెకరాలు కొనేవాళ్లు. ఇప్పుడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రాలో యాభై ఎకరాలు, వందెకరాలు కొనే పరిస్థితి వచ్చింది'

– సోమవారం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు

- తెలంగాణలో ఎకరం అమ్మితే.. ఏపీలో 50 ఎకరాలు
- గతంలో ఆంధ్రాలో ఎకరం.. ఇక్కడి నాలుగెకరాలట!
- టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్కసు వ్యాఖ్యలు
- తెలంగాణ బాగు కోరని బాబు.. నొసటితో వెక్కిరింతలు
- రెచ్చగొట్టేందుకే ప్రయత్నం.. ప్రశంసల పాచిక అందుకే!

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నిర్మాణానికి తానే ముగ్గుపోసానని చెప్పుకునే చంద్రబాబునాయుడు.. పదే పదే తనను తాను ప్రపంచ నిర్మాతగా ప్రకటించుకునే చంద్రబాబునాయుడు.. అత్యధిక కాలం పరిపాలించిన ముఖ్యమంత్రిగా చెప్పుకొనే చంద్రబాబునాయుడు.. రాష్ట్రపతి, ప్రధానులను తానే నియమించానని చెప్పుకునే చంద్రబాబునాయుడు.. ఇన్నాళ్లకు ఆయన నోటివెంట ఒక నిక్కమైన, నిజమైన మాటొకటి వచ్చింది. 'ఒకప్పుడు ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో నాలుగెకరాలు కొనేవాళ్లు. ఇప్పుడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రాలో యాభై ఎకరాలు, వందెకరాలు కొనే పరిస్థితి వచ్చింది' అని బాబు వ్యాఖ్యానించారు. సోమవారం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీ అధినేత రెండు రాష్ట్రాల్లో భూముల విలువను పోల్చుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పైకి చూస్తే చంద్రబాబు వ్యాఖ్య ప్రశంసలా కనిపిస్తుంది కానీ, కాదు. తెలంగాణవాళ్లకు బతకడం, బట్టకట్టడం, వరి అన్నం తినడం నేర్పామంటూ పలు సందర్భాల్లో అహంకారం చూపిన నోరు కదా అది. ఆధిపత్య అహంకారాన్ని అణువణువునా నింపుకొన్న బాబు తన స్వభావానికి భిన్నంగా ఎక్కడైనా, ఎప్పుడైనా తెలంగాణను ప్రశంసిస్తడా? ఆయన జీవితకాలంలో ఆ పనిచేస్తడా? అందునా కేసీఆర్‌ను పొరపాటునైనా బాబు ప్రశంసిస్తడా? అదే ఆలోచించాల్సిన విషయం. అర్థం, అవగతం చేసుకోవాల్సిన విషయం. మరి చంద్రబాబు ఈ మాటలు ఎందుకు అన్నారు? వీటి లోతేమిటి? లోగుట్టేమిటి? అంతరార్థమేమిటి? అసలు సంగతేమిటి?

తెలంగాణ అంటే బాబుకు మొదటినుంచీ అవమానం. బాబు అంటేనే తెలంగాణకు మొదటినుంచీ అనుమానం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో నలిగిన తెలంగాణకు సమైక్యపాలకుల నల్లికుట్ల వ్యవహారాలు, నక్కజిత్తుల పన్నాగాలు, నంగి మాటలు బాగా ఎరుక. రాష్ట్ర ఏర్పాటును బలంగా వ్యతిరేకించిన చంద్రబాబు.. ప్రపంచంలోనే ఎక్కడాలేని 'రెండుకండ్ల సిద్ధాంతం' › 7వ పేజీలో

2.73% డీఏ మంజూరు

- ఉద్యోగులు, పెన్షనర్లకు దశాబ్ది ఉత్సవాల కానుక
- ఉత్తర్వులు జారీ.. 2022 జనవరి నుంచి అమలు
- ఉద్యోగ సంఘాల హర్షం

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త తెలిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ పెంచుతూ ఆర్థిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బేసిక్ పే లేదా పెన్షన్‌పై 2.73% పెంచుతున్నట్టు తెలిపింది. దీనిని 2022 జనవరి నుంచి వర్తింపజేయనున్నట్టు వెల్లడించింది. పెంచిన డీఏను జూలై వేతనంతో కలిపి చెల్లించనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై రూ.1,380.09 కోట్ల ఎరియర్స్‌తోపాటు ప్రతి నెల రూ.81.18 కోట్లు, ఏటా రూ.974.16 కోట్లు అదనపు భారం పడనున్నది. రాష్ట్రంలోని 7.28 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనున్నది. తాజా పెంపుతో ఉద్యోగుల డీఏ, పెన్షనర్ల డీఆర్ 20.02% నుంచి 22.75 శాతానికి › 8వ పేజీలో

బీజేపీ, ఎన్సీపీలకు షాక్

- మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఇరు పార్టీల జిల్లా కార్యదర్శులు
- గులాబీ పార్టీలోకి బీడ్, ఔరంగాబాద్ నేతలు..
- కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన సీఎం కేసీఆర్ › 8

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ


రాజకీయ భక్తి

ఓడ మల్లయ్య సామెత బీజేపీకి వర్తించినంతగా మరే ఇతర పార్టీకి వర్తించదేమో. మతోద్ధరణ తమ గుత్తహక్కు అని చెప్పుకొంటారు ఆ పార్టీ నేతలు. కానీ మతపరమైన విషయాల్లో ఇచ్చిన హామీని కూడా హుళక్కి చేయడం వారికే చెల్లింది. గత ఎన్నికలకు సుమారు ఏడాది ముందు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు అయోధ్య ఆలయాలు, మఠాలకు అన్నిరకాల పన్నులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. అన్న ప్రకారమే అన్ని పన్నులను రద్దు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీచేసింది. అంతంతమాత్రం ఆదాయంతో నెట్టుకొస్తున్న మహంతులు, పూజారులు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ వారి సంతోషం ఎంతో కాలం నిలవలేదు.

ఎన్నికల్లో గెలిచిన దరిమిలా దొడ్డిదారిన సింబాలిక్ ట్యాక్స్ పేరిట పన్నులు వడ్డిస్తున్నది. దాంతో హర్షం వ్యక్తంచేసిన మహంతులే మండిపడుతున్నారు. ఇదంతా జరుగుతున్నది బీజేపీ గొప్పగా చెప్పుకొనే భవ్య రామమందిరం నిర్మాణమవుతున్న అయోధ్యలోనే కావడం గమనార్హం. అయితే అన్నిరకాల పన్నులు రద్దుచేయడం వల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని అయోధ్య మునిసిపల్ కార్పొరేషన్ ప్రభుత్వానికి ఓ వినతిపత్రం ఎన్నికలకు ముందే సమర్పించింది. ఆ సంగతిని ఎన్నికలు పూర్తయ్యేవరకు బీజేపీ సర్కారు దాచిపెట్టింది. ఎన్నికల్లో విజయం దక్కగానే మళ్లీ పన్నుపోటుకు తెగబడింది. ఏప్రిల్ 1 నుంచి స్లాబులవారీగా పన్ను వసూలు చేస్తున్నారు. దీనిపై మహంతులు మండిపడుతున్నారు. చీటికి మాటికి ఆలయాల ఉద్ధరణ గురించి ఊదరగొట్టే బీజేపీకి నిజంగా ఆ విషయంలో ఉన్న శ్రద్ధ ఎంత? అనేది ప్రశ్నగానే మిగులుతుంది. గతంలో బీహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు ఆలయాల మీద నాలుగు శాతం పన్ను వేసి బీజేపీ అభాసుపాలైంది. ఆలయాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండరాదని సోషల్ మీడియాలో ప్రచారం చేసే బీజేపీ పన్నుల విషయం వచ్చేసరికి ఎలా ప్రవర్తిస్తుందో ఈ ఉదంతాలు తెలియజేస్తున్నాయి.

కేవలం అయోధ్యకు పరిమితమైన సమస్య కాదు. కాశీ, కేదార్‌నాథ్, జోషీమఠ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాల పరిరక్షణ విషయంలోనూ బీజేపీ పనితీరు సానుకూలంగా ఏమీ లేదు. కాశీ విశ్వనాథ ఆలయం పరిసరాల్లో సుందరీకరణ పేరిట జరిపిన కూల్చివేతలపై తీవ్రస్థాయి విమర్శలు వచ్చాయి. ఆధ్యాత్మిక, చారిత్రక వారసత్వ సంపదను ధ్వంసం చేశారని పత్రికలు రాశాయి. చార్‌ధామ్‌లో భాగమైన కేదార్‌నాథ్ ఆలయంలో గోడలకు బంగారు తాపడాల విషయంలో గోల్‌మాల్ జరుగుతున్నట్టు అక్కడి పూజారులే ఆరోపించడం గమనార్హం. దీనిని అధికారులు ఖండించారు. ఇక జోషీమఠ్ ప్రాంతం కృంగిపోవడం వెనుక కారణాలను అన్వేషించిన కమిటీ అభివృద్ధి పేరిట చేపట్టిన పనులే ముప్పుతెచ్చాయని పేర్కొన్నది. ఎడా పెడా కొండలను పేల్చి రోడ్లు వేయడం, ఎన్టీపీసీ భారీ ప్రాజెక్టు కట్టడం వంటివి కుంగుబాటుకు దారితీశాయని తేల్చిచెప్పింది. ఆధ్యాత్మికతను కేవలం టూరిజం కోణంలో చూడటం వల్ల సమస్య వస్తున్నదని అంటున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ నిర్మాణాలు విరివిగా జరుగుతున్నాయి. దీనివల్ల ఆధ్యాత్మిక అంశాలకు ఉండే పవిత్రత గాలికిపోతున్నది. వ్యాపార ధోరణి పెచ్చరిల్లుతున్నది. మతం, దేవుడు, ఆధ్యాత్మికతను రాజకీయం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందే బీజేపీకి దేవుని మీద కన్నా అధికారం మీదే భక్తి ఎక్కువ అని చెప్పవచ్చు.

బీజేపీ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికే..



ప్రస్ఫుటంగా కనిపిస్తున్న తన వైఫల్యాల నుంచి జనం దృష్టిని మళ్లించేందుకు ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ప్రస్తుత దశలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమూ కాదు.. వాంఛనీయమూ కాదు అని 21వ లా కమిషన్ లోతైన అధ్యయనం తర్వాత తేల్చిచెప్పింది. ప్రస్తుత లా కమిషన్ అదే అంశంపై అభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చింది. దేశ ప్రయోజనాల కన్నా బీజేపీ ఆకాంక్షలు భిన్నంగా ఉన్నాయని గుర్తించాలి.

- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

విద్యలో నిశ్శబ్ద విప్లవం

''సర్కార్ బడి గింత మంచిగుంటదనుకోలేదు. మేం పిల్లలను సర్కారు బడికే పంపుతున్నం. మా బడి అందంగా, ముద్దుగా ఉన్నది. రోజూ మంచిగ అన్నం పెడుతున్నరు. పుస్తకాలు ఇచ్చింఁడ్రు, బట్టలు ఇచ్చింఁడ్రు, ఇంగ్లీషు మీడియంలో చెప్పుతున్నరు. నెలకోసారి మమ్మల్ని పిల్చి మా సార్లు, టీచరమ్మలు మా పిల్లల చదువు గురించి చెప్తున్నరు! కాయకష్టం చేసేటోళ్ళం. అప్పోసప్పో చేసి మా పిల్లలనైనా మంచిగ చదివించుకోవాలని వేలకు వేలు అప్పులు చేసేటోళ్లం. ఇప్పుడు మాకు ఆ బాధ లేదు. మన కేసీఆర్ సారు బళ్లను మంచిగ చేస్తున్నరని విన్నం. మా ఊరు బడిని చూస్తే మాకు నిజమని అర్థమైంది. అందుకే ప్రైవేటుకు మాన్పించినం. మా ఊరు బళ్లోనే మా పిల్లలను చేర్చినం. మాకు ఇప్పుడు నాలుగు పైసలు మిగులుతున్నయి!''



సువర్ణ వినాయక్
96186 76215



ఈ మాటలు ఇవాళ ప్రభుత్వ బడికి పంపే పేద తల్లిదండ్రుల గుండె లోతుల్లోంచి వచ్చే మాటలు. ఇది కన్నులారా చూసే భాగ్యం ఈ విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన పాఠశాల ప్రారంభోత్సవం రోజున కలిగింది. భారత ప్రభుత్వం నుంచి కేంద్ర విద్యాశాఖలోని సంయుక్త కార్యదర్శి అమర్‌ప్రీత్ దుగ్గల్, ఉప కార్యదర్శి సుధా మీనన్ జూన్ 12వ తేదీన మన రాష్ట్రంలోని పాఠశాలల గురించి అధ్యయనం చేసేందుకు ఇక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాల అమలుతీరును క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించేందుకు విచ్చేసిన సందర్భంలో మహబూబ్‌నగర్ జిల్లా 'హన్వాడ' ప్రాథమిక పాఠశాల సందర్శనలో తల్లిదండ్రులు వారితో మాట్లాడిన మాటలు. వారితోపాటు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ అధికార బృందం 'హన్వాడ' గ్రామంలో తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. 'బడి' ఎలా ఉంది? పిల్లలు ఎలా చదువుతున్నారని చర్చించినప్పుడు చోటుచేసుకున్న చర్చల సారాంశం ఇది.

వారందరూ తరగతి గది పరిశీలనలో భాగంగా ఉపాధ్యాయులతో ముచ్చటించిన మాటలు, ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు కూడా ఆనందాన్ని కలిగించినయి. జూన్ 12వ తేదీ పాఠశాల ప్రారంభం రోజునే బోధనాభ్యసన సామగ్రితో బోధించడం, పిల్లలకు కార్యకలాపాలు, ఆటపాటలతో చదువు చెప్పడం, ఆ పిల్లలంతా ధారాళంగా చదువడం నిజంగా అద్భుత దృశ్యమే! 'సుధ' టీచర్ 3వ తరగతిలో బోధిస్తున్నప్పుడు కనిపించిన దృశ్యం ఇది.

సాధారణంగా ప్రభుత్వ బడి, ప్రభుత్వ ఉపాధ్యాయులు అనగానే చులకనగా భావించేవాళ్లు దీన్ని నమ్మకపోవచ్చు! కానీ, జరుగుతున్న వాస్తవం ఇదే. 'సుధ' టీచర్ మాట్లాడుతూ, 'గత సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమం వల్ల మేం ఫలితాలను చూడగలుగుతున్నాం! చాలా సంతృప్తిగా ఉంది, గర్వంగా కూడా ఉంది. మేం మా పిల్లల కోసం బోధనోపకరణాలను తయారుచేసుకొని బోధిస్తున్నాం. పుస్తకాలతో పాటు వీటిని ఉపయోగించడం వల్ల మా పిల్లలు అద్భుతంగా నేర్చుకుంటున్నారు. ప్రారంభంలో కొంచెం కష్టమనిపించింది. కానీ, ఇప్పుడు ఎంతో తృప్తిగా అనిపిస్తున్నది. ఆత్మవిశ్వాసంతో పనిచేయగలుగుతున్నాం' అన్నారు. 'సుధ' లాంటి ఉపాధ్యాయుల మనోభావాలు నేడు ఏ పాఠశాలకు వెళ్లినా కనిపిస్తున్నాయి.

దీనికి కారణం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత గత తొమ్మిదేండ్ల కాలంలో పాఠశాల విద్యాశాఖలో చోటుచేసుకున్న సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాల ప్రభావం అని చెప్పకతప్పదు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని కనిష్ఠ స్థాయికి పడిపోయిన విద్యా ప్రమాణాలను మూలాలతో ప్రారంభించి అభ్యసన ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు బోధిస్తుండటానికి మన రాష్ట్రంలో నిర్వహిస్తున్న గుణాత్మక కార్యక్రమాలే కారణం. 'ఆంగ్ల మాధ్యమం, ద్విభాషా వాచకాలు, డిజిటల్ వనరులు, పరీక్షల సంస్కరణలు, ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతికత వినియోగం, ఆధునీకరించిన వాచకాలు ఇందుకు మూల స్తంభాలుగా నిలిచాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రైవేటీకరణ వేగంగా విస్తరిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వం పాఠశాలల ఉనికిని కాపాడటానికి, వాటికి పునరుజ్జీవనం కలిగించడానికి ఇవి తోడ్పతున్నాయి.

ఒకవైపు గుణాత్మక కార్యక్రమాలతో ముందంజలో వెళ్తుంటే, మరోవైపు ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రధానంగా పాఠశాల విద్యావ్యవస్థను పటిష్ఠపరచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి అమలుపరుస్తున్న 'మన ఊరు - మన బడి/ మన బస్తీ-మన బడి' కార్యక్రమం ఉమ్మడి పాలనలో చితికిపోయి వెలవెలబోయిన ప్రభుత్వ బడిని సమూలంగా మార్చడానికి తోడ్పడుతున్నది. నేడు ఈ కార్యక్రమం వల్ల మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు, డిజిటల్ వనరులతో 21వ శతాబ్దపు నైపుణ్యాలను మన పిల్లలకు అందించేలా సర్కారు బడి సిద్ధమైంది. పేద బడుగు వర్గాల పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో సర్కారు బడుల్లో నేర్చుకోవడానికి ఆంగ్ల మాధ్యమం తోడ్పడుతున్నది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ తెలంగాణలోని పిల్లలందరు తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా పిలుపునిచ్చి చట్టాన్ని రూపొందింపజేయడం అభినందనీయం.

విద్యాశాఖలోని అన్ని వివరాలను సాంకేతికత ద్వారా సేకరించి సుపరిపాలనకు బాటలు వేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ కవులు, కళాకారులు, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం గురించి విద్యార్థులందరు తెలుసుకొని స్ఫూర్తి పొందేలా వాచకాలను ఆధునీకరించారు. వీటి రూపకల్పనా సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం వారికి విద్య పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. బాలికల సాధికారత కోసం నిర్వహిస్తున్న కేజీబీవీ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలిచి ఆదర్శవంతంగా ముందుకువెళ్తున్నాయి. మిగతా రాష్ట్రాల్లో 10వ తరగతి వరకు విద్యనందిస్తుంటే మన రాష్ట్రంలో ఇంటర్ వరకు విస్తరించి వారి భవితకు బాటలు వేశారు. మన గురుకులాలు నాణ్యతకు మారుపేరుగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఇలా రాష్ట్ర ఆవిర్భావం నాటి పరిస్థితితో పోలిస్తే పిల్లల నమోదు, పాఠశాలలు అందుబాటులోకి రావడం, వసతి సౌకర్యాలు మెరుగుపడటం, పాలనా సంస్కరణలు, నాణ్యమైన విద్యను అందించటం వంటి విషయాలలో ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకున్నది. నేడు విద్యాశాఖలో ఉన్న ప్రతి ఒక్కరు సగర్వంగా ఆనందించే స్థాయికి చేరుకున్నామని చెప్పకోవచ్చు.

ఈ విద్యాసంవత్సరం నుంచి బడి పిల్లలకు ఇచ్చే రాగిజావా, వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్‌లు, ఉపాధ్యాయులకు ఇచ్చే బోధనా ప్రణాళికలు, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు వంటివి మరిన్ని మెరుగైన ఫలితాలకు దోహదపడుతాయని చెప్పవచ్చు. గత సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయిలో నిర్వహిస్తున్న 'తొలిమెట్టు' కార్యక్రమంలాగానే ఈ విద్యా సంవత్సరం నుంచి 6 నుంచి 9వ తరగతి వరకు నిర్వహించనున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం, పదవ తరగతి పిల్లల కోసం అమలుచేస్తున్న సూక్ష్మస్థాయి కార్యాచరణ ప్రణాళిక ఉన్నత పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి తోడ్పడుతున్నాయి. పిల్లల్లో పఠణ సంస్కృతిని పెంపొందింపజేయడానికి బలోపేతమవుతున్న పాఠశాల గ్రంథాలయాలు, రీడింగ్ కార్నర్లు, పఠణోత్సవం కార్యక్రమం, సైన్స్ హ్యాకథాన్ వంటివి తెలంగాణలోని పాఠశాల విద్యాశాఖను అగ్రపథంలో నిలుపుతుందని ఆశించవచ్చు. బడి నుంచి భవితకు బాటలు పడటం ద్వారా బంగారు తెలంగాణ అతిత్వరలో సాకారమవుతుందని నమ్ముదాం.

పేద బడుగు వర్గాల పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో సర్కారు బడుల్లో నేర్చుకోవడానికి ఆంగ్ల మాధ్యమం తోడ్పడుతున్నది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ తెలంగాణలోని పిల్లలందరు తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా పిలుపునిచ్చి చట్టాన్ని రూపొందింపజేయడం అభినందనీయం.

(వ్యాసకర్త: విద్యావేత్త, ఎన్‌సీఈఆర్‌టీ జనరల్ బాడీ మాజీ సభ్యులు)



ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ



ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి
94402 36667

కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ దేశంలో 8వ పెద్ద రాష్ట్రం మన తెలంగాణ. ఉన్నత విద్యలో తెలంగాణ అత్యుత్తమ ప్రతిభను సాధిస్తున్నది. విద్యారంగంలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నది. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అనేక విద్యాసంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నిజానికి సాంకేతిక, సాంకేతికేతర విద్యనందించడంలో నేడు మన రాష్ట్రం దేశానికే ఆదర్శం.

ఉన్నత విద్యలో 'జాతీయ విద్య' నుంచి 'గ్లోబల్ ఎడ్యుకేషన్'కు, 'ఉపాధ్యాయ కేంద్రీకృత' నుంచి 'అభ్యాస-కేంద్రీకృత విద్య'కు మారింది. సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులను మన విద్యా వ్యవస్థ అందిస్తున్నది. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం తదేక దీక్షతో కృషిచేస్తున్నది. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, బోధనలో సాంకేతికతను పరిచయడం చేయడానికి ముఖ్యమైన ప్రణాళికలు రచిస్తూనే, వాటి అమలు కోసం విస్తృతంగా కృషి చేస్తున్నది.

రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎస్సీ: 30, ఎస్టీ: 22, బీసీ: 33 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేశారు. సంప్రదాయ కోర్సులతో పాటు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఫార్మా, న్యాయ, అగ్రికల్చరల్ కోర్సులను ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జేఎన్టీయూ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాఉటలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌ది.

వైద్య విద్యను అందరికీ అందుబాటులో తేవడం కోసం దేశంలో ఎక్కడాలేనివిధంగా ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటుచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కోఠిలోఉన్న ఉస్మానియా మహిళా కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశారు. అలాగే ములుగులోని ఎఫ్‌సీఆర్‌ఐ (ఫారెస్ట్ కాలేజీ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)ను అప్‌గ్రేడ్ చేస్తూ అటవీ విశ్వవిద్యాలయంగా ఏర్పాటుచేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, ఆలోచన, విధానాల వల్లనే రాష్ట్రం ఉన్నతమైన మైలురాళ్లను సాధించగలిగింది. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఎంతో అభివృద్ధిని సాధించగలిగాయి.

దేశంలోని జీఈఆర్ 27.3 శాతం ఉంటే తెలంగాణలో జీఈఆర్ 39.1గా నమోదైంది. దేశంలోని మహిళల జీఈఆర్ 27.9 శాతంతో పోలిస్తే తెలంగాణ మహిళల జీఈఆర్ 40.3 శాతం, దేశంలోని ఎస్సీ మహిళల జీఈఆర్ 23.9 శాతంతో పోలిస్తే తెలంగాణలో ఎస్సీ మహిళల జీఈఆర్ 39.3 శాతంగా ఉన్నది. ఈ విధంగా అనేక అంశాల్లో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని నమోదు చేస్తున్నది.

రాష్ట్రంలోని ఉన్నతవిద్యలో మహిళల నమోదు కూడా వేగంగా పెరుగుతున్నది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు మహిళలు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి దోహదపడుతున్నాయి. దేశంలో పరిశోధన, ఉన్నతవిద్యకు కేంద్రంగా హైదరాబాద్ గుర్తింబడింది. విద్యార్థులు తమ కెరీర్‌లో మరింత ప్రొఫెషనల్‌గా మారుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దోస్త్' దేశంలోనే ఒక రోల్‌మాడల్‌గా నిలిచింది. మన రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సేవల అడ్మిషన్ ప్రక్రియ 2016-17 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. ఇదెంతో పారదర్శకమైనది. ఇది మెరిట్, రోస్టర్ విధానాన్ని పాటిస్తూ, గ్రామీణ మెరిట్ విద్యార్థులు సైతం ప్రవేశం పొందడానికి దోహదపడుతుంది. అంతేకాకుండా అన్ని విశ్వవిద్యాలయాల అడ్మిషన్ల ప్రక్రియను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించేందుకు గాను తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసింది. డిమాండ్ ఉన్న అనేక కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు.

అలాగే రాష్ట్రంలో, దేశంలో కూడా ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పాఠ్య ప్రణాళిక సవరణలు తెచ్చారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), బకెట్ సిస్టమ్ వంటి ఇతర సంస్కరణలు 2019-20 విద్యా సంవత్సరం నుంచి అన్ని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశపెట్టాయి. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు విజ్ఞానాన్ని, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ ప్రోగ్రామ్స్‌తో సమానమైన కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. తద్వారా విద్యార్థులు తమ ఇష్టమైన సబ్జెక్టులను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.

పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలతో టీఎస్‌సీహెచ్‌ఈ అవగాహన ఒప్పందాలు చేసుకున్నది. దీనికి సంబంధించి టీఎస్‌సీహెచ్‌ఈ, సీసీఈ, వివిధ విశ్వవిద్యాలయాలు బ్రిటిష్ కౌన్సిల్ టీసీఎస్, ఐఎస్‌బీ, క్రిస్ప్ లాంటి అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత ప్రకారం విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నాణ్యత, సమానత, సమ్మిళితత్త్వాన్ని సాధించడానికి అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు కృషిచేస్తున్నాయి.

(వ్యాసకర్త: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్)

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2014 - 2023

విద్యాప్రగతిలో విజయ పరంపర

నేడు తెలంగాణ విద్యా దినోత్సవం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రం సాధించిన విజయాలను సంబురంగా జరుపుకొంటూనే భవిష్యత్తు లక్ష్యాలను స్థిరపరచుకుంటూ ముందుకువెళ్తున్న ఈ తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సాధించిన ఫలితాలను ప్రజల ముందుంచడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం.



రావుల శ్రీధర్‌రెడ్డి
9985575757

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఒక బృహత్ ప్రయత్నం ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయటం. ప్రత్యేకించి బడుగులకు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు, సురక్షితమైన వాతావరణంలో, అన్ని వసతులతో, సౌకర్యాలతో కూడిన విద్యనందించేందుకు చేపట్టిన గురుకుల విద్యావ్యవస్థ బలోపేతం అనేది భారత దేశంలోనే ప్రథమం అని చెప్పవచ్చు. ఒక రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్ల కాలంలో రమారమి 1000 నూతన గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు ఏర్పాటుచేయడం ప్రభుత్వాధినేత స్థిరచిత్తాన్ని ప్రత్యేకించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలలో విద్యాప్రగతి కోసం వారికున్న తపనను తెలియజేస్తుంది. ఆ వర్గాలలోని పిల్లల భవిష్యత్తు, వారి భావితరాల సమున్నత అభివృద్ధి, అదే సమయంలో ఆర్థిక సామాజిక వెనుకబాటుతనం వారి ఉన్నతికి ప్రతిబంధకం కాకూడదన్న ఒక దృఢ సంకల్పం గోచరిస్తున్నది. దాని ఫలితమే నేడు తెలంగాణలోని గురుకుల విద్యాకుసుమాలు. జాతీయస్థాయి పోటీ పరీక్షలలో సాధిస్తున్న విజయాలు. ఏదైనా ప్రయత్నానికి, గొప్ప ఆలోచనకు నిజమైన సార్థకత అనుకున్న లక్ష్యానికి చేరువ కావడమే. గురుకులాల విద్యార్థులు క్రీడలలో, సాంకేతిక విద్య లో, నీట్ లాంటి పరీక్షలలో పర్వతారోహణ వంటి క్లిష్టమైన అంశాలలో చూపిస్తున్న ఫలితాలు, ప్రతిభ ఎవరిసొత్తు కాదు, అవకాశాలు కల్పిస్తే అందరూ విజయానికి సోపానాలు వేసుకోగలుగుతారని రుజువు చేస్తున్నది.

నేడు గురుకులాల్లో ప్రవేశాల కోసం మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల రికమండేషన్లకు అవసరం వచ్చిందంటే, ప్రవేశాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పోటీ పడుతున్నారంటే, గురుకుల విద్యలో ప్రభుత్వం పెట్టిన



శ్రద్ధనే కారణం. ప్రధానంగా ఆర్థిక, సామాజిక వెనుకబాటు ఉన్న వర్గాలలో ఆడపిల్లలు ఎక్కువ కాలం చదువకపోవడం, ఉన్నత విద్యకు వెళ్లే సావాసం చేయకపోవడం, ఫలితంగా ఆర్థిక అనిశ్చితి మధ్యంతరంగా పెళ్లి చేసుకోవాల్సి రావడం వంటి పరిస్థితులు ఉండేవి. ఇలాంటి పరిస్థితులున్న పిల్లలకు ఇవాళ ప్రభుత్వ బడుల పటిష్ఠత, గురుకుల విద్య ఒక వరమైందని చెప్పవచ్చు. ప్రభుత్వం అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి ద్వారా దొరికిన ఒక భరోసా ఆడపిల్లల విద్య కొనసాగింపునకు ఒక మార్గమైందని చెప్పవచ్చు. తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో మార్పునకు కారణమైందని చెప్పవచ్చు. చదువు నుంచి పెళ్లి వరకు, బిడ్డకు తల్లయ్యేంతవరకు కూడా ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలు, కల్యాణలక్ష్మి, గర్భిణీ స్త్రీల సంరక్షణ, ప్రసూతి కేంద్రాలు, ప్రోత్సాహకాలు, ఆపై కేసీఆర్ కిట్ ఈ రకంగా స్త్రీ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషి వారిలో భద్రతాభావాన్ని పెంపొందించడమే కాదు, పూర్తిస్థాయిలో చదువును కొనసాగించి అనుకున్న మేరకు లక్ష్యాన్ని పూర్తిచేసుకోవడానికి ఒక భరోసానిచ్చిందనడంలో సందేహం లేదు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల కోసం ఏర్పాటు చేసిన స్టడీ సర్కిళ్లు ఆయా వర్గాలు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు తోడ్పడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన గ్రంథాలయాలు, పటిష్ఠం చేయబడినవి. నూతనంగా ఏర్పాటుచేసిన రీడింగ్ కార్నర్లు, పఠనా సామర్థ్యాన్ని పెంచుకునే కేంద్రాలవుతున్నాయి. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు సహాయపడుతున్నాయి. 'మన ఊరు- మన బడి' ద్వారా రాష్ట్రంలోని 26,065 పాఠశాలల్లో 12 అంశాలను చేపట్టి ఆధునీకరిస్తున్నది ప్రభుత్వం. కాంపౌండ్ వాల్స్, తాగునీరు, నూతన టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, పై కప్పుల పరిరక్షణకు రిపేర్లు, పాఠశాల ప్రాంగణంలో అవసరమైన రిపేర్లు, ఎలక్ట్రిక్ వ్యవస్థ ఆధునీకరణ, గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, డిజిటల్ విద్యకు ఐ.ఎఫ్.పీ తదితరాలు గ్రామీణ బస్తీ పాఠశాలలను పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన చేసేందుకు తీర్చిదిద్దుతున్నాయి. అల్పాహారం, ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితరాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సౌకర్యవంతమవుతున్నాయి. ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్ మాత్రమే కాకుండా విదేశీ విద్యకు కూడా ప్రభుత్వ సాయం అందుతున్నది. సాధారణ కుటుంబాల పిల్లలు బాగుండాలి, వారి చదువుల్లో వెలుగులు నిండాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం సాకారం అవుతున్నది.

యూనివర్సిటీలలో ఆధునిక మౌలిక వసతుల ఏర్పాటుకు సంకల్పించిన ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో నూతన హాస్టళ్లు, పరిపాలన భవనాలు, ల్యాబ్‌లు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు, ఆధునీకరణకు, పెద్ద ఎత్తున నిధులు కేటాయించి కార్యాచరణకు పూనుకున్నది.

పై విధంగా రాష్ట్రంలో పాఠశాల విద్య మొదలుకొని ఉన్నత విద్య వరకు సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. దశాబ్ది ఉత్సవాల సాక్షిగా ఈ సంకల్పం మరింత దృఢతరమై రాబోయే రోజుల్లో, కేసీఆర్ నేతృత్వంలో, రాష్ట్రంలో విద్యావ్యవస్థ భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది.

(వ్యాసకర్త: టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్)